
జ్ఞాన సిద్ధాంతం
రూ॥200/-
పేజీలు:210
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



అధ్యాపకులకు ఎదురుదెబ్బ
రిటైర్మెంట్ వయసు పెంపు ప్రభుత్వ విధాన నిర్ణయం : హైకోర్టు తీర్పు 08

ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడమే తమ ఏకైక డిమాండ్ 12



సంపుటి 09, సంచిక: 193 | శనివారం | 13-06-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## మీనాక్షి నటరాజన్ పిటిషన్ కొట్టివేత

ఎలక్షన్ కమిషన్‌ను ఆశ్రయించాలని సుప్రీం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. రిటర్నింగ్ అధికారి నామినేషన్‌ను తిరస్కరిస్తే, ఎలక్షన్ కమిషన్‌ను ఆశ్రయించడం ఒక్కటే మార్గమని స్పష్టం చేసింది. రాజ్యసభ ఎన్నికల్లో తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ, సర్వోన్నత న్యాయస్థానం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే ఈ కేసు యోగ్యత (మెరిట్స్) గురించి తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, తరువాయి 12లో

# నయా నియంతృత్వం

"పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 7 ముంపు మండలాలను ఏపిలో కలిపిన తరహాలోనే తెలంగాణ ప్రయోజనాల కోసం మహారాష్ట్ర నుంచి ఒక 1500 ఎకరాలను కిషన్‌రెడ్డి సాధించలేరా?



## రాజ్యాంగ విలువలకు బిజెపి పాతర
## ఓటు చోరీ లేకపోతే సీటు చోరీ

- మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య
- మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం వద్ద ఎలాంటి చర్చా జరగలేదు
- కిషన్‌రెడ్డి ఎప్పుడైనా, ఎక్కడైనా తెలంగాణ ప్రయోజనాల కోసం అనుకూలంగా మాట్లాడారో నిరూపించాలి
- శాంతిభద్రతల సమస్య తలెత్తకూడదనే పవన్ సభకు అనుమతి నిరాకరణ
- ఆయన తెలంగాణకు రావచ్చు.. పోటీ చేయొచ్చు
- ఢిల్లీ మీడియాతో 'ఇష్టాగోష్ఠి'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### హిట్లర్ నాకు ఆదర్శం కాదు

'కొందరు నన్ను హిట్లర్‌తో పోలుస్తున్నారు. నాకు హిట్లర్ ఆదర్శమని నేనెప్పుడూ చెప్పలేదు. ప్రజాస్వామ్యంలో బతుకుతున్న ఎవరైనా హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుంటారా?' అని సిఎం ప్రశ్నించారు. 'ప్రధాని మోదీనే నన్ను కౌగిలించుకున్నారు తప్ప, నేనేమీ వెళ్లలేదు' అని తన శైలిపై వస్తున్న విమర్శలకు సిఎం స్పష్టం చేశారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని సిఎం ఆరోపించారు.

ప్రజాపక్షం/హైదరాబాద్

"దేశంలో రాజ్యాంగ విలువలను కాలరాస్తూ బిజెపి నయా నియంతృత్వానికి తెరలేపింది. బిజెపికి తెలిసింది ఓట్ చోరీ. లేకపోతే సీట్ చోరీ. ఇప్పటివరకు ఓట్లు చోరీ చేసిన బిజెపి ఇప్పుడు ఏకంగా రాజ్యసభ సీట్ల చోరీకి కూడా పాల్పడుతోంది. మధ్యప్రదేశ్‌లో సంఖ్యా బలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బిజెపి దుర్బుద్ధి బయటపడింది. కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నరటరాజన్ నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య. రాజ్యసభ నామినేషన్ల పరిశీలనలో రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సింది పోయి, ఒక బిజెపి కార్యకర్తలా ప్రవర్తించారు" అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. నటరాజన్ నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బిజెపి అని సిఎం రేవంత్ విమర్శించారు. తెలంగాణ మంత్రివర్గ విస్తరణ అంశంపై ప్రస్తుతానికి అధిష్ఠానం వద్ద ఎలాంటి చర్చ జరగలేదని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. జాతీయ, రాష్ట్ర రాజకీయాలపై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

**కిషన్ రెడ్డి ఎక్కడైనా తెలంగాణ కోసం మాట్లాడారా?**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లక్ష్యంగా సిఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. కిషన్ రెడ్డి ఎప్పుడైనా, ఎక్కడైనా తెలంగాణ ప్రయోజనాల కోసం అనుకూలంగా మాట్లాడినట్లు తరువాయి 8లో

# ఇరాన్‌తో యుద్ధం ముగిసింది

- శాంతి ఒప్పందంపై యూరప్‌లో సంతకాలు
- అణ్వాస్త్రాలపై కుదిరిన అవగాహన
- అమెరికా అధ్యక్షుడి సంచలన ప్రకటన
- అందులో మేము లేము: ఇజ్రాయిల్
- అణు చర్చలకు 60 రోజులు : టెహ్రాన్



**వాషింగ్టన్/తెల్ అవీవ్/టెహ్రాన్:** ఇరాన్‌తో యుద్ధం ముగించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఈ వారాంతంలో శాంతి ఒప్పందం ఖరారవుతుందని, యూరప్‌లో సంతకాలు జరుగుతాయని తెలిపారు. ఇరాన్ చమురు పరిశ్రమను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించిన కొన్ని గంటల్లోనే ట్రంప్ మాట మార్చేశారు. ఇరాన్‌కు చావు దెబ్బ తప్పదన్న వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటూ గల్ఫ్ దేశంపై సైనిక దాడులు ఆపేస్తూ ఆదేశాలు జారీచేశారు. ఒవల్ కార్యాలయంలో ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ యూరప్‌లో శాంతి ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హాజరవుతారని తెలిపారు. ఇదే అంశమై ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, కువైట్, పాకిస్థాన్ సహా పశ్చిమాసియా దేశాల అధినేతలతో సంప్రదింపులు జరిపినట్లు కూడా వెల్లడించారు. ఒప్పందం ఖరారైన తర్వాత హోర్ముజ్ జల సంధి పూర్తిగా తెరుచుకుంటుందని చెప్పారు. 'ఇది చాలా బలమైన అవగాహన ఒప్పందం. కాస్త భావనాత్మకమే అయినప్పటికీ జరిగి తీరుతుంది' అని అన్నారు. ఈ అవగాహన ఒప్పందం సమగ్రంగా ఉండబోదోందని చెప్పారు. అణ్వస్త్రాలను ఎప్పటికీ తయారు చేయము, కొనుగోలు చేయము అని ఇరాన్ మాట ఇచ్చిందని అన్నారు. అసలు వాళ్ల వద్ద అణ్వాయుధాలు ఉండనే ఉండవన్నారు. చాలా కొద్ది మంది మాత్రమే ఇంతటి భీకర పరిస్థితులను తట్టుకోగలరంటూ ఇరాన్‌ను ద్దేశించి అన్నారు. తనా కంటే కూడా ఒప్పందం కోసం ఇరాన్ ఎక్కువగా ఆరాటపడినట్లు ఒక ప్రశ్నకు ట్రంప్ సమాధానమిచ్చారు. అనంతరం గవర్నర్ పదవి కోసం పోటీ చేస్తున్న జార్జియా లెఫ్టినెంట్ గవర్నర్ తరపున ప్రచారంలో ట్రంప్ పాల్గొన్నారు. టెలీ ర్యాలీలో మాట్లాడిన ఆయన ఇరాన్‌తో యుద్ధాన్ని అమెరికా ముగించిందని ప్రకటించారు. 'మీరు విన్నారో లేదో నాకు తెలియదు కానీ ఈ రోజు ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించాం. అణ్వస్త్రాలు ఎప్పటికీ తయారు చేయమని వారు (ఇరాన్‌నుద్దేశించి) అంగీకరించారు. ఇందుకోసం మనం పట్టుపట్టాం. ఇదంతా ఈ ఉద్దేశం కోసమే జరిగింది' అని ట్రంప్ అన్నారు. శుద్ధి చేసిన యురేనియం ఇరాన్‌లోనే ఉంచేందుకు ఆయన అంగీకరించారని సమాచారం. అది ఐరాస ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలోనే ఉండాలని... అణు కార్యక్రమాలపై టెహ్రాన్ ఎలాంటి చర్యలు చేపట్టాలన్నా, అమెరికాతో రెండో ఒప్పందం తర్వాతేనని తరువాయి 8లో



## రాజీపడిన ప్రధాని దేశ ప్రజలను రక్షించలేరు

ముగ్గురు భారతీయ నావికుల ప్రాణాలు తీసిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేసే ధైర్యం లేదు : రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ :** వాణిజ్య నౌకపై అమెరికా సైనిక దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. వారి ప్రాణాలు తీసిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేసే ధైర్యం, బలం రెండూ లేని కారణంగా రాజీపడిన ప్రధాని భారత మాత బిడ్డలను రక్షించలేకపోయారని కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీ మండిపడ్డారు. ఈ విషయంపై ప్రధానమంత్రి మోదీ మౌనం వహించడాన్ని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు ప్రశ్నించారు. 'మూడు రోజుల వ్యవధిలో తరువాయి 12లో



## ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల లోగో ఆవిష్కరణ

- సెప్టెంబర్ 6–8 వరకు కరీంనగర్ పట్టణంలో మహాసభలు
- నూతన లేబర్ కోడ్‌లపై మహాసభలో చర్చించి ఉధృతమైన పోరాట కార్యక్రమాలు నిర్ణయిస్తాం : యూసుఫ్

ప్రజాపక్షం/హైదరాబాద్

కరీంనగర్ పట్టణంలో సెప్టెంబర్ 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు జరగనున్న ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల లోగోను ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ఆవిష్కరించారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్య నారాయణ రెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శులు బి.వెంకటేశం, ఎం.ప్రవీణ్ కుమార్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ యూసుఫ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకు వచ్చిన నాలుగు నూతన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లపై ఈ మహాసభల్లో చర్చించి మరింత ఉధృతమైన పోరాట కార్యక్రమాలను నిర్ణయించనున్నట్లు తెలిపారు. కార్మిక సంఘాలు చేసిన అనేక పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతన సవరణ చేపట్టి, నామమాత్రంగా వేతనాలు పెంచి, వాటిని జూన్ 1వ తేదీ నుంచి అమల్లోకి తీసుకువచ్చిందని, దీనిపై కూడా మహాసభల్లో చర్చించి, తరువాయి 8లో

## కారుణ్య డిపెండెంట్ ఉద్యోగాలకు నియామక పత్రాలు

నేడు మంచిర్యాలలో అందజేయనున్నట్లు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వెల్లడి

- ఏర్పాట్లు చేయాలని సింగరేణి యాజమాన్యానికి ఆదేశం
- అతి త్వరలో యథావిధిగా సింగరేణి మెడికల్ బోర్డు
- అత్యంత పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలని స్పష్టీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

సింగరేణిలో వివిధ కారణాలతో కొద్ది కాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మెడికల్ బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, వివాదరహితంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి అభివృద్ధిపై ఇటీవల కోల్ బెల్ట్ ప్రాంత శాసన సభ్యులు, మంత్రులతో నిర్వహించిన సమావేశం సందర్భంగా మెడికల్ బోర్డు అంశాన్ని వారు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ అంశంపై కార్మికుల ఆందోళనలను వివరించారని చెప్పారు. ఈ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటోందని డిప్యూటీ సిఎం కార్యాలయం తెలియజేసింది. మెడికల్ బోర్డు ప్రక్రియ ద్వారా నిజంగా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారి వారసులకు కారుణ్య నియామకాల రూపంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు, మధ్యవర్తిత్వం లేదా మోసాలకు తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని, మెడికల్ బోర్డు ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉంచి యాజమాన్యానికి సహకరించాలని తరువాయి 8లో



## ఒక వాహనానికి రోజుకు 200 లీటర్లే

- ఆంక్షలు విధించిన కేంద్రం
- 90 రోజుల వరకు అమల్లోకి ఉంటాయని వెల్లడి

**న్యూఢిల్లీ :** ఇంధన సరఫరాపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పారిశ్రామిక, వాణిజ్య, సంస్థాగత వినియోగదారులు పెట్రోల్ పంపుల నుంచి పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బదులుగా వారి అవసరాల కోసం ఇంధనాన్ని బల్క్ అమ్మకపు కేంద్రాల నుంచి పొందాలని సూచించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లోకి ఉంటుందని పేర్కొంది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ ఇంధనం నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యానికి ఆదేశాలిచ్చింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ప్రకటన తరువాయి 12లో



## భారత షూటింగ్ ద్రోణాచార్య జస్పాల్ రాణా కన్నుమూత

ప్రధాని మోదీ, సిఎం రేవంత్‌రెడ్డి సంతాపం

**న్యూఢిల్లీ :** భారత దిగ్గజ షూటర్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత జస్పాల్ రాణా (49) కన్నుమూశారు. కొద్ది రోజుల కిందట అనారోగ్యానికి గురైన ఆయన ఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని నేషనల్ రైఫిల్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ధ్రువీకరించింది. ఆయన మృతి పట్ల ప్రధాని నరేంద్రమోదీ సహా పలువురు క్రీడా ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ఇటీవల షూటింగ్ ప్రపంచ కప్ కోసం ఆయన జర్మనీకి వెళ్లారు. అక్కడ్నుంచి నుంచి భారత్‌కు తిరిగి వస్తుండగా, విమానంలో ఆయనకు తీవ్రమైన ఛాతీ నొప్పి తరువాయి 8లో

# కన్నవారికి యువత భారం

- ఉన్నత చదువులు చదివించినా దొరకని కొలువులు
- ఆవేదన, ఆందోళనలో తల్లిదండ్రులు
- వట్టిపోతున్న ఉద్యోగ ఉపాధి రంగాలు
- పాలకుల విధానాలతో నిర్వీర్యమవుతున్న యువశక్తి



ప్రజాపక్షం/ఖమ్మం

"తాడేసి తనుకేసి పైస పైస కూడేసి పట్నంలో కొడుకును పై చదువు చదివిస్తే కొలువు దొరకక పోయరా కొమరన్న కొడుకు బరువై పోయేరా". 50 ఏళ్ల క్రితం తెలంగాణ సామాజిక కవి గూడా అంజయ్య రాసిన పాట ఇది. నేటి పరిస్థితులకు ఈ పాట అద్దం పడుతుంది. నానా తంటాలు పడి పిల్లలను చదివిస్తే వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక తల్లిదండ్రులకు భారంగా మారుతున్నారు. ఎల్‌కె జి నుంచి ఉన్నత చదువుల వరకు ఎంతో శ్రమించి చదివించిన ఫలితం దక్కడం లేదు. రాను రాను ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వట్టిపోతున్నాయి. పాలకులు ఏమి చెప్పినా దేశ జనాభాలో సగం భాగం ఉన్న యువశక్తి అవకాశాలు లేక నిర్వీర్యమవుతున్నది. ఒకప్పుడు చదివితే ఉద్యోగం గ్యారెంటీ అన్న భావన ఉండేది కానీ నేడు సాంకేతిక విద్యను అభ్యసించిన అవకాశాలు దక్కడం లేదు. గడిచిన పదేళ్లలో ఈ పరిస్థితి మరింత దారుణంగా మారిపోయింది. ఒక పక్క ప్రభుత్వ రంగం పాలకుల విధానాలతో నిర్వీర్యమవుతున్నది. సరిగ్గా 12 ఏళ్ల క్రితం యేటా రెండు కోట్ల తరువాయి 8లో

## సమ్మక్క – సారక్క ప్రాజెక్టుకు ఎన్‌ఒసి జారీచేయండి

- ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి
- అన్ని అనుమతులు లభించాయి.. డిపిఆర్ లేకపోవడంతో పనులు నిలిచాయని వివరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

ఛత్తీస్‌గఢ్,తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో నిర్మించనున్న "సమ్మక్క–సారక్క" ప్రాజెక్టు డిపిఆర్‌ను కేంద్ర జలసంఘం తుది పరిశీలనకు తీసుకెళ్లేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం తరపున అవసరమైన అభ్యంతర రహిత పత్రాన్ని (ఎన్ఒసి) జారీ చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయిని తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర జల సంఘంలోని అంతర్రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ మినహా మిగతా అన్ని ప్రధాన డైరెక్టరేట్ల నుంచి ప్రాజెక్టుకు ఇప్పటికే అనుమతులు లభించాయని, ఎన్‌ఒసి లేకపోవడంతో డిపిఆర్ తుది పరిశీలన నిలిచిపోయిన విషయాన్ని ఆయన వివరించారు. దీనిపైన తరువాయి 12లో

# ప్రైవేటు పాఠశాలలకు ముకుతాడెన్నడు?

మరో రెండు రోజుల్లో కొత్త విద్యా సంవత్సరం (2026–27) ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రైవేటు పాఠశాలలు, ముఖ్యంగా హైదరాబాద్ లోని కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల మోత మోగిస్తున్నాయి. అనేక చోట్ల యాజమాన్యాలు ఈ సారి 20–30 శాతం పెంచేశాయి. వీటికి అదనంగా పాఠశాలలే స్వంతంగా తయారు చేసి, ముద్రించే స్టడీ మెటీరియల్‌పై రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. పిల్లలను బడికి పంపే ప్రైవేటు ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ బస్సుల ఛార్జీలు కూడా పెరిగిపోయాయి. పెరిగిన పెట్రో, గ్యాస్ ధరలు, ద్రవ్యోల్బణంతో విలవిలలాడుతున్న మధ్యతరగతిపై ఫీజుల పెంపు మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా మారింది. రాష్ట్రంలోని మూడింట రెండొంతుల తల్లిదండ్రులు ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు. జాతీయ విద్యా హక్కు చట్టం కింద పాతిక శాతం సీట్లు పేదలకు కేటాయించాలన్న ఆదేశం ఎండమావిగా మారింది. నూతన ప్రభుత్వం వచ్చి సగం కాలం గడుస్తున్నప్పటికీ ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల విషయంలో పెద్దగా మార్పు కనపడకపోగా, మరిన్ని కొత్త సంస్థలు వేళ్ళూనుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో పాతుకుపోయిన రెండు, మూడు కార్పొరేట్ చెయిన్ విద్యా సంస్థలకు తోడుగా ఉత్తరాది నుంచి గత రెండేళ్ళ నుంచి కొత్త విద్యా సంస్థలు ఇంటర్మీడియెట్ స్థాయిలో అడుగుపెట్టాయి. తెలుగు రాష్ట్రాలలో విద్యా వ్యాపారం వందల కోట్లలో ఉండడమే ఇందుకు కారణం. అవి తాజా విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యారంగంలోకి కూడా ప్రవేశించాయి. పెద్ద ఎత్తున పాఠశాలలను ఏర్పాటు చేసుకున్నాయి. చాలా మటుకు వాటికి వేరుగా అనుమతుల్లేవు. ఇప్పటికే ఉన్న చిన్న పాఠశాలల గుర్తింపుతో వాటిని లాగిస్తున్నారు. ప్రభుత్వాధికారులు కూడా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

పాలకులు ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రైవేటు విద్యా సంస్థలపై కొరడా ఝుళిపిస్తాననడం, ఆనక మిన్నకుండడం పరిపాటిగా మారింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన విద్యా కమిషన్ సమగ్ర నివేదికను ఇచ్చినప్పటికీ అమలుపై మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీ గురించి కమిషన్ కళ్ళకు గట్టినట్లుగా వివరించింది. తెలంగాణ ప్రైవేటు అన్‌ఎయిడెడ్ ఫీజు నియంత్రణ కమిషన్ ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. అయినప్పటికీ అది ముందుకు సాగడం లేదు. దాని అధ్యయనాన్ని ప్రభుత్వ సలహాదారులు కె.కేశవ రావు నేతృత్వంలోని కమిటీకి అప్పగించారు. విద్యా సంవత్సరంలోకి అడుగుపెట్టినా ఇంకా తెమలలేదు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలలను 27వేల నుంచి4 వేలకు కుదిస్తానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. బిఆర్ఎస్ హయాంలో మూసివేసిన 6వేల పాఠశాలలను తిరిగి మెరుగైన వసతులతో పునఃప్రారంభిస్తామని, ప్రతి చిన్న గ్రామానికి ఒక ప్రైమరీ స్కూలు ఏర్పాటు చేస్తామని, ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక అప్పర్ ప్రైమరీ, హై స్కూల్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేసిన బాసలు మరవరాదు. దశలవారీగా ప్రైవేటుకు దీటుగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రవేశపెట్టడం వంటి చర్యలు ప్రభుత్వం పట్ల సానుకూలత తీసుకువచ్చాయి. కానీ, పాఠశాలల సంఖ్య తగ్గింపుపై సిఎం తాజా వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఏ నేపథ్యంలో, ఎందుకు ఆ మాటలన్నారనే విషయంపై ఇప్పటికీ స్పష్టత రానప్పటికీ, అది తొందరపాటే. ఇప్పటికే ఇంటర్మీడియెట్ కు బదులు పాఠశాలల్లోనే పదవ తరగతి తరువాత ప్లస్ టూ విధానాన్ని ప్రవేశపెడతామని, గత విద్యా సంవత్సరం చివర్లో హడావుడిగా ప్రకటించి ప్రభుత్వం వెనక్కి తగ్గింది. అలాగే జాతీయ విద్యా విధానంపై కమిటీ అధ్యయనం చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, ఎన్ఇపి కిందనే పిఎం – శ్రీ పథకం ద్వారా రాష్ట్రంలో పలు పాఠశాలు కేంద్రం నుంచి నిధులను స్వీకరిస్తున్నాయి.

ఇలాంటి వాటిపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ప్రైవేటు పాఠశాలల్లో విచ్చలవిడిగా పెరిగిన ఫీజులను యుద్ధ ప్రాతిపదికన తగ్గించడం, వసూలు చేసిన ఫీజులను తల్లిదండ్రులకు ఇప్పించటం, ప్రభుత్వ పాఠశాలలను, ఉపాధ్యాయుల సంఖ్య, మౌలిక వసతుల పెంపును రాష్ట్ర ప్రభుత్వం తక్షణ కర్తవ్యంగా తీసుకోవాలి. ●



## కాంగ్రెస్ విధ్వంసానికి మోదీ కుట్ర

కాంగ్రెస్ పార్టీని, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకే ప్రధాని నరేంద్ర మోదీ కీలక పదవుల్లో తన అనుయాయులను నియమించారు. 'మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాన్ని తిరస్కరించడం చట్టవిరుద్ధం, అనైతికం, ప్రజాస్వామ్య వ్యతిరేకం.ప్రధాని మోదీ ఆదేశం లేకుండా ఈ సంఘటన జరిగి ఉండేది కాదు. తన మనుషులను, ముఖ్యంగా తనకు సన్నిహితులైన రిటర్నింగ్ అధికారులను కీలక పదవుల్లో నియమించి మోదీ కుట్ర పన్నుతున్నారు. వారి ప్రభుత్వం ఎక్కడ ఉన్నా, చట్టాలను, నియమాలను, నిబంధనలను పాటించని వారిని అక్కడ నిలబెట్టారు. తాము ఎంచుకున్న వారిని ఏకపక్షంగా తిరస్కరిస్తారు. జార్ఖండ్‌లో కూడా ఇలాంటి సమస్యే తలెత్తింది.

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



## కుట్టు మిషన్ చరిత్రకు రెండు శతాబ్దాలు

పూర్వకాలంలో నూలు వస్త్రాలను శ్రమించి చేతులతో కుట్టుకునే సంస్కృతి నుంచి నేడు కుట్టు యంత్రం లేదా సీవింగ్ మిషన్ ఆవిష్కరణ తర్వాత అతి తక్కువ సమయం, శ్రమ వెచ్చించకుండానే అత్యంత సులభంగా, అందమైన రీతుల్లో వస్త్రాలు కుట్టుకోవడానికి మార్గం సుగమం అయ్యింది. నేడు ఇంటింటి మహిళల ఆత్మీయ నేస్తం అయ్యింది కుట్టు మిషన్. మహిళలకు మిత్రుడి వలె నిలుస్తూ, జీవనోపాధులను చూపుతోంది అద్భుత కుట్టు యంత్రం. నేడు వస్త్ర పరిశ్రమ కొత్త పుంతలు తొక్కడానికి నేడు కుట్టు మిషన్లు మానవ ప్రమేయ యంత్రాలు, ఎలక్ట్రానిక్, కంప్యూటరైజ్డ్, ఎలక్ట్రిక్ రూపాల్లో పలు సైజులు, ఆకృతుల్లో కనిపిస్తున్నాయి. కుట్టు మిషన్ల రాకతో టైలరింగ్ వృత్తితో పాటు అసంఖ్యాక మహిళలు ఆర్డర్లు తీసుకొని ఇంటి నుంచే బట్టలు కుడుతూ తమ తమ జీవనోపాధులను పొందడం జరుగుతున్నది.

**జాతీయ కుట్టు మిషన్ దినం:**

కుట్టు మిషన్ ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏట జూన్ 13 న జాతీయ కుట్టు మిషన్ దినం లేదా నేషనల్ సీవింగ్ మిషన్ డే పాటించడం ఆనవాయితీగా మారింది. కుట్టు మిషన్ ఆవిష్కరణ మానవాళి నిత్య జీవితంలో, జీవనశైలిలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. ఫ్యాషన్ ప్రపంచానికి ఇది ఓ అద్భుత వరంగా మారింది. పెద్ద ఎత్తున వస్త్రాలను తయారు చేయడం, ఫ్యాషన్ లోకంలో అసంఖ్యాక డిజైన్లను పరిచయం చేయడం, వస్త్ర పరిశ్రమ రూపురేఖల్ని మార్చి వేయడం కొనసాగుతోంది. నేడు టైలరింగ్ వృత్తులు, ఫ్యాషన్ డిజైనర్లు, సాధారణ మహిళలు, అభిరుచి కలిగిన వ్యక్తులు కుట్టు మిషన్ ప్రాధాన్యాలను గుర్తించి దాని ప్రచారానికి ఎనలేని కృషి చేస్తున్నారు. జాతీయ కుట్టు మిషన్ దినం వేదికగా కుట్టు మిషన్ ప్రదర్శనలు, కుట్టు మిషన్ పని తీరు పట్ల అవగాహన, కుట్టు మిషన్ సహాయంతో తయారు చేసిన పలు రకాల వస్త్ర డిజైన్ల ప్రదర్శనలు, ప్రఖ్యాత టైలర్లను సన్మానించడం, కుట్టు మిషన్లలో వచ్చిన ఆధునిక సాంకేతిక మార్పులు లాంటివి అవగాహన చేసుకోవచ్చు.

**కుట్టు మిషన్ పుట్టుక :**

కుట్టు మిషన్ చరిత్ర 150 ఏండ్ల క్రితమే ప్రారంభమైంది. 13 జూన్ 1829 రోజున ఫ్రెంచ్ టేఫెంచ్ బార్థలెమి టిమ్మోనియర్ కృషితో కుట్టు యంత్రం కనుగొనబడింది. అంతకు పూర్వం పలు ప్రయత్నాలు జరిగిన విషయం కూడా జరగడం జరిగింది. 10 సెప్టెంబర్ 1847న అమెరికన్ ఇలియాస్ హోవె తొలిసారి కుట్టు మిషన్‌ను పేటెంట్ చేసారు. 1851లో ఐజాక్ సింగర్ అను శాస్త్రవేత్త అత్యాధునిక కుట్టు యంత్రం రూపొందించి వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయడం జరిగింది. కుట్టు మిషన్ తయారీలో తమ మేధస్సును వెచ్చించిన పలువురు ఆవిష్కర్తలకు కృతజ్ఞతలు తెలపడం మన కనీస బాధ్యత అవుతుంది.

నేడు వస్త్ర పరిశ్రమ పెద్ద ఎత్తున పెరగడానికి పునాదిగా నాటి, నేటి కుట్టు మిషన్ నిలుస్తున్నది. నేడు కుట్టు మిషన్ సామాన్యుల ఇంటిలో ఒక అవిభాజ్య భాగం అయ్యింది. మహిళలు తమ ఇంటి వస్త్రాలను, జీవనోపాధిగా ఇతరుల వస్త్రాలను కుట్టడానికి మన కుట్టు మిషన్ దోహదపడుతున్నది. మనకు వస్త్రాలను కుట్టి, మన అందాన్ని ఇనుమడింపజేస్తున్న టైలర్స్‌కు కృతజ్ఞతలు తెలుపుదాం. కుట్టు మిషన్ల ప్రదర్శనలకు వెళ్లి పలు రకాల కుట్టు యంత్రాలను చూసి వద్దాం.

*(13 జూన్ జాతీయ కుట్టు మిషన్ దినోత్సవం సందర్భంగా)*

బిఎంఆర్

# పంజాబ్‌లో ఆధిపత్యం కోసం బిజెపి ఎత్తులు



డాక్టర్ అరుణ్ మిత్ర

పంజాబ్ శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆ రాష్ట్ర రాజకీయ వాతావరణం వేగంగా మారుతోంది. ఓటర్లను ఆకర్షించేందుకు అన్ని రాజకీయ పార్టీలు వ్యూహరచన చేస్తున్నాయి. అలాగే, రాజకీయ పొత్తుల గురించి చర్చలు కూడా ప్రారంభమయ్యాయి. అవి ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి.

కేంద్రంలోని ఆర్ఎస్ఎస్–బిజెపి ప్రభుత్వం, ఎన్నికల సంఘం ద్వారా ఓటర్ల జాబితాల 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్) ప్రక్రియను చేపట్టింది. ఈ కసరత్తు గతంలో కొన్ని ఇతర రాష్ట్రాల్లో బిజెపికి రాజకీయ ప్రయోజనాలను చేకూర్చింది. పంజాబ్‌లోనూ అదే తరహా విధానాన్ని అనుసరిస్తున్న సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే, పంజాబ్‌లోని తమ సాంప్రదాయ 'హిందూ–ముస్లిం విభజన' వ్యూహం పెద్దగా ఎన్నికల లబ్ధి చేకూర్చకపోవచ్చని బిజెపికి బాగా తెలుసు. రాష్ట్రంలోని ముస్లిం జనాభా ప్రధానంగా మలేర్‌కోట్ల జిల్లాలో కేంద్రీకృతమై ఉండగా, లూధియానా వంటి నగరాల్లోని పరిశ్రమల్లోనూ, రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ రంగంలోనూ గణనీయ సంఖ్యలో ముస్లిం వలస కార్మికులు పనిచేస్తున్నారు. అందుకే బిజెపి పంజాబ్‌లో భిన్నమైన వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు కనిపిస్తోంది.

పంజాబ్‌లో సిక్కు జనాభా అధికం. వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత వ్యాపారాలలో సిక్కులు కీలక పాత్ర పోషించడంతో పాటు, పట్టణ ప్రాంతాల్లోనూ గణనీయమైన ఉనికిని కలిగి ఉన్నారు. హిందువులు ప్రధానంగా పట్టణాలు, నగరాల్లో నివసిస్తూ, వివిధ వాణిజ్య, వ్యాపార కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నారు.

భారతదేశంలోని ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చి దశాబ్దాలుగా పంజాబ్‌లో స్థిరపడిన వారు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. అంతే కాకుండా, వివిధ మతపరమైన వర్గాలు, 'డేరాలు' (మతపరమైన కేంద్రాలు) ప్రజలలోని వివిధ వర్గాలపై గణనీయమైన ప్రభావాన్ని కలిగి ఉన్నాయి. దీనిని గుర్తించిన బిజెపి, బహుముఖ వ్యూహాన్ని అవలంబిస్తూ ఈ మతపరమైన సంస్థలతో సంబంధాలను బలోపేతం చేసుకునే ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

గురు రవిదాస్ జయంతి సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జలంధర్‌లోని ప్రభావవంతమైన 'డేరా సచ్‌ఖండ్ బల్లన్'ను సందర్శించారు. ఈ పర్యటనలో ఆయన అక్కడ నివాళులర్పించి, ఆ డేరా ఆధ్యాత్మిక అధిపతి అయిన సంత్ నిరంజన్ దాస్‌ను కలిశారు. ప్రధానమంత్రి పర్యటనకు ముందే, జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్, మాజీ కేంద్ర మంత్రి విజయ్ సంప్లా, బిజెపి నాయకుడు అవినాష్ చందర్‌లతో కూడిన పంజాబ్ బిజెపి సీనియర్ నాయకుల బృందం కూడా ఆ డేరాను సందర్శించింది.

అలాగే హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ, పంజాబ్ బిజెపి అధ్యక్షుడు కేవల్ సింగ్ ధిల్లాన్ బియాస్‌లోని 'రాధా స్వామి సత్సంగ్ బియాస్' (ఆర్ఎస్ఎస్‌బి) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. సైనీ అక్కడ ఆర్ఎస్ఎస్‌బి అధిపతి బాబా గురీందర్ సింగ్ ధిల్లాన్‌ను కలిశారు. ఆశీర్వాదం పొందడం, ఆధ్యాత్మిక, సామాజిక అంశాలపై చర్చించడం ఈ భేటీ ఉద్దేశమని సమాచారం. ఈ పర్యటనలు ఆ ప్రాంతంలోని ప్రధాన మతపరమైన సంస్థల అనుచరుల మధ్య తమ ప్రభావాన్ని విస్తరించడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలను నొక్కి చెబుతున్నాయి.

'డేరా సచ్చా సౌదా' హర్యానాలో ఉన్నప్పటికీ, పంజాబ్‌లో కూడా దీనికి గణనీయమైన సంఖ్యలో అనుచరులు ఉన్నారు. దీని అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ జైలులో ఉన్నప్పటికీ, ఆయనకు ఇంకా గట్టి పట్టు ఉంది. ఆయనకు తరచుగా లభించే పెరోల్ (తాత్కాలిక విడుదల) వివాదాలకు దారితీస్తుంటుంది, అలాగే ఎన్నికల సమయంలో ఆయన ప్రభావాన్ని వ్యూహాత్మకంగా వినియోగించుకుంటారని చాలామంది పరిశీలకులు భావిస్తుంటారు.

ఇటీవల బిజెపి తన రాజకీయ వ్యూహానికి మరో కోణాన్ని జోడించినట్లు కనిపిస్తోంది. ప్రజాక్షేత్రంలో కొన్ని ఆలోచనలను వదిలి, దానిపై ప్రజల స్పందనను అంచనా వేసి, ఆ తర్వాత వాటిని ముందుకు తీసుకెళ్లాలా వద్దా అని నిర్ణయించుకోవడం ఆర్ఎస్ఎస్‌కు పరిపాటిగా వస్తున్న పద్ధతి. ఈ నేపథ్యంలో, మహారాష్ట్ర మంత్రి గిరీశ్ మహాజన్ జూన్ 6న మెహతా చౌక్‌లోని 'దమ్దమీ తక్సాల్' ప్రధాన కార్యాలయంలో జరిగిన 'ఆపరేషన్ బ్లూ స్టార్' స్మారక కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో 'ఆపరేషన్ బ్లూ స్టార్' సమయంలో భారత సైన్యంతో పోరాడిన వారిని 'అమరులు' అని ఆయన బహిరంగంగా పేర్కొన్నారు. స్వర్ణ దేవాలయంపై సైనిక చర్య చేపట్టాలని నాటి ప్రధాని ఇందిరా గాంధీపై బిజెపి నేత లాల్ కృష్ణ అద్వానీ ఒత్తిడి తెచ్చారన్న విషయం అందరికీ తెలిసిందే.

ప్రపంచంలో ఎక్కడైనా సరే, ఒక ప్రధాన మతపరమైన ప్రదేశంలో సాయుధ చర్య చేపట్టడం అనేది ఎప్పుడూ వివాదాస్పదమే అవుతుంది. ఎందుకంటే అలాంటి ప్రదేశాలతో ప్రజల గాఢమైన భావోద్వేగాలు ముడిపడి ఉంటాయి. కాంగ్రెస్ పార్టీ పాత్రను మహాజన్ 'అహ్మద్ షా అబ్దాలీ' పాత్రతో కూడా పోల్చారు. 1984లో ప్రధాని ఇందిరా గాంధీని ఆమె భద్రతా సిబ్బంది హత్య చేసిన తర్వాత ఢిల్లీ, ఇతర ప్రాంతాల్లో సిక్కు వ్యతిరేక హింసను ప్రేరేపించడంలో పలువురు కాంగ్రెస్ నాయకులు నిందనీయమైన పాత్ర పోషించారనడంలో సందేహం లేదు. అయితే, ఆ సమయంలో సిక్కు వ్యతిరేక భావనను పెంచడంలో క్షేత్రస్థాయిలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పోషించిన పాత్రపై మాత్రం తక్కువ దృష్టి సారించబడింది.

ముఖ్యంగా బర్నాలా ప్రభుత్వ హయాంలో జరిగిన 'ఆపరేషన్ బ్లాక్ థండర్' గురించి మహాజన్ ఎక్కడా ప్రస్తావించలేదు. స్వర్ణ దేవాలయ ప్రాంగణం నుండి సాయుధ మిలిటెంట్లను తొలగించడానికి 'ఆపరేషన్ బ్లాక్ థండర్'ను రెండు దశల్లో చేపట్టారు. 'ఆపరేషన్ బ్లాక్ థండర్–1' 1986 ఏప్రిల్ 30 రాత్రి ప్రారంభమై మే 1న ముగిసింది. 'ఆపరేషన్ బ్లాక్ థండర్–2' 1988 మే 9న మొదలై, మిలిటెంట్ల లొంగుబాటుతో మే 18న ముగిసింది. ఈ ఆపరేషన్లు 'ఆపరేషన్ బ్లూ స్టార్' నుండి గణనీయంగా భిన్నంగా ఉన్నాయి. వీటికి ప్రధానంగా నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జి), పంజాబ్ పోలీసులు నాయకత్వం వహించారు. పౌర ప్రాణనష్టాన్ని, పుణ్యక్షేత్రానికి జరిగే నష్టాన్ని తగ్గించడంపై ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ వీటిని నిర్వహించారు. బ్లాక్ థండర్–1 సమయంలో, ముఖ్యమంత్రి సుర్జిత్ సింగ్ బర్నాలా కేంద్ర జోక్యం కోరారు, దాని ఫలితంగా భద్రతా దళాలను మోహరించారు. బ్లాక్ థండర్–2 ప్రారంభమయ్యేనాటికి, బర్నాలా ప్రభుత్వం డిస్మిస్ కావడంతో పంజాబ్ రాష్ట్రపతి పాలనలో ఉంది.

శిరోమణి అకాలీ దళ్‌తో ఎన్నికల పొత్తుకు అవకాశం ఉందని బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సూచించినట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. ఇది కొన్ని వైరుధ్యాలను లేవనెత్తుతుంది. చారిత్రాత్మకంగా, అకాలీలు, దమ్దమీ తక్సాల్ ఎల్లప్పుడూ ఉమ్మడి రాజకీయ దృక్పథాలను పంచుకోలేదు. తీవ్రవాదం ప్రబలంగా ఉన్న అల్లకల్లోల సంవత్సరాలలో దమ్దమీ తక్సాల్ ప్రముఖ పాత్ర పోషించింది. ఖలిస్తాన్ ఉద్యమం, వేర్పాటువాద భావజాల ప్రచారంతో సంబంధం కలిగి ఉంది. అకాలీ నాయకత్వం హింసను లేదా వేర్పాటువాదాన్ని సమర్థించలేదు. అయినప్పటికీ ఈ ధోరణులను వ్యతిరేకించటంలో అకాలీలు అవసరమైనంత చొరవ చేయలేదనీ, లేదా మౌనంగా ఉన్నారనే భావన ప్రజల్లో ఉంది.

రాజకీయంగా మతపరమైన గుర్తింపు పాతుకుపోయిన పార్టీగా అకాలీ దళ్ లౌకిక విశ్వసనీయత తరచుగా ప్రశ్నించబడింది. అకాలీ నాయకులు సిక్కులపై వివక్ష ఆరోపణలకు సంబంధించిన సమస్యలను పదేపదే లేవనెత్తడం, కొన్ని సందర్భాల్లో భారత రాజ్యాంగ ప్రతులను చించివేయడం వంటి ప్రతీకాత్మక చర్యలకు పాల్పడటం కూడా గమనార్హం. అటువంటి చర్యలు ఆ కాలంలో ప్రజల అభిప్రాయాలను, రాజకీయ చర్చలను రూపొందించడంలో దోహదపడ్డాయి.

అకాలీలతో భవిష్యత్తులో పొత్తు పెట్టుకుంటే అది తమను ఆధిపత్య స్థానంలో నిలబెడుతుందని బిజెపి ఆశిస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే, ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల దృష్ట్యా ఇది అంత సులభమేమీ కాకపోవచ్చు. సంప్రదాయబద్ధంగా సిక్కు ఓట్లను ఏకీకృతం చేయడానికి ప్రయత్నించిన అకాలీ దళ్, ఇప్పుడు అనేక ఇతర సంస్థల నుండి పోటీని ఎదుర్కొంటోంది. అలాంటి ఒక కొత్త శక్తే 'వారిస్ పంజాబ్ దే'. దీనికి ప్రస్తుతం పార్లమెంట్ సభ్యుడు, బోధకుడు అమృత్‌పాల్ సింగ్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ సంస్థ వ్యవస్థాపకుడు, నటుడు— ఉద్యమకారుడు అయిన దీప్ సిద్ధు మరణానంతరం ఆయన నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల అమృత్‌పాల్ సింగ్ పరోక్షంగా లబ్ధి పొందారని విమర్శకులు ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో దీప్ సిద్ధుకు బహిరంగంగా ఉన్న సాన్నిహిత్యం కూడా ఈ సంబంధాల స్వభావాన్ని కొందరు రాజకీయ పరిశీలకులు ప్రశ్నించేలా చేసింది. ఫలితంగా, అమృత్‌పాల్ సింగ్ రాజకీయ ప్రస్థానంపై కూడా ప్రశ్నలు తలెత్తాయి.

పంజాబ్‌లో మత విభజనను పరోక్షంగా ప్రోత్సహించడంలో బిజెపి పాత్ర గతంలో కూడా చూసాం. తీవ్రవాదం ఉధృతంగా ఉన్న కాలంలో శాంతి కమిటీ సమావేశాలలో కొంతమంది బిజెపి నాయకులు చేసిన ప్రసంగాలు ఐక్యతను పెంపొందించే బదులు, తరచుగా మత విద్వేష ధోరణులను ప్రతిబింబిస్తూ మత విభజనలను బలపరిచాయి. ఈ నేపథ్యంలో, పంజాబ్‌లో బిజెపి చేస్తున్న ప్రస్తుత రాజకీయ ఎత్తుగడలు నిశితంగా గమనించాల్సినవి. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఎంతో నిబద్ధత కలిగిన పలువురు కామ్రేడ్‌లను కోల్పోవడంతో సహా, అనేక గొప్ప త్యాగాలు చేస్తూ వేర్పాటువాదాన్ని, ఉగ్రవాద హింసను నిరంతరం వ్యతిరేకించింది. ఆ కాలంలో మతతత్వ అధిక సంఖ్యాకవాదం, వేర్పాటువాదం రెండింటినీ వ్యతిరేకిస్తూ 'న హిందూ రాజ్, న ఖలిస్తాన్ జుగ్ జుగ్ జీవే హిందుస్థాన్ (హిందూ రాజ్ వద్దు, ఖలిస్తాన్ వద్దు, యుగయుగాలు హిందుస్థాన్ వర్ధిల్లాలి) అనే నినాదం విస్తృతంగా ప్రాచుర్యం పొందింది.

ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాయి. బిజెపి రాజకీయ పురోగతిని అడ్డుకోవడంలో పంజాబ్ విజయం సాధిస్తే, అది ఆ పార్టీకి ఒక పెద్ద ఎదురుదెబ్బ కావచ్చు. అలాంటి ఫలితాన్ని సాధించేందుకు నిశితమైన ప్రణాళిక, విశాల రాజకీయ సమీకరణ అవసరం. 1980లలో ఉన్నంత సంస్థాగత శక్తిని వామపక్షాలు ఇప్పుడు కలిగి లేవు, కానీ అవి గణనీయమైన సైద్ధాంతిక బలాన్ని నిలుపుకున్నాయి. వామపక్షాలు ఇప్పటికీ ట్రేడ్ యూనియన్‌లు, వ్యవసాయ కార్మికులు, చిన్న, సన్నకారు రైతుల మధ్య గణనీయమైన ఉనికిని కలిగి ఉన్నాయి. అనేక రాజకీయ పార్టీలు ఎన్నికల రాజకీయాలను ప్రధానంగా మతపరమైన గుర్తింపు కోణంలోనే చూస్తున్నప్పటికీ, వామపక్షాలు మాత్రం సామాన్య ప్రజలను ప్రభావితం చేసే వేతనాలు, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి, మహిళల హక్కులు వంటి అంశాలపై నిరంతరం దృష్టి సారిస్తున్నాయి.

ఈ అంశాలు ప్రజా బాహుళ్యంలో అగ్రస్థానంలో ఉండటం అత్యంత అవసరం. వామపక్ష సంఘాలు, వామపక్షాలకు వెలుపల ఉండే ప్రజాస్వామ్య, లౌకిక శక్తులను ఏకం చేయగల ఫాసిస్ట్ వ్యతిరేక విశాల కూటమిని నిర్మించి, తద్వారా విభజనవాద, అస్థిత్వ ఆధారిత రాజకీయాలకు నమ్మకమైన ప్రత్యామ్నాయాన్ని అందించడమే ప్రగతిశీల శక్తుల ముందున్న సవాలు.

# పదేళ్లు దాటినా మారని సిలబస్

ప్రస్తుతం ఒకటి నుండి పదో తరగతి వరకు అందుబాటులో ఉన్న పాఠ్యపుస్తకాలు దాదాపు పదేళ్ల క్రితం రూపొందించినవి. విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక రంగాలలో రోజుకో కొత్త ఆవిష్కరణ జరుగుతుంటే... మన విద్యార్థులు మాత్రం ఇంకా పాత తరం సిద్ధాంతాలనే బట్టీ పడుతున్నారు. కంప్యూటర్ శాస్త్ర పుస్తకాల్లో ఇప్పటికీ కీబోర్డ్ మౌస్, కార్యాలయ నిర్వహణకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలనే బోధిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుంటే, నేటితరం పిల్లల్లో ఇంకా దశాబ్దాల క్రితం నాటి ప్రాథమిక పాఠాలు నేర్పించడం విద్యా వ్యవస్థ వెనుకబాటుతనానికి నిదర్శనం. కాలంతోపాటు పాఠ్యాంశాలను నవీకరించకపోవడం వల్ల విద్యార్థులు నేర్చుకునే జ్ఞానానికి, నేటి సమాజపు అవసరాలకు మధ్య పెద్ద వ్యత్యాసం ఏర్పడుతోంది.

**ప్రశ్నాపత్రాల నమూనా, బట్టీ విధానానికి ఊతమిస్తున్న పాతపాఠ్యాంశాలు**

పాఠ్యాంశాలు మారకపోవడం వల్ల మార్కెట్‌లో లభించే గైడ్‌లు, ప్రశ్నానిధుల హవా పెరిగిపోయింది. ఏటా అవే పాఠాలు, అవే ప్రశ్నలు వస్తుండటంతో విద్యాసంస్థలు కొత్తగా ఆలోచించే శ్రమను తగ్గించుకున్నాయి. పదేళ్ల నుండి ఒకే రకమైన ప్రశ్నాపత్రాల నమూనా కొనసాగుతుండటం వల్ల, ఏ ప్రశ్నలు పరీక్షలో వస్తాయో ముందే ఊహించి, వాటిని విద్యార్థులతో బట్టీ పట్టిస్తున్నారు. దీనివల్ల విద్యార్థికి సబ్జెక్టుపై లోతైన అవగాహన, సృజనాత్మకత పెరగడం లేదు. కేవలం మార్కులు సాధించే ఒక యంత్రంగా మాత్రమే విద్యార్థి మారుతున్నాడు.

**జాతీయ, అంతర్జాతీయ పోటీలో వెనుకబాటుతనం**

పాఠ్యాంశాల నాణ్యత పెంచకపోవడం వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో తీవ్రంగా నష్టపోతున్నారు. ఉన్నత విద్యా కోర్సులకు సంబంధించిన ప్రవేశ పరీక్షలకు పునాది పడేది 6 నుండి 10 తరగతులలోనే. కేంద్ర విద్యా బోర్డులు తమ పాఠ్యాంశాలను క్రమ తప్పకుండా మారుస్తూ, అన్వయ పద్ధతిలోకి మారుతుంటే...మన సిలబస్ మాత్రం మార్పులకు దూరంగా ఉండిపోయింది. ఫలితంగా, కార్పొరేట్ పాఠశాలల్లో చదివి



ఉన్నత స్థాయి పాఠ్యాంశాలు నేర్చుకునే పిల్లలు ముందంజలో ఉంటుండగా, కేవలం ప్రభుత్వ పాఠ్యపుస్తకాలనే నమ్ముకున్న పేద, మధ్యతరగతి విద్యార్థులు పోటీకి తట్టుకోలేక వెనుకబడిపోతున్నారు.

**అధికారుల నిర్లిప్తత – పాలకుల ప్రాధాన్యతా లోపం**

పాఠ్యాంశాలను క్రమబద్ధంగా మార్చడం, నూతన జాతీయ విద్యా విధానాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం వంటి మేధోపరమైన పనులపై విద్యాశాఖకు ఆశించినంత శ్రద్ధ ఉన్నట్లు కనిపించడం లేదు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆయా కాలాల అవసరాలకు తగ్గట్టుగా వేగంగా స్పందించలేకపోతోంది. పాలకులు కూడా విద్యారంగంలో మౌలిక మార్పులు తేవడం కంటే, కేవలం ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. సిలబస్ పాతదైనా, పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచి 'విద్యా ప్రమాణాలు పెరిగాయి' అని సరిపెట్టుకుంటున్నారు తప్ప, విద్యార్థి నిజమైన జ్ఞానార్జనను అంచనా వేయడం లేదు. ఇరవై ఒకటో శతాబ్దపు విద్యార్థులకు, ఇరవయ్యో శతాబ్దపు పాఠ్యాంశాలను బోధిస్తూ... ఇరవై రెండో శతాబ్దపు పోటీ ప్రపంచాన్ని తట్టుకోమంటే అది సాధ్యం కాని పని. పదేళ్లు దాటినా సిలబస్ మార్చకపోవడం అనేది ఒక తరాన్ని మేధోపరంగా వెనుకబాటులోకి నెట్టడమే అవుతుంది. పాఠ్యపుస్తకం మారనంత కాలం విద్యార్థి ఆలోచనా విధానం మారదు. ఆలోచనా విధానం మారనంత కాలం సమాజంలో కొత్త ఆవిష్కరణలు జరగవు. ఇరవై ఒకటో శతాబ్దపు విద్యార్థులకు, ఇరవయ్యో శతాబ్దపు సిలబస్‌ను బోధిస్తూ... ఇరవై రెండో శతాబ్దపు పోటీ ప్రపంచాన్ని తట్టుకోమంటే అది సాధ్యం కాదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు తాత్కాలిక చర్యలు ఆపి, నిపుణులతో ఉన్నత స్థాయి కమిటీలను వేసి, ప్రాథమిక స్థాయి (1–10 తరగతులు) నుంచే కంప్యూటర్ ప్రోగ్రామింగ్ (కోడింగ్), ఆర్థిక అక్షరాస్యత, అనువర్తిత విజ్ఞానం (అప్లైడ్ సైన్స్) వంటి ఆధునిక అంశాలతో కూడిన నూతన పాఠ్యాంశాలను తీసుకురావాలి. అప్పుడే మన ప్రభుత్వ పాఠశాలల పిల్లలు కూడా ప్రపంచంతో ధీటుగా పోటీ పడగలరు.

**కాళేశ్వరం కృష్ణమూర్తి,** 9705196097.

# దేశ ఆర్థిక భద్రతకు కీలకం 'కోకింగ్ కోల్'

ఇనుము, ఉక్కు కర్మాగారాల్లో ఉపయోగించే కోకింగ్ కోల్‌ను క్రిటికల్ అండ్ స్ట్రాటజిక్ మినరల్‌గా ప్రకటిస్తూ, గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) చట్టం, 1957 ప్రకారం దీనికి ప్రత్యేక హోదా కల్పించింది. భారత ప్రభుత్వం ఈ మార్పును ఎంఎండిఆర్ చట్టంలోని సెక్షన్ 11సి ఆధారంగా చేసింది. ఈ సవరణ ద్వారా చట్టంలోని ఫస్ట్ షెడ్యూల్‌లోని పార్ట్–ఎలో కోల్ నిర్వచనంలో స్పష్టంగా కోకింగ్ కోల్‌ను చేర్చడమే కాకుండా, పార్ట్–డిలో దాన్ని ప్రత్యేకంగా 'క్రిటికల్ అండ్ స్ట్రాటజిక్ మినరల్' గా జాబితా చేసింది. అంటే, కోకింగ్ కోల్ దేశ ఆర్థిక, పారిశ్రామిక భద్రతకు అత్యంత కీలకమైన వనరుగా అధికారికంగా గుర్తింపు పొందింది. కోకింగ్ కోల్‌ను సాధారణ బొగ్గుతో పోల్చి చూడలేం. దీనిని మెటలర్జికల్ కోల్ అని కూడా అంటారు. ఇది ప్రత్యేక రకమైన బిట్యూమినస్ బొగ్గు. దీన్ని అధిక ఉష్ణోగ్రతల వద్ద ఆక్సిజన్ లేని పరిస్థితుల్లో కాల్చినప్పుడు కోక్ అనే పదార్థం తయారవుతుంది. ఈ కోక్ ఉక్కు తయారీలో, ముఖ్యంగా సంప్రదాయ బ్లాస్ట్ ఫర్నేస్ పద్ధతిలో, తప్పనిసరిగా అవసరమైన ముడిసరకుగా పనిచేస్తుంది. ఇనుము ధాతువును పిగ్ ఐరన్‌గా మార్చే ప్రక్రియలో కోక్‌కు ప్రత్యామ్నాయం ఇప్పటికీ పూర్తిగా లభించలేదు. కోకింగ్ కోల్‌కు ఉన్న ప్రత్యేక విలువ దాని భౌతిక, రసాయన లక్షణాల్లోనే దాగుంది. ఇది వేడి చేసినప్పుడు మెత్తబడుతూ, ఉబ్బుతూ, తిరిగి గట్టి కోక్‌గా మారే కేకింగ్ ప్రాపర్టీస్‌ను కలిగి ఉంటుంది. అలాగే ఇందులో బూడిద, గంధకం, ఫాస్ఫరస్ వంటి మలినాలు తక్కువగా ఉండటం చాలా ముఖ్యం. ఈ లక్షణాల వల్లే ఇది ఉక్కు తయారీలో అత్యంత నాణ్యమైన ముడిసరకుగా మారింది. ఒక టన్ను ఉక్కు తయారయ్యేందుకు సగటున సుమారు 780 కిలోగ్రాముల కోకింగ్ కోల్ అవసరం అవుతుందన్న అంచనా, దీని వ్యూహాత్మక ప్రాధాన్యతను మరింత స్పష్టంగా చూపిస్తుంది. ప్రపంచ స్థాయిలో చూస్తే, కోకింగ్ కోల్ ఉత్పత్తిలో చైనా, ఆస్ట్రేలియా, రష్యా, అమెరికా, కెనడా వంటి దేశాలు ముందున్నాయి. ముఖ్యంగా ఆస్ట్రేలియా ప్రపంచ మార్కెట్‌లో కోకింగ్ కోల్ సరఫరాకు కీలక కేంద్రంగా ఉంది. అంతర్జాతీయ ధరలు, సరఫరా గొలుసులు, భౌగోళిక రాజకీయ పరిణామాలు ఈ దేశాల విధానాలపై బాగా ఆధారపడి ఉంటాయి. ఈ పరిస్థితుల్లో ఒక దేశం తన ఉక్కు పరిశ్రమకు అవసరమైన ప్రధాన ముడిసరకును భారీగా దిగుమతులపై ఆధారపడి పొందడం, దీర్ఘకాలికంగా ఆర్థిక, వ్యూహాత్మక ప్రమాదాలకు దారి తీస్తుంది.





## ప్రైవేట్ విద్యాసంస్థల్లో
# ఫీజుల దోపిడీని అరికట్టాలి

### ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కల్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. అఖిల భారత విద్యార్థి సమైక్య (ఎఐఎస్ఎఫ్) హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో బాలసముద్రంలోని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ అధ్యక్షతన విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రైవేట్ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టడం, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడం, ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించి విద్యను బలోపేతం చేయడం వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కల్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ విద్య అనేది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, దానిని వ్యాపార వస్తువుగా మార్చే విధానాలను తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, విద్యార్థుల హక్కుల సాధన కోసం విద్యార్థి నాయకులు నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను 7,000 నుండి 4,000కు కుదించే ఆలోచనపై చేసిన వ్యాఖ్యలు ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన సమయంలో వాటి సంఖ్యను తగ్గించే సంకేతాలు ఇవ్వడం విద్యా హక్కును బలహీనపరిచే చర్యగా ప్రజలు భావించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఈ వ్యాఖ్యలపై స్పష్టత ఇవ్వాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనుమతులు, ప్రమాణాలు లేకుండా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యా ప్రమాణాలను ఉల్లంఘించే సంస్థల గుర్తింపులను రద్దు చేయాలని కోరారు. విద్యారంగంలో పెరుగుతున్న ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణ ధోరణులు సామాన్య, మధ్యతరగతి కుటుంబాల విద్యా అవకాశాలను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా ప్రైవేట్ రంగానికి ప్రోత్సాహం ఇవ్వడం సామాజిక అసమానతలను మరింత పెంచుతుందని పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, టిఆర్ఎస్వీ, పిడిఎస్‌యు, ఎఐఎఫ్డీఎస్, పిడిఎస్‌యు, యుఎస్ఎఫ్ఐ, ఎబిఎస్ఎఫ్, బిఎస్ఎఫ్, డిఎస్ఎ, ఎస్ఎస్ఎఫ్ తదితర మొత్తం 11 మంది విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలోని విద్యారంగ పరిస్థితులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలు, ప్రభుత్వ విద్యాసంస్థలలో నెలకొన్న లోపాలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు భాషబోయిన సంతోష్, రాచకొండ రంజిత్, బైరిపాక నరేష్, మాస్ సావిత్రి, మర్రి మహేష్, మంద నరేష్, రాజేష్ నాయక్, బొట్ల మనోహర్, కామ్రేడ్ శివ, చార్వాక, నరేష్ తదితరులు మాట్లాడుతూ ప్రత్యేకంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులపై తీవ్రమైన ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. విద్య హక్కు, సామాజిక న్యాయం, సమాన అవకాశాల పరిరక్షణ కోసం విద్యార్థి సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో భవిష్యత్తులో దశలవారీగా, అవసరమైతే నిరవధికంగా ఉద్యమాలు చేపట్టాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాస్వామ్యవాదులు ఈ పోరాటాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరు ప్రణీత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీపతి వినయ్, బొజ్జ జ్యోతి, జక్కుల భాను ప్రసాద్, అజయ్ లతోపాటు తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## టిజిపిఎస్‌సి ఫీజుల పెంపుతో
# నిరుద్యోగులపై ఆర్థిక భారం

### ఎఐవైఎఫ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) ఇటీవల పలు ఉద్యోగ నోటిఫికేషన్లలో దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజును రూ.200 నుంచి రూ.ఒక వెయ్యికి పెంచడం ద్వారా నిరుద్యోగ యువతపై తీవ్ర ఆర్థిక భారం మోపిందని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి విమర్శించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసే అవకాశాన్ని కేవలం డబ్బున్న వారికి మాత్రమే పరిమితం చేసే విధంగా ఈ నిర్ణయం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పెంచిన ఫీజులను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది. పెంచిన ఫీజులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ ప్రతినిధులు శుక్రవారం నాంపల్లిలోని టిజిపిఎస్‌సి కార్యాలయంలో అదనపు కార్యదర్శి సరితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో దరఖాస్తు ఫీజులను నాలుగు రెట్లు పెంచడం నిరుద్యోగులపై అదనపు భారమని పేర్కొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు రూ.500, ఓసి, బిసి అభ్యర్థులకు రూ.ఒక వెయ్యి ఫీజు నిర్ణయించడం అన్యాయమన్నారు. ఒకే శాఖలోని పోస్టులను కూడా వేర్వేరు నోటిఫికేషన్లుగా విడుదల చేయడం వల్ల అభ్యర్థులు ప్రతి నోటిఫికేషన్‌కు విడివిడిగా ఫీజులు చెల్లించాల్సి వస్తోందన్నారు. ఇటీవల రోడ్లు భవనాల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎఇఇ) పోస్టులు, కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టులు, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులకు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఒక అభ్యర్థి కేవలం దరఖాస్తులకే వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్. బాలకృష్ణ, రాష్ట్ర సమితి సభ్యుడు షేక్ మహమూద్ పాల్గొన్నారు.



# రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాల్సిందే : ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. అనుమతులేని పాఠశాలలను గుర్తించి వాటి పేర్లు బహిర్గతం చేయడంతో పాటు ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో జిఓ నెంబర్ 1, 42, 91 అమలు చేసే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్రంలో పాఠశాల విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల విద్యా అడిషనల్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల వారు నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ ఫీజుల పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని, టెక్నో, ఈ టెక్నో, వరల్డ్, ఒలంపియాడ్, వంటి పేర్లతో ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం ఇష్టానుసారంగా ఫీజులు పెంచుకున్నారని, ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయకపోవడంతో విద్యాశాఖ నిబంధనలు పాటించకుండా పాఠశాలలు నిర్వహణ చేస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలోనే పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయిస్తూ పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మార్చుతున్నారని మండిపడ్డారు.

తెలంగాణ రాష్ట్రంలో జూన్ 15 నుండి పాఠశాలలు పునఃప్రారంభం నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు అందించాలని కోరారు. అనేక పాఠశాలల్లో టీచర్ల కొరత ఉన్నందున విద్యార్థులు చదువులకు ఆటంకం కలగకుండా ప్రణాళికలు రూపొందించడంతో పాటు మధ్యాహ్న భోజనం ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి అనిల్, చైతన్య యాదవ్, రాష్ట్ర నాయకులు మురళి, ఉదయ్ పాల్గొన్నారు.

## ఆపరేషన్ 'నన్హే ఫరిష్తే'లో 512 మంది చిన్నారులకు రక్షణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దక్షిణమధ్య రైల్వే (ఎస్‌సిఆర్) పరిధిలోని రైల్వే రక్షణ దళం (ఆర్‌పిఎఫ్) 'ఆపరేషన్ నన్హే ఫరిష్తే' కింద జనవరి నుంచి మే 31 వరకు 512 మంది తప్పిపోయిన, కుటుంబాలకు దూరమైన లేదా ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను రక్షించి పునరావాసం కల్పించింది. రైల్వే స్టేషన్లు, రైళ్లలో గుర్తించిన ఈ చిన్నారుల్లో 421 మంది బాలురు, 91 మంది బాలికలు ఉన్నారు. రక్షించబడిన చిన్నారులను సంబంధిత బాలల సంక్షేమ కమిటీలకు (సిడబ్ల్యుసి) అప్పగించి అవసరమైన సంరక్షణ, పునరావాస చర్యలు చేపట్టేలా ఆర్‌పిఎఫ్ చర్యలు తీసుకుంది. చిన్నారుల రక్షణలో ఆర్‌పిఎఫ్ చేస్తున్న సేవలకు ఇది నిదర్శనంగా నిలుస్తోంది. గత ఏడాది 2025లో మొత్తం 1,622 మంది చిన్నారులను, 2024లో 1,390 మంది చిన్నారులను ఆర్‌పిఎఫ్ రక్షించి కుటుంబాలకు చేర్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో చిన్నారుల భద్రత విషయంలో ఆర్‌పిఎఫ్ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని స్పష్టమవుతోంది. ఆపరేషన్ నన్హే ఫరిష్తేలో భాగంగా రైల్వే స్టేషన్లు, రైళ్లలో ప్రత్యేక నిఘా నిర్వహిస్తూ ప్రమాదంలో ఉన్న చిన్నారులను గుర్తిస్తున్న ఆర్‌పిఎఫ్, బాలల సంరక్షణ సంస్థలతో సమన్వయం చేసుకుని తక్షణ సహాయం అందిస్తోంది. అలాగే చిన్నారులలో కనిపించే మానసిక ఒత్తిడి, అసురక్షిత పరిస్థితులను గుర్తించేలా ఆర్‌పిఎఫ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ ఆర్‌పిఎఫ్ సిబ్బందిని అభినందించారు.

చిన్నారుల రక్షణలో ఇదే నిబద్ధత, అప్రమత్తతతో ముందుకు సాగాలని సూచించారు. రైల్వే ప్రయాణికులు కూడా ఈ కార్యక్రమానికి సహకరించాలని, రైళ్లలో లేదా స్టేషన్లలో ఒంటరిగా ఉన్న లేదా ఇబ్బందుల్లో ఉన్న చిన్నారులు కనిపిస్తే వెంటనే రైల్వే హెల్ప్‌లైన్ 139కు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు సీజ్

### రాష్ట్ర వ్యాప్తంగా 25,987 విద్యాసంస్థల వాహనాలు
### ఈనెల 15 నుంచి ప్రత్యేక తనిఖీలు
### జెటిసి చంద్రశేఖర్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో జూన్ 15 నుంచి పాఠశాలలు, విద్యాసంస్థలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ రవాణా శాఖ ప్రత్యేక తనిఖీ డ్రైవ్ చేపట్టనుందని రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. విద్యార్థులను రవాణా చేసే అన్ని విద్యాసంస్థల బస్సులు, ఇతర వాహనాలు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఫిట్‌నెస్ లేని వాహనాలు, అనుమతికి మించి విద్యార్థులను ఎక్కించే (ఓవర్‌లోడ్) వాహనాలు, భద్రతా ప్రమాణాలు పాటించని వాహనాలపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ముఖ్యంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ (పియుసి) చెల్లుబాటులో ఉన్నాయా?, వాహనాల్లో అనుమతించిన సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్నారా?, డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, తగిన అనుభవం ఉందా?, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్టింగ్విషర్, ఎమర్జెన్సీ ఎగ్జిట్ వంటి భద్రతా సౌకర్యాలు ఉన్నాయా?, బ్రేకులు, టైర్లు, లైట్లు తదితర యాంత్రిక భాగాలు సక్రమంగా పనిచేస్తున్నాయా?, విద్యార్థుల భద్రత కోసం అటెండర్‌ను నియమించారా? అనే వాటిపై ప్రత్యేక దృష్టిసారించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 25,987 విద్యాసంస్థల బస్సులు ఉండగా, వాటిలో 22,158 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాయని చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. మిగిలిన 3,829 బస్సులు వెంటనే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసి సర్టిఫికెట్ పొందాలని సూచించారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్..**

ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్న లేదా ఓవర్‌లోడ్ చేస్తున్న వాహనాలను వెంటనే సీజ్ చేయనున్నట్లు చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం వాహన యజమానులు, డ్రైవర్లు, సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థులను రవాణా చేసే వాహనాల నిర్వహణ, భద్రతా ప్రమాణాల అమలు, నిబంధనల పాటింపు పూర్తిగా పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాల బాధ్యతేనని ఆయన స్పష్టం చేశారు.

**తల్లిదండ్రులకు విజ్ఞప్తి..**

అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించే వాహనాల్లో పిల్లలను పంపవద్దని తల్లిదండ్రులకు సూచించారు. తనిఖీల్లో ఫిట్‌నెస్ లేని లేదా ఓవర్‌లోడ్ వాహనాలు సీజ్ చేయబడితే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని, తమ పిల్లలు ప్రయాణించే వాహనాల ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలు, అనుమతులపై ముందుగానే నిర్ధారించుకోవాలని జెటిసి చంద్రశేఖర్ గౌడ్ పేర్కొన్నారు.


**GRATER HYDERABAD MUNICIPAL CORPORATION**
**హైదరాబాద్ మహానగరపాలక సంస్థ**

| NIT No. | పని వివరణ | అంచనా విలువ / ECV | డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | ఇఇ / ఎస్ఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 15 | 1 పని కొరకు, రాజేంద్రనగర్ జోన్‌లోని రాజేంద్రనగర్ సర్కిల్-19లో 900 మి.మీ. వ్యాసం కలిగిన పైపుల అనుసంధాన పనుల కోసం. | రూ.9.80 లక్షలు | తేది: 12.06.206 సా.4.30 గం.లకు | తేది: 15.06.2026 సా.4.40గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్ర నగర్, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9989930608. ఇ-మెయిల్: eec11.ghmc2@gmail.com |

నం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ సర్కిల్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 4188-PP/CL/ADVT/2026-27, Date: 12-06-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**

| NIT No & Date | పని వివరణ | అంచనా విలువ | ప్రారంభ తేది & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | ఇఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 10/DB/EE-II/Bowenpally Circle/MMC/2026-27, తేది: 12.06.2026 | 1. ఎంఎంసి, మల్కాజ్‌గిరి జోన్, బోయిన్‌పల్లి సర్కిల్-03 పరిధిలో 5 నెలల కాలానికి వివిధ ప్రాంతాలలో BT / CC ప్యాచ్ మరియు క్యాచ్‌పిట్ మరమ్మతు పనులతో కూడిన రహదారి భద్రతా నిర్వహణ పనులు (మొత్తం 5 పనులు). | రూ.77.80 లక్షలు | 15.06.206 సా.5.00 గం.లకు | 18.06.2026 సా.5.00 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్-3, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.eprocurement.gov.inలో చూడవచ్చు.
నం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్-3, ఎంఎంసి.
DIPR R.O. No. : 4224-PP/CL/ADVT/2026-27, Date: 12-06-2026

**సూపరింటెండెంట్ కార్యాలయం**
**ఉస్మానియా జనరల్ హాస్పిటల్ : హైదరాబాద్**

Rc.no. STNR/A14/OGH/HYD/2026/845, **టెండరు ప్రకటన** తేదీ: 11-06-2026

**విషయం:-** 2026-28 కాలానికి (రెండు సంవత్సరాలు) ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వినియోగం కోసం నిర్దిష్ట స్టేషనరీ వస్తువులు మొదలైన వాటిని సమకూర్చుకోవడం గురించి.
**సూచన:-** ఆమోదించబడిన కార్యాలయ నోట్ Rc.No. STNR/A14/OGH/HYD/2026, తేదీ: 11-06-2026
@@@@@@
హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వినియోగం కోసం 2026-28 కాలానికి (రెండు సంవత్సరాలు) నిర్దిష్ట స్టేషనరీ వస్తువులు మొదలైన వాటిని సమకూర్చుకోవడానికి అధీకృత డీలర్లు / ఏజెన్సీలు / సేవా ప్రదాతల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి.
01. టెండర్ ఫారం రుసుము రూ. 5,000/- ను OGH లోని NPR బ్లాక్, క్యాష్ సెక్షన్‌లో చెల్లించాలి.
02. టెండర్ ఫారాల విక్రయం 15-06-2026 నుండి 20-06-2026 వరకు, అన్ని పని దినాలలో ఉదయం 10.30 నుండి సాయంత్రం 4.00 గంటల మధ్య OGH స్టేషనరీ విభాగంలో జరుగుతుంది.
03. సీల్డ్ టెండర్ సమర్పణకు చివరి తేదీ: 22-06-2026. దీనితో పాటు "సూపరింటెండెంట్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్" పేరిట రూ. 1,00,000/- విలువైన డి.డి. (DD)ని EMDగా జతచేసి OGH ఇన్‌వార్డ్ విభాగంలో సమర్పించాలి.
04. వెండర్లు / ఏజెన్సీల ప్రతినిధుల సమక్షంలో, 24-06-2026న మధ్యాహ్నం 12.30 గంటలకు OGH సూపరింటెండెంట్ ఛాంబర్‌లో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి.
ఏదైనా లేదా అన్ని టెండర్లను ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా అంగీకరించడానికి / తిరస్కరించడానికి / రద్దు చేయడానికి హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్, సూపరింటెండెంట్‌కు పూర్తి అధికారాలు ఉంటాయి.
భవదీయులు
నం/- సూపరింటెండెంట్
ఉస్మానియా జనరల్ హాస్పిటల్
హైదరాబాద్.
DIPR R.O. No. : 4211-PP/CL/ADVT/2026-27, Date: 12-06-2026

**ఇల్లందు మున్సిపాలిటీ కార్యాలయం**
**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

నోటీసు. Roc. No. E1/70/2026, **కొటేషన్ నోటీసు** తేదీ: 12.06.2026

పనుల వివరాలు:
1) ఆలం (Alum), సున్నం సరఫరా, 2) సానిటేషన్ PPE కిట్లు, మలాథియాన్, థెమోపాస్ (Thermopous/Fogging chemical), బయో-టెక్స్ రసాయనాలు, కోడ్ యూనిఫాంల సరఫరా, 3) ఫ్రేమ్‌లతో కూడిన మరియు లేని ఫ్లెక్సీలు, ఆర్ట్ పెయింటింగ్‌లు & వాల్ రైటింగ్ పెయింటింగ్స్, 4) నీటి పంపిణీ పైప్‌లైన్ పనులు, ఫౌండ్రీ పనులు, వివిధ సామర్థ్యాల 1.5 HP, 2.0 HP, 3.0 HP, 5.0 HP,7.5 HP, 15 HP, 20 HP, 50 HP మోటార్ల రీవైండింగ్ (మోనో బ్లాక్ & సబ్‌మెర్సిబుల్), 5) సిరీస్ లైటింగ్, ఫ్లడ్ లైటింగ్, బారికేడ్లు, సౌండ్ సిస్టమ్, అలంకరణ, జనరేటర్, టెంట్, కుర్చీలు, బల్లలు, సైడ్ వాల్స్, తాగునీటి ఏర్పాట్లు, 6) కార్యాలయ వాహనాల (ఆటోలు, ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లు) మరమ్మతులు, 7) సిస్టమ్‌లకు సర్వీసింగ్, ప్రింటర్ల కొనుగోలు మరియు రీఫిల్లింగ్, 8) కార్యాలయ అవసరాలకు వాహనాల అద్దె (కార్లు, JCB, డోజర్, చైన్‌మెషీన్, ట్రాక్టర్, ఆటోలు - మైక్ అనౌన్స్‌మెంట్ కోసం), 9) వీధి దీపాల అమరికకు అవసరమైన వస్తువులు, 10) కార్యాలయ స్టేషనరీ వస్తువులు, 11) టెండర్ షెడ్యూల్ పుస్తకాలు, 12) ఘన వ్యర్థాల నిర్వహణ (Solid Waste Management) యంత్రాల నిర్వహణ మరియు ఆపరేషన్.
*గమనిక: పైన పేర్కొన్న పనులకు సంబంధించి కొటేషన్ ధరలను ప్రతి అంశానికి అనుగుణంగా గంటకు, సంఖ్యలు, లీటర్లలో, జాబ్ వర్క్ పద్ధతిలో, రోజువారీ ప్రాతిపదికన, కిలోలు లేదా చదరపు మీటర్ల వంటి కొలమానాలలో పేర్కొనాలి.*
ఆసక్తి గల కాంట్రాక్టర్లు / ఏజెన్సీలు తమ పత్రాలను సీల్ చేసిన కవరులో సంబంధిత అధికారికి సమర్పించాలి.
**కొటేషన్లు మరియు ఆసక్తి వ్యక్తీకరణ (EOI) స్వీకరణ తేదీలు:** 15.06.2026 నుండి 17.06.2026 సాయంత్రం 4:30 గంటల వరకు.
**కొటేషన్లు (EOI) తెరిచే తేదీ:** 17.06.2026, సాయంత్రం 5:00 గంటలకు.
సమర్పించిన సీల్డ్ కొటేషన్లు సంబంధిత సంస్థల ప్రతినిధుల సమక్షంలో తెరవబడతాయి. మరిన్ని వివరాల కోసం మున్సిపల్ కమిషనర్, ఇల్లందు మున్సిపాలిటీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారిని సంప్రదించండి.
**సంప్రదించవలసిన వివరాలు: ఇల్లందు మున్సిపాలిటీ.**
**మొబైల్ నంబర్: 9849905883**
నం/- కమిషనర్
ఇల్లందు మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 4172-PP/CL/ADVT/2026-27, Date: 12-06-2026


## సముద్ర తీరం లేకపోయినా..
# లాజిస్టిక్స్ హబ్‌గా తెలంగాణ

### 'లాజిస్టిక్స్ పాలసీ 2.0'తో గ్లోబల్ డెస్టినేషన్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దనున్న ప్రభుత్వం : మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సముద్ర తీరం లేకపోవడం తెలంగాణకు బలహీనత కాదని, దానినే వ్యూహాత్మక ప్రయోజనంగా మార్చుకుని రాష్ట్రాన్ని అంతర్జాతీయ లాజిస్టిక్స్ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

'తెలంగాణ రైజింగ్–2047' విజన్‌కు అనుగుణంగా లాజిస్టిక్స్ రంగాన్ని ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని వెల్లడించారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్–2026'లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ, ఎగుమతుల సన్నద్ధత సూచీలో తెలంగాణ దేశంలో ఎనిమిదో స్థానంలో, సముద్ర తీరం లేని రాష్ట్రాల్లో రెండో స్థానంలో నిలవడం రాష్ట్ర పారిశ్రామిక సామర్థ్యానికి నిదర్శనమన్నారు. అలాగే మర్చండైజ్ ఎగుమతుల్లో దేశంలో ఏడో స్థానాన్ని సాధించడం తెలంగాణ వేగవంతమైన అభివృద్ధిని ప్రతిబింబిస్తోందన్నారు. రాష్ట్రంలో 'లాజిస్టిక్స్ పాలసీ 2.0' అమలు ద్వారా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టులు, బాండెడ్ వేర్‌హౌజ్‌లు, ఆధునిక లాజిస్టిక్ పార్కుల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడంతో పాటు, కృత్రిమ మేధస్సు (ఎఐ), మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక సాంకేతికతలను లాజిస్టిక్స్ రంగంలో విస్తృతంగా వినియోగించేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. మల్టీ మోడల్ లాజిస్టిక్స్, రైల్ కనెక్టివిటీ, ఎయిర్ కార్గో, కోల్డ్ చైన్, గ్రేడ్ ఏ వేర్‌హౌజింగ్, ఆటోమేషన్, డిజిటల్ లాజిస్టిక్స్ ప్లాట్‌ఫార్మ్స్, గ్రీన్ మొబిలిటీ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలను మంత్రి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని రకాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షుడు ఆర్. రవికుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కేకే మహేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గరిమెళ్ల, షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ కమిటీ చైర్మన్ కమల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో వారం రోజులు వర్షాలు

### పలు జిల్లాలకు భారీ వర్షాల సూచన
### ఉరుములు-మెరుపులతో కూడిన ఈదురుగాలులు
### హెచ్చరికలు జారీ చేసిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా రాగల వారం రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం వేగంగా మారుతోంది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తం చేశారు.

శుక్రవారం సాయంత్రం విడుదల చేసిన వాతావరణ బులెటిన్ ప్రకారం, జూన్ 13 ఉదయం వరకు మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అదే సమయంలో ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో వడగాల్పుల పరిస్థితులు కొనసాగవచ్చు అన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. శనివారం, ఆదివారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో పాటు దక్షిణ తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఆదివారం నుంచి జూన్ బుధవారం వరకు నల్లగొండ, సూర్యాపేట, జనగాం, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కొనసాగే అవకాశం ఉందన్నారు.

బుధవారం నుంచి శుక్రవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గనున్నాయి. శుక్రవారం ఆదిలాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదైనట్లు తెలిపారు. మిగిలిన జిల్లాల్లో 36 నుంచి 40 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అయితే జూన్ సోమవారం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు.

# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సమగ్ర జిల్లా కార్యాలయ సముదాయం (ఐడీఓసీ)లో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించి యాసంగి ధాన్యం కొనుగోళ్లు, మొక్కజొన్న కొనుగోళ్లు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), మట్టి రవాణా, ప్రభుత్వ భూముల పరిరక్షణ, అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్ల (ఏటీసీ) ప్రవేశాలపై సమగ్రంగా వివరించారు. యాసంగి 202526 సీజన్‌కు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వంద శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.జిల్లాలో 59,342 మంది రైతుల నుంచి 4.35 లక్షల మెట్రిక్ టన్నుల వరిని కొనుగోలు చేసి రూ.1, 031 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించామని చెప్పారు. రైతులకు చెల్లించాల్సిన మొత్తంలో ఇప్పటికే 93 శాతం చెల్లింపులు పూర్తిచేసినట్లు తెలిపారు.గత పదేళ్లలో ఇదే అత్యధిక వరి కొనుగోలు అని పేర్కొంటూ, 202425 యాసంగి సీజన్‌లో 4.01 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరగగా,ఈసారి 4.35 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకున్నట్లు తెలిపారు.సీఎంఆర్ బియ్యం సరఫరాలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. 202425 ఖరీఫ్‌లో 100 శాతం, రబీలో 95 శాతం, 2025–26 ఖరీఫ్‌లో 39 శాతం, రబీలో 8 శాతం సీఎంఆర్ డెలివరీ పూర్తయినట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు డిఫాల్ట్‌లో ఉన్న 10 రైస్ మిల్లులకు బకాయిలు చెల్లించి, బ్యాంకు గ్యారంటీ సమర్పించిన అనంతరం మాత్రమే ధాన్యం కేటాయించినట్లు తెలిపారు.ధాన్యం రవాణాకు రోజుకు సుమారు 600 వాహనాలను వినియోగించామని, మొత్తం 1.15 కోట్ల గన్నీ సంచులు ఉపయోగించినట్లు తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లుల్లో 6.90 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం అందుబాటులో ఉండగా, అవసరాన్ని బట్టి ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, కుమురంభీం ఆసిఫాబాద్, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో కూడా అదనపు నిల్వ స్థలాన్ని వినియోగించినట్లు తెలిపారు.జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 18, 191 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని,తొమ్మిది కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 26 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసినట్లు తెలిపారు. రూ.63.40 కోట్ల విలువైన మొక్కజొన్న కొనుగోలు చేయగా, ఇప్పటికే రూ.14.84 కోట్ల చెల్లింపులు చేసినట్లు చెప్పారు. మొక్కజొన్న నిల్వ కోసం 29 వేల మెట్రిక్ టన్నుల స్థలాన్ని గుర్తించామని తెలిపారు.రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరిగినప్పటికీ పలు సవాళ్లు ఎదురయ్యాయని కలెక్టర్ తెలిపారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత, అదే సమయంలో యూరియా నిల్వలు రావడం, ఎఫ్‌సీఐ గోదాముల్లో కార్మికుల కొరత వంటి సమస్యలను అధిగమించి కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. రైతులకు ఎక్కడా కోతలు పడకుండా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు.మంథని ప్రాంతంలో మహారాష్ట్ర నుంచి వచ్చిన మూడు లారీలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సం బంధిత కొనుగోలు కేంద్రాలపై విచారణ కొనసాగుతోందని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. తదుపరి నుంచి ఆయా కేంద్రాల్లో మార్పులు చేపడతామని తెలిపారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కొత్త ప్రక్రియ కాదని, 2002లో చివరిసారిగా నిర్వహించగా ప్రస్తుతం స్వాతంత్ర్యం అనంతరం ఎనిమి దోసారి ఈ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఓటర్లలో సుమారు 80 శాతం మందిని 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేస్తున్నామని, ఇంకా 1.80 లక్షల మంది ఓటర్ల వివరాల పరిశీలన మిగిలి ఉందన్నారు.బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు సేకరిస్తారని, అవసరమైన ఆధారాలను జతచేసి సమర్పించాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి బుధవారం ఈఆర్వో స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తూ మొత్తం ప్రక్రియను పారదర్శకంగా కొనసాగిస్తున్నామని చెప్పారు.జిల్లాలో ఇటుక బట్టీలకు ఎనిమిది చెరువుల నుంచి 13,250 ట్రిప్పుల మట్టి రవాణాకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా వసూలు చేసిన రుసుమును ఆయా ప్రాంతాల అభివృద్ధి పనులకు వినియోగిస్తామని చెప్పారు. రైతులు వ్యవసాయ అవసరాల కోసం ఉచితంగా మట్టిని వినియోగించుకోవచ్చని తెలిపారు.మట్టి దుర్వినియోగం జరగకుండా పటిష్టమైన వ్యవస్థను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లిలో 72 ఎకరాల ప్రభుత్వ భూమిని, నరసింగాపూర్‌లో 48 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి విముక్తం చేసినట్లు తెలిపారు. ముత్తారం ప్రాంతంలో కూడా భూముల స్వాధీనం కోసం చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఎవరూ ఆక్రమించవద్దని, ఆక్రమణలను తప్పనిసరిగా తొలగిస్తామని హెచ్చరించారు.పెద్దపల్లి, రామగుండం ఏటీసీలలో ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు.దరఖాస్తుల సమర్పణకు జూన్ 30 చివరి తేదీగా నిర్ణయించినట్లు చెప్పారు. గతంలో ఈ కోర్సుల ద్వారా అనేక మంది విద్యార్థులు మంచి ఉద్యోగ అవకాశాలు పొందారని తెలిపారు. మంథనిలో మరో ఏటీసీకి అనుమతి లభించిందని,భూమి కేటాయింపు పూర్తై త్వరలో పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు.ఈ సమావేశంలో సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

## పెద్దపల్లి వాసికి అర్థ శాస్త్రంలో డాక్టరేట్



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని శాంతి నగర్ కు చెందిన పడాల శ్రీనివాస్ గౌడ్ శాతవాహన యూనివర్సి టీ నుండి డాక్టరేట్ పట్టా పొందారు.ఆయన శాతవాహన యూనివర్సిటీ లో ప్రొఫెసర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎకనామిక్స్ విభాగంలో సోషియో ఎకనామిక్ కండిషన్స్ ఆఫ్ అగ్రికల్చరల్ లేబర్స్ ఆఫ్ పెద్దపల్లి డిస్టిక్ ఇన్ తెలంగాణ స్టేట్ మీద రీసెర్చ్ చేశారు. దీనిపై సమగ్ర అంశాలను క్రోడీకరించిన ఆయనకు శాతవాహన యూనివర్సిటీ నుండి డాక్టరేట్ ప్రదానం చేశారు. కాగా శ్రీనివాస్ ఉన్నత విద్యాభ్యాసం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఇండియన్ మిషన్ హై స్కూల్ లో జరుగగా, ఇంటర్, డిగ్రీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్తి చేశారు. ఆయనకు డాక్టరేట్ రావడం పట్ల స్నేహితులు, పలువురు అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు పూర్తి సహకారం అందించిన శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ వరప్రసాద్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో వీధి వ్యాపారులకు, పండ్ల వ్యాపారులకు ఉచితంగా జ్యూట్ బ్యాగుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.సమాజంలో ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక నష్టాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వీధి వ్యాపారులు తలచుకుంటేనే మన పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చడం సాధ్యమవుతుందన్నారు.కాలుష్య నియంత్రణ మండలి వారు అందిస్తున్న ఈ క్లాత్,జ్యూట్ బ్యాగులను వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కస్టమర్లకు ప్లాస్టిక్ కవర్లు ఇవ్వడం బంద్ చేస్తే, వారు తప్పకుండా ఇంటి నుంచే బ్యా గులు తెచ్చుకుంటారని సూచించారు. పరిమితిలోనే వెనుక ఉన్న మున్సిపల్ షట్టర్లకు, ఇతర దుకాణదారులకు ఇబ్బంది కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చేందుకు వ్యాపార కమిటీలు, అసోసియేషన్లు మున్సిపాలిటీతో భాగస్వామ్యం కావాలని కమిషనర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి నోడల్ ఆఫీసర్ మహేష్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, చందు,పట్టణ వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

జిల్లా అటవీ రేంజ్ అధికారి సతీష్ కుమార్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం పెద్దపల్లి జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు, క్లీనింగ్ ప్రోగ్రామ్, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు జిల్లా అటవీ రేంజ్ అధికారి టి.సతీష్ కుమార్ తెల్లిపారు.పెద్దపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణలో అడవుల ప్రాధాన్యం అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలప్రిన్సిపాల్ కేదరేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు అడవుల వల్ల కలిగే ప్రయోజనాలు, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అడవుల కీలక పాత్ర, వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో అటవీ సంపద ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ప్రకృతి పట్ల బాధ్యతగా ఉండాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.మంథని అటవీ రేంజ్ అధికారి ఏం. వినయ్ నాయక్, తిరుపతి, కొమురయ్య ,నరేష్,రహమతుల్లా,అటవీ శాఖ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జగిత్యాల పట్టణంలోని మార్కెట్ వెనుక ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటుచేసుకుంది. రాచర్ల గంగాధర్ అనే కుట్టు మిషన్‌ల వ్యాపారికి చెందిన ఇల్లు అగ్నికి ఆహుతైంది. సమయానికి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో భారీ ప్రాణనష్టం తప్పింది., సమాచారం అందుకున్న వెంటనే రెండు ఫైర్ ఇంజిన్లతో ఘటన స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఇంట్లో ఉన్న సుమారు 60 కొత్త కుట్టు మిషన్లు పూర్తిగా దగ్ధమయ్యాయి.ఈ ప్రమాదంలో దాదాపు రూ.8 లక్షల మేర నష్టం జరిగినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ వాణి, కమిషనర్ సత్య ప్రణవ్, కౌన్సిలర్ అడువాల జ్యోతిలు పరిశీలించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## ఆసుపత్రి సూపరింటెండెంట్.. శ్రీధర్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా సేవలందిస్తున్న డా. శ్రీధర్ ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా సుల్తానాబాద్ సీఎస్‌సీకి బదిలీ అ య్యారు. అయితే, పెద్దపల్లి జిల్లాలో ఆయన అందించిన విశిష్ట వైద్య సేవలు, ప్రజలతో పాటు ఉద్యోగ వర్గాల్లో సంపాదించుకున్న మంచి పేరు, పరిపాలనా నైపుణ్యాలను దృష్టిలో ఉంచుకొని ఆయన బదిలీని రద్దు చేస్తూ తిరిగి పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమించడం జరిగింది.ఈ సందర్భంగా డా. శ్రీధర్ తన పునర్నియామకానికి సహకరించిన పెద్దపల్లి శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ శ్రీ విజయరామణా రావు కు, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష, మున్సిపల్ చైర్మన్ నుగిళ్ల మల్లయ్య లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.పెద్దపల్లి జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షులు మరియు ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ బొంకూరి శంకర్ , జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి రంగారెడ్డి కలిసి డా. శ్రీధర్ ను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.

# బిజెపి ఓటు చోరీతో పాటు సీటు చోరీ

ఎఐసిసి సెక్రటరీ సచిన్ సావత్

రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి పుట్టినిల్లు

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజా పక్షం/ వేములవాడ:** వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్స్ లో శుక్రవారం టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై బిఎల్ ఏ లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసిసి సెక్రటరీ సచిన్ సావత్,మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ లు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశం కోసం పాటు పడుతుంది. ఆనాడు దేశ స్వాతంత్రం కోసం పోరాటం చేశారు. మళ్ళీ నేడు మరో స్వాతంత్రం ఉద్యమం కోసం పోరాటం చేయాలి. 12 సంవత్సరాల నుండి నరేంద్ర మోదీ దేశానికి చేసింది ఏమి లేదు. మోదీ అభివృద్ధి పక్కన పెట్టి అనునిత్యం రాజకీయాలు చేస్తున్నారు. నెహ్రూ తో మోదీ పోల్చుకోవడం విడ్డూరంగా ఉంది. నెహ్రూ దేశాన్ని అభివృద్ధి చేశారు. గతంలో దేశంలో రాజులు వచ్చారు పోయారు. మోదీని కుడా ఇంకా కొన్ని రోజుల్లో ప్రజలు మరిచిపోతారు. బీజేపీ మోదీ ఓట్లను తారుమారు చేస్తున్నారు. మోదీ ఓట్ల చోరీ మానేసి దేశంలో అభివృద్ధి పై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ప్రభు త్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఏఐసిసి, పి సి సి పిలుపు మేరకు నేడు బి ఎల్ ఓ లకు ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పా టు చేశామని అన్నారు. బిఎల్ ఏలు అప్రమంతగా ఉండాలని.బీజేపీ ప్రమాదకరంగా మరి ప్రశ్నించే గొంతులను, ప్రతి పక్ష వారి ఓట్లను తొలగించటం తో పాటు, ప్రశ్నించే గొంతులను తొక్కలని చేస్తుందని ఆయన అన్నారు. బీజేపీ ఓట్ల చోరీ చేస్తూ దే శంలో ప్రమాద కారణంగా మారింది. దేశ వ్యా ప్తంగా కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు లేకుండా చేస్తు ంది.బీజేపీ ఓటు చోరీ తో పాటు సీటు చోరీ చే స్తుంది.ఒక రాష్ట్రంలో ఒకే ఇంటి లో సుమారు 45 మందిని కొత్తగా చేర్చారు. ఓటును ఉంచి నచ్చని వారి ఓట్లును తొలగిస్తుంద ని, ప్రతి పక్షం కాంగ్రెస్ పార్టీ అంటే బీజేపీ భయపడుతుంది. బీజేపీ మీనాక్షి నటరాజన్ సీటు చోరీ చేసింది. ఆమె పై అసలు కేసు నమోదు కానున్న భయపడి ఆమె నామినేషన్ రిజెక్ట్ చేశారు. రానున్న రోజుల్లో ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల పనిచేయాలని ఆయన కోరారు. వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, పిసిసి పరిశీలకులు గోపిశెట్టి రాఘవేందర్, సంగీతం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజా ప్రదినిధులు పాల్గొన్నారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలు

అభినందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాల లో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు. తంగళ్ళపల్లి మండలంలోని బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బుస్ర కౌసర్ 1000 మార్కులకు గాను 985 మార్కులు, బైపీసీ విభాగంలో ఎం.నందిని 1000 మార్కులకు గాను 977 మార్కులు సాధించినందుకు ప్రతిభా పురస్కారం ఒక్కరికి రూ.15 వేల చొప్పున ఇద్దరికి మొత్తం రూ.30వేలు జిల్లా కలెక్టర్ .గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అందజేసి.. అభినందించారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్, సంబంధిత పాఠశాలల ఇంచార్జి ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్కూళ్లకు కేంద్రం నుంచి అధిక నిధులు ఇప్పించాలి

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ ఎంపీగా ప్రభుత్వ విద్యపై ఏనాడు పార్లమెంట్ లో మాట్లాడని బండి సంజయ్ నేడు మోడీ 12 ఏళ్ల పాలన ప్రభుత్వ పాఠశాలను స్వచ్ఛతగా పరిశుభ్రంగా ఉంచాలంటూ రెండు రోజులు హడావుడి చేయడం రాజకీయ ప్రచారం కోసమేనని, బండి సంజయ్ కి ప్రభుత్వ విద్య పై చిత్త శుద్ధి ఉంటే ప్రభుత్వ పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు ఇప్పించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రతిరోజు స్వచ్ఛతగా పరిశుభ్రంగా ఉండాలంటే కేంద్ర బడ్జెట్ లో విద్యకు అధిక నిధులు కెటాయించాలని, మోడీ 12ఏళ్ల పాలనలో ప్రతి బడ్జెట్ లో విద్యారంగానికి తక్కువ నిధులిచ్చి విద్యారంగాన్ని విస్మరిస్తే ఎందుకు బండి సంజయ్ పార్లమెంట్ లో మాట్లాడలేదని ప్రశ్నించారు.కరీంనగర్ పార్లమెంట్ కి తెలంగాణ విభజన హామీల ప్రకారం రావలసిన ఐఐఐటి ఇంకా పెండింగ్ లోనే ఉందని, సైన్స్ సెంటర్ మంజూరైన ఎందుకు పనులు ప్రారంభించలేదని, పార్లమెంట్ పరిధిలోని నిరుద్యోగ యువత ఉపాధి కోసం ఒక పరిశ్రమా నైనా, ఒక పరిశోధన కేంద్రమైన కేంద్రం ఎందుకు తీసుకురాలేదని, కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ పార్లమెంట్ పరిధిలో ప్రభుత్వ విద్య అభివృద్ధి చేసేందుకు అధిక నిధులు తీసుకువచ్చి కేంద్రం నుండి ఉన్నత విద్యాసంస్థలను కరీంనగర్ లో ఏర్పాటు చేసే విధంగా చొరవ తీసుకోవాలని మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు.

## ఒక్క ఓటు వచ్చిన వ్యక్తిని ప్రధాన మంత్రి చేసిన ఘనత కాంగ్రెస్‌దే

- ఓటుచోరీ..సీటు చోరీ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు
- జివో 252తో జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం
- మెదక్ ఎంపి రఘునందన్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** 1947 మొదటి ప్రదాని ఎన్నికల్లో 16 ఓట్లు వచ్చిన సర్దార్ పటేల్‌ను కాదని..ఒక్క ఓటు వచ్చిన జవహార్‌లాల్ నెహ్రూను ప్రధాని చేసి కాంగ్రెస్ మొట్ట మొదటిసారి ఓటు చోరీ, సీటు చోరీకి పాల్పడిందని మెదక్ ఎంపి రఘునందన్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రదాని మోదీ 12ఏండ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక ఎస్ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపి రఘునందన్‌రావు మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వం ఓటు చోరీ,. సీటు చోరీకి పాల్పడిందని సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం అవివేకానికి నిదర్శనమన్నారు. 543 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి, నిజాం మెడలు వంచి హైదరాబాద్ సంస్థానాన్ని సర్దార్ పటేల్ వల్లబాయ్ పటేల్ భారతదేశంలో విలీనం చేశారని ఉక్కు మనిషి పటేల్‌ను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. నేతాజీ సుభాష్ చంద్ర బోస్‌ను స్వతంత్రం రాకముందే భారతదేశానికి మొదటి ప్రధానిగా ప్రకటించుకున్నారని, అనేక దేశాలు ఆయన్ని గుర్తించాయన్నారు. కాంగ్రెస్‌కు నెహ్రూ,రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ తప్పా ఎ వ్వరు కనబడరన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జివో 252 ద్వారా జర్నలిస్టులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఇప్పుడున్న డిజిటల్ యుగంలో పేపర్ ప్రింటింగ్, సర్కులేషన్ అంటూ అక్రిడిటేషన్‌కు ముడిపెట్టడం సరికాదన్నారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. నరేంద్రమోదీ పదవి కాలంపై గగ్గోలు పెడుతున్నకాంగ్రెస్ నాయకులు నాలుగోసారి కూడ మోదానికి ప్రధానిగా చూడపోతున్నారన్నారు. దేశ ప్రజలందరు కాంగ్రెస్ ముక్త్ భారత్‌ను కోరుకుంటున్నారన్నారు. దీనికి తగ్గట్టుగానే ఎన్డీయే 22 రా ష్ట్రాల్లో అధికారంలో ఉందని, నాటి నరేంద్రుడు కలలు గన్న విశ్వ గురువు భారతదేశాన్ని నేటి నరేంద్రుడు 2037 వరకు సాధించపోతున్నట్లు తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణ భారతదేశానికి నష్టం జరుగుతుందని చెప్పటం కాంగ్రెస్ మూర్ఖత్వమే అన్నారు. 1976 నియోజకవర్గాల పునర్విభజనలో ఉత్తరప్రదేశ్‌కు 80 సీట్లు కేటాయించి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 42 సీట్లు కేటాయించారనేది కాంగ్రెస్ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పుడు ఉన్న జనాభాకు అనుగుణంగా 23.9 షేరింగ్‌కు ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని గుర్తు చేశారు. వచ్చే వర్షాకాల సమావేశంలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లు మహిళ బిల్లు ఆమోదం పొందటం ఖాయమన్నారు. డిలిమీటేషన్‌పై ఏలాంటి అవగాహన లేకుండ మాట్లాడటం కాంగ్రెస్ నాయకులు మానుకోవాలని హితవు పలికారు. బిజెపిజిల్లా అధ్యక్షులు బైరి శంకర్, పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి ద్యాసాగర్, బాలేష్, సంతోష్, తుంగ కనకయ్య, వెంకటేశం మార్కొండేయులు,నరేష్, రాజు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే పోలీస్ దర్బార్

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పోలీస్ సిబ్బంది సంక్షేమం,సమస్యల పరిష్కారానికే పోలీస్ దర్బార్ కార్యక్రమమని,ప్రతి శనివారం కమిషనరేట్‌లో పోలీస్ సిబ్బందిని కలుస్తామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. శుక్రవారం రామగుండం కమిషనరేట్ ఏఆర్ సిబ్బంది,అధికారుల కోసం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో దర్బార్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సీపీ హాజరై ఏఆర్ పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి వారి వృత్తిపరమైన అనుభవాలు, సమస్యలు,వినతులను ఒక్కొక్కరిగా అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఏదైనా సమస్యను దర్బార్‌లో చెప్పేందుకు ఇబ్బందిగా అనిపిస్తే కార్యాలయానికి వచ్చి నేరుగా కలిసి చెప్పవచ్చని సూచించారు. మనమందరం ఒక కుటుంబమని, సమన్వయంతో, క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వర్తించడం ద్వారా రామగుండం కమిషనరేట్‌కు, తెలంగాణ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.సిబ్బంది క్రమశిక్షణతో,మంచి ప్రవర్తనతో విధులు నిర్వర్తించినప్పుడు అధికారులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు.సిబ్బంది చేయాల్సిన విధులు, చేయకూడని పనుల గురించి పలు సూచనలు చేశారు. చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు అలవాటు పడి విధుల్లో నిర్లక్ష్యం వహించినా,పోలీస్ శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ప్రవర్తించినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ శాఖ, యూనిఫామ్‌పై గౌరవం ఉంటే చట్టవ్యతిరేక పనుల వైపు ఆలోచనలు రావని పేర్కొన్నారు.ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. తద్వారా మానసిక, శారీరక ఒత్తిళ్ల నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. కుటుంబ సభ్యులు, పిల్లలతో సమయం గడపాలని,వ్యక్తిగత కారణాలతో ఏర్పడే మానసిక ఒత్తిళ్లు చాలా ప్రమాదకరమని తెలిపారు.కొన్ని సందర్భాల్లో ఈ ఒత్తిళ్ల కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.ప్రతి శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పనిచేసే సిబ్బందిని కలుస్తామని,ఏవైనా సమస్యలు లేదా వినతులు ఉన్నట్లయితే కార్యాలయానికి వచ్చి నేరుగా కలవవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్,ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్,ఆర్ఐలు దామోదర్, మల్లేశం,శేఖర్, సంపత్,ఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల ప్రారంభానికి ముందే అన్ని సౌకర్యాలు ఉండాలి

అదనపు కలెక్టర్ డా.అశ్విని తానాజీ వాకడే

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** పాఠశాల పునః ప్రారంభానికి ముందే అన్ని రకాల సౌకర్యాలు ఉండాలని కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ డా.అశ్విని తానాజీ వాకడే అన్నారు. శుక్రవారం కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ విద్యాసంస్థలను సందర్శించి మౌళిక వసతుల పరిస్థితిని పరిశీలించారు. అక్కడ విద్యార్థులకు అవసరమైన మౌళిక సదుపాయాలు, భవనాల మరమ్మత్తులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ ఇతర సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. పరిశీలనలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేసి పాఠశాలల పునఃప్రారంభమయ్యేనాటికి అన్ని వసతులతో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా విద్యాసంస్థలను సన్నద్ధం చేయడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి పనిని నాణ్యతతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. టిజీడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, ప్లానింగ్ సమన్వయాధికారి మిలుకూరి శ్రీనివాస్, కొత్తపల్లి మండల విద్యాధికారి ఆనందం పాల్గొన్నారు.



# సారు దెబ్బకు అంతా 'రా'...

- విద్యుత్ శాఖలో ఓ మోనార్క్
- సెలవుపై వెళ్తున్న అధికారులు
- బినామీ గుత్తేదారులు

ప్రజాపక్షం/ ఖమ్మం : విద్యుత్ శాఖ వైరా డివిజన్ పరిధిలో ఓ సారూ దెబ్బకు ఉద్యోగులు పని చేయలేక ఏకంగా రాజీనామాకే సిద్ధమవుతున్నారు. డివిజనల్ అధికారిగా ఉన్న ఆయన వ్యవహరిస్తున్న తీరు మొత్తం శాఖకే ఇబ్బందులు తెచ్చిపెడుతుంది. వైరా డివిజన్ పరిధిలో అధికారి దెబ్బకు విద్యుత్ శాఖ ఉద్యోగులు పని చేయలేక ఉద్యోగాలకే రాజీనామా చేసేందుకు సిద్ధపడ్డారు. వైరా మండల పరిధిలోని ఓ ఏఈ ఇక నేను ఉద్యోగం చేయలేనని ఏడికి లేఖ రాయడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన విద్యుత్ శాఖ సెల్ ఫోన్ సిమ్‌ను స్వాధీనం చేసినట్లు తెలుస్తుంది. ఏఈలు ఇతర సిబ్బంది విధుల్లో జోక్యం చేసుకుంటూ వేధిస్తున్నాడని క్షేత్ర స్థాయి ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. వైరా, కొణిజర్ల మండలాలకు సంబంధించిన ఇద్దరు ఏఈలు డివిజన్ అధికారి పెట్టే ఇబ్బందులు పడలేక ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఓ అధికారి సెలవుపై వెళ్లారు. మరో అధికారి బదిలీ చేయించుకున్నట్లు తెలుస్తుంది.




మొత్తంగా డివిజన్ అధికారి వేధింపులు విద్యుత్ శాఖలోనే చర్చనీయాంశమయ్యాయి. ఉద్యోగులతో పనులు చేయించుకోవాల్సిన అధికారి ఇష్టానుసారంగా వ్యవహరించడంతో ఇప్పుడు వైరా మండలంలో విద్యుత్ శాఖలో ఏఈలే లేని పరిస్థితి. ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తారని మాటలు కించపరిచేవిధంగా ఉంటాయని ఓ ఇంజనీరింగ్ అధికారిపై వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారని ఆరోపణలు వినవస్తున్నాయి. డివిజన్ అధికారి మాటలకు అతను మానసికంగా కుంగిపోయి రాజీనామాకు సిద్ధపడినట్లు శాఖలో చర్చ సాగుతుంది. విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్వస్థలంలోనే ఓ అధికారి ఇలా వ్యవహరించడం అమానుషమని అత్యంత కీలకమైన సమయంలో అధికారి వేధింపుల కారణంగా క్షేత్రస్థాయి సిబ్బంది సెలవుపై వెళ్తుండడంతో పరిస్థితి గందరగోళంగా మారే ప్రమాదం ఉంది. స్వేచ్ఛగా సిబ్బందిని పని చేయనివ్వక పోగా వేధిస్తుండటం జరుగుతుండడంతో ప్రస్తుతం ఉన్న సిబ్బంది కూడా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంత దూరం బదిలీ చేసినా ఇబ్బంది లేదు కానీ వైరా సబ్ డివిజన్‌లో మాత్రం పని చేయలేమంటున్నారు. ఇదిలా ఉండగా ఈ డివిజన్ అధికారి విద్యుత్ శాఖలో పనులను బినామీ గుత్తేదారుల పేరుతో చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై కూడా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు. కీలకమైన విద్యుత్ శాఖలో జవాబు దారిగా ఉండి వినియోగదారులకు అత్యున్నత సేవలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారే ఇలా వ్యవహరిస్తుండటంతో ప్రజాప్రతినిధులు సైతం ఈ విషయంపై దృష్టిసారించాలని వినియోగదారులు కోరుతున్నారు. విద్యుత్ శాఖ వైరా డివిజన్‌లో ఏఈల రాజీనామాలు, ఇతరత్రా వ్యవహారాలు ఎవరు గుత్తేదారులు, ఎవరు పనులు చేస్తున్నారు అనే దానిపై సమగ్ర విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగు చూసే అవకాశం ఉందని వినియోగదారులు కోరుతున్నారు. ఇప్పటికే ఒక మండలంలో ఏఈలు లేరని ఈ అధికారి తీరు ఇలాగే కొనసాగితే వైరా డివిజన్‌లో ఏఈలు, ఇతర సిబ్బంది సెలవుపై వెళ్లే అవకాశం ఉందని మొత్తం వ్యవస్థ కుంటుపడే అవకాశం ఉన్నందున ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

## అకాల వర్షానికి కూలిన ఇళ్లు



ప్రజాపక్షం/నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కురిసిన అకాల వర్షానికి పలు ఇళ్లు , ప్రహారీగోడలు కూలి రహదారులు చిత్తడిగా మారాయి. మండలంలోని మంగ్రాజుపల్లిలో నిరుపేద కుటుంబాలైన తుమ్మ నాగయ్య ఇంటి ప్రహరీ, కొనాయిగూడెంలో బిందె చిరంజీవి ఇంటి ముందుభాగం కూలిపోయింది. ఈ క్రమంలో వారి కుటుంబాలు రాత్రి సమయంలో చిన్నపిల్లలతో బిక్కుబిక్కుమంటూ గడిపారని కుటుంబీకులు వాపోతున్నారు. మండలంలో పలు గ్రామాల్లో రహదారులు సైతం చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారాయని గ్రామస్తులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

## పోలీస్ నియామకాల వయోపరిమితి పెంచాలి



ప్రజాపక్షం/భద్రాచలం : పోలీస్ శాఖలో విధుల నిర్వహించేందుకు సిద్ధపడుతున్న అభ్యర్థుల వయో పరిమితిని పెంచాలని ఆ అభ్యర్థులు రాష్ట్ర ఫారెస్ట్ దవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు శుక్రవారం అభ్యర్థులు మాట్లాడుతూ కానిస్టేబుల్ అభ్యర్థుల గరిష్ట వయో పరిమితి 36సం. ఎస్ఐ అభ్యర్థుల వయోపరిమితి 37 సం.లకు పెంచాలని, 20వేల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. గత నియామకాల్లో జరిగిన ఇబ్బందులు, కోవిడ్ ప్రభావం, ఇతర కారణాల వల్ల అనేక మంది నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తమ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పొదెం వీరయ్య మాట్లాడుతూ అభ్యర్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## ఘనంగా ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం

ప్రజాపక్షం/ములకలపల్లి:ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ములకలపల్లి గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా 10 గ్రామాలకు చెందిన చిల్డ్రన్స్ పార్లిమెంట్ సభ్యులు, కౌమార బాలికలతో కలిసి ములకలపల్లి గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి బాల కార్మికత్వ నిర్మూలనకు సంబంధించిన నినాదాలు చేశారు. అనంతరం కాన్వెంట్ ఆవరణలో జరిగిన సమావేశంలో సర్పంచులు కొర్సా చంద్రలేఖ, మడకం రవి, తుర్రం శ్రీనివాసరావు, ఎస్ఐ మధుప్రసాద్, భరోసా సిబ్బంది సంధ్యారాణి, రమాదేవి పాల్గొని మాట్లాడారు. విద్యే మంచి భవిష్యత్తుకు పునాదని, ప్రతి చిన్నారికి విద్యాభ్యాసం హక్కుగా లభించాల్సిందేనని అన్నారు. బాల కార్మికత్వం చట్టరీత్యా నేరమని, బడి ఈడు పిల్లలందరూ తప్పని సరిగా పాఠశాలకు వెళ్లేలా తల్లిదండ్రులు, సమాజం బాధ్యత తీసుకోవాలని సూచించారు. విద్యతోనే పిల్లలు తమ లక్ష్యాలను చేరుకోవచ్చని, బాల కార్మికత్వం లేని సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిస్టర్స్ ఉదయ, దీప్తి, బెనోసియా, రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

## గోవిందాపురంలో రైతులకు అవగాహన సదస్సు

ప్రజాపక్షం/ వైరా : వైరా మండలం గోవిందాపురం గ్రామంలో రైతులకు ఎలినినో ప్రభావంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైరా వ్యవసాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ, మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్‌తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులను బట్టి సరైనటువంటి విత్తనాల రకాలను ఎంచుకోవాలని ఒకే రకం విత్తనంపై ఎప్పుడు ఆధారపడవద్దన్నారు. ఒకే రకం విత్తనం వాడటం వల్ల దిగుబడి తగ్గిపోతుందన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను సాగు చేసుకోవాలని ప్రత్యామ్నాయ పంటలైన కంది, పెసర, మినుము వంటి అపరాలను ఎంచుకోవాలన్నారు. అనంతరం వైరా మండలం సొసైటీ గోడౌన్ వద్ద జిలుగుల పంపిణీ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. రైతులు అధికారులకు సహకరించి విత్తనాలను తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు యశ్వంత్, రాజేష్, సొసైటీ సిఈవో రామకృష్ణ, గోవిందాపురం సర్పంచ్ రంగిశెట్టి కళావతి, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం



ప్రజాపక్షం/కారేపల్లి:రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతును రాజు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు ధరావత్ వినోద్ అన్నారు. గుంపెళ్ళగూడెం గ్రామ పంచాయితీలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రైతు ఖాతాల్లో మొక్కజొన్న డబ్బులు జమ అయిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ధరావత్ వినోద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు చేపట్టిందన్నారు. ఎంఎల్ఏ రాందాస్ నాయక్ నాయకత్వంలో వైరా నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ శాఖ నాయకులు భూక్య సైదులు నాయక్, బానోత్ చక్రం, వాంకుడోత్ వస్త్రం, ధరావత్ భాస్కర్, భూక్య సోమల, భూక్య బాబురావు, వాంకుడోత్ వినోద్, బానోత్ కిషన్, బానోత్ సీతారాములు, యువ కాంగ్రెస్ నాయకులు బానోత్ అశోక్, భూక్య రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## పాలేరు విద్యుత్ శాఖాభివృద్ధికి రూ.37.38కోట్లు

- పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ ఎనర్జీ వినియోగం
- రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/తిరుమలాయపాలెం: ప్రజాప్రభుత్వంలో విద్యుత్‌రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలో శుక్రవారం తిరుమలాయపాలెం 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో రూ.3కోట్లు వ్యయంతో ఏర్పాటు చేయనున్న 0.8మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌కు, విద్యుత్ నియంత్రికల మరమ్మత్తు కేంద్రానికి మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ..పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గతంలో విద్యుత్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారని, రాత్రివేళల్లో విద్యుత్ సరఫరా కారణంగా పొలాలకు వెళ్లిన



రైతులు పాముకాటుకు గురయ్యేవారని తెలిపారు. గతంలో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, గత రెడున్నరేళ్లలో పాలేరు నియోజకవర్గంలో విద్యుత్ శాఖ అభివృద్ధి పనులకు రూ.37.38కోట్లు వ్యయం చేసినట్లు వెల్లడించారు. ఇళ్లపైనుంచి వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్లు కారణంగా దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. రూ.9కోట్లు వ్యయంతో మూడు ఉపకేంద్రాల పనులు చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన ప్రతీ పేద కుటుంబాలకు రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దరావత్ సుజాత, విద్యుత్ శాఖ ఎస్.ఈ.శ్రీనివాసచారీ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య, తహసీల్దార్ లూథర్‌విల్సన్, ఎంపీడీఓ షేక్ సిలార్‌సాహెబ్,విద్యుత్ శాఖ డీఈ సీ.హెచ్.నాగేశ్వరరావు, ఏడీఈ కోక్యనాయక్, ఏఈ గడ్డం నరేందర్, పాలేరు ఆత్మకమిటీ చైర్మన్ చావా విరామకృష్ణ, డైరెక్టర్ ఉప్పునూతల నాగేశ్వరరావు, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## హైవే అథారిటీ అధికారులు నిర్లక్ష్యం వీడాలి : కంచర్ల జమలయ్య



ప్రమాద కరంగా గోధుమ వాగు బ్రిడ్జీ

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:రామవరం గోధుమ వాగు బ్రిడ్జీపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను తక్షణమే తొలగించాలని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. రామవరం పరిధిలోని గోదుమవాగు బ్రిడ్జీపై చాలా రోజులుగా పెద్దపెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో శుక్రవారం సిపిఐ నాయకులు, ప్రజాప్రతినిధులు బ్రిడ్జీని సందర్శించి గుంతల ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ వేలాది వాహనాల రాకపోకలు సాగే ప్రధాన రహదారిపై ఉన్న వంతెన అధ్వాన్నంగా మారినా నేషన్ హైవే అథారిటీ అధికారులు పట్టించుకోక పోవడం దుర్మార్గమన్నారు. ఇక్కడ తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వాహనాలు తీవ్ర గాయాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి యుద్ధ ప్రాతిపదికన బ్రిడ్జీ రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి జాతీయ రహదారిని దిగ్బందిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కూరపాటి సుధాకర్, సర్పంచ్ వాడె రాములు, నాయకులు మోహన్ రావు, దాసరి అశోక్, సతీష్, కృష్ణ, ఇరిగినేని రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అద్దె భవనంలో అష్ట కష్టాలు.. ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, ప్రజలు..

ప్రజాపక్షం/కల్లూరు:కల్లూరు లోని సబ్ రిజిస్టర్ కార్యాలయం నిర్వహణ అద్దె భవనంలో కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తుంది. మౌలిక వసతులు కొరతతో రిజిస్ట్రేషన్ కి వస్తున్నా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారు పేర్కొంటున్నారు. చాలీచాలని గదులు ఇరుకు గదులు ఉక్క పోత తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తల్లాడ, కల్లూరు మండలాలకు చెందిన ప్రజలకు ఈ కార్యాలయం ఉపయోగపడుతుంది. వందలాదిమంది ఉపయోగించుకునే ఈ కార్యాలయం లో మౌలిక వసతులు తోపాటు ఇరుకు గదులు తో ఇబ్బందులు పడుతున్నారు. ఈ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి ఆదాయం ఎక్కువగా వస్తున్న కూడా ప్రభుత్వం స్పందన లేకపోవ



దంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. దీంతోపాటు నెట్ సర్వర్ సౌకర్యం లో కూడా తరచూ అంతరాయం ఏర్పడుతుంది. దీనివలన ఆన్లైన్ కార్యక్రమం ఆలస్యం అవుతుంది. గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా పక్కా భవనం కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టిన మంజూరు కాలేదని వారు పేర్కొంటున్నా. స్థలం ఉండి నిర్మాణం చేపట్టిన కూడా అది కోర్టు పరిధిలో వివాదంగా మారడంతో పక్కా భవనం నిలిచిపోయింది. దీంతో అద్దె భవనంలోనే తప్పని సరి పరిస్థితుల్లో నిర్వహణ చేయాల్సి వస్తుందని నిర్వాహకులు తెలుపుతున్నారు.ఈ మధ్యకాలంలో ప్రభుత్వ భవనాలలోనే సబ్ రిజిస్టర్ కార్యాలయాలు నిర్వహించాలని ఆదేశాలు ఉన్న కూడా పాత భవనాలు పాత ఎంపీడీవో కార్యాలయం, హౌసింగ్ ఏఈ పాత కార్యాలయం లో అనుకూలంగా లేక పోవడంతో మళ్లీ అద్దె భవనంలోనే నిర్వహించాల్సి వస్తుందని సబ్ రిజిస్టర్ కార్యాలయం ఇంచార్జ్ నిర్వాహకులు తెలుపుతున్నారు.

## గుత్తేదారు నిర్లక్ష్యంతో నిలిచిన రాకపోకలు

ప్రజాపక్షం/ఎర్రుపాలెం: మండల పరిధిలోని రేమిడిచెర్ల గ్రామపంచాయతీ లోని లక్ష్మీ నగర్ వద్ద ఆర్అండ్‌బీ రహదారిలోని వంతెన నిర్మాణపనులు గుత్తేదారు అసంపూర్తిగా వదిలేయడంతో మార్గంలో నెలల తరబడి రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషితో ఎర్రుపాలెం నుంచి జీ.కొండూరు వరకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి నిర్మాణానికి గాను రేమిడిచర్ల లక్ష్మీ నగర్ వద్ద వంతెన నిర్మాణానికై నిధులు మంజూరు చేశారని ప్రజలు తెలుపుతున్నారు. వంతెన నిర్మాణానికి గుత్తేదారు నిర్మాణపనులు నత్తనడకన చేస్తూ ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం సమీపించిన క్రమంలో వాహనదారులు పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## పాఠశాల పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

శ్రామిక మహిళ ఫోరం జిల్లా నాయకురాలు సి.హెచ్. సీతామహాలక్ష్మి

ప్రజాపక్షం/బోనకల్:పాఠశాల పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శ్రామిక మహిళ ఫోరం(ఎఐటియుసి) జిల్లా నాయకురాలు సిహెచ్ సీతామహాలక్ష్మి కోరారు. శుక్రవారం పాఠశాలల కార్మికులతో డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి యంగల ఆనందరావు అధ్యక్షతన జనరల బాడీ సమావేశం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల పారిశుద్ధ్య కార్మికులు రాష్ట్రంలో 50 వేల పైగా పనిచేస్తున్నారన్నారు. వీరిని ప్రభుత్వాలు శ్రమ దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో పాఠశాల సర్వీస్ పర్సన్‌గా గుర్తింపు ఉందన్నారు. ప్రస్తుతం ప్రజాప్రభుత్వం చెప్పే రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన చేతిలో పెట్టుకొని పాఠశాల పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. ఉపాధీ హామీ కార్మికులకు గుర్తింపు ఉందని, పారిశుద్ధ్య కార్మికులకు మాత్రం ఏటువంటి గుర్తింపు లేదన్నారు. పాఠశాల పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం గుర్తించి కార్మికులుగా గుర్తింపు కార్డులను ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత, మెరుగైన వైద్య సదుపాయం, వేతనాలు వారి బ్యాంకు ఎకౌంట్ వేయడం తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు. వేతనాలు కమిటీ ద్వారా అందజేసే విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరారు. అరకొర వేతనాలు చెల్లిస్తూ వీరి జీతాల నుంచే చీపురు, ఫినాయిల్ తదితర ఖర్చుల భారాన్ని పారిశుద్ధ్య కార్మికులపై మోపుతున్నారన్నారు. పాఠశాల పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అన్నారు. వీరి పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని లేనియెడల రానున్న పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. పై సమస్యలను పరిష్కరించాలని ఎంఇఒ, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శిరీష, మరియమ్మ, జయమ్మ, రాములమ్మ, వరలక్ష్మి , సునీత పాల్గొన్నారు.

## ఆరోగ్యానికే మొదటి ప్రధాన్యత

సిపి సునిల్‌దత్

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : పోలీసు సిబ్బంది ఆరోగ్యానికే పోలీసు శాఖ మొదటి ప్రాధాన్యం ఇస్తుందని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. ఏఆర్ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం హైదరాబాద్ యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. సీపీ దీనిని ప్రారంభించి సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ఆరోగ్యంగా ఉంటేనే విధుల సక్రమంగా నిర్వహించగలుగుతారని, కుటుంబంలో ప్రశాంత ఉంటుందన్నారు. స్వీయ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో ఒత్తిడి కారణంగా గుండెసంబందిత వ్యాధులు వస్తాయని ముందుగానే వాటిని గుర్తించి నివారించడానికి పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈసీజీ, టూడీఈకో వంటి పరీక్షలను



యశోద ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచితంగా ఇటువంటి శిబిరాలు నిర్వహించి సిబ్బందికి ఆరోగ్యస్థితిగతులపై ప్రొఫైల్ ఇస్తున్నట్లు సిపి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యశోద ఆస్పత్రి గుండె వైద్యనిపుణులు భరత్‌రెడ్డి, సినియర్ మేనేజర్ వినయ్ కుమార్, ఎస్‌బి ఏసిపి మహేష్, ఏఆర్ ఏసిపి సుశీల్‌సింగ్, నర్సయ్య, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# సాగుకు సై.!

- ఖరీఫ్‌కు రైతుల సన్నద్ధం
- పంట మారితేనే సాగు బాగు
- వాతావరణ పరిస్థితులను బట్టి పంటలు ఎంపిక చేసుకోవాలని వ్యవసాయశాఖ సూచన

ప్రజాపక్షం/మధిరమున్సిపాలిటీ: రుతుపవనాలు రాకతో మధిర డివిజన్‌లోని రైతాంగం ఖరీఫ్ సాగు పనుల్లో నిమగ్నమైంది. పొలాల్లో తగిన తేమ ఏర్పడటంతో రైతులు భూములను దున్ని విత్తనాలు చల్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే విత్తనాల విత్తకం ప్రారంభమైంది. ముఖ్యంగా చింతకాని మండలంలో తొలివర్షానికే రైతులు పత్తి విత్తనాలు నాటడం ప్రారంభించారు.వ్యవసాయ శాఖ అధికారులు పంటల వైవిధ్యీకరణ, పంట మార్పిడి విధానాలను అవలంభించాలని పదే పదే సూచిస్తున్నప్పటికీ రైతులు సాంప్రదాయ పంటలైన వరి, పత్తి, మిర్చి, మక్కలపైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. పంట మార్పిడి ద్వారా భూసారం పెరగడంతోపాటు పురుగుమందుల వినియోగం తగ్గి దిగుబడులు మెరుగుపడతాయని అధికారులు అవగాహనకల్పిస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో మధిర డివజన్‌లో సుమారు 83,913ఎకరాల్లో పత్తి, 47,854 ఎకరాల్లో వరి, 9,230ఎకరాల్లో మిర్చి, 8,500ఎకరాల్లో పెసర, 22వేల ఉకరాల్లో సుబాబులు సాగుచేసే అంచనా ఉందని, గతేడాదితో పోల్చితే మిర్చి, పెసర, సుబాబులు, వంటి పంటల విస్తీర్ణ కొంత మేరకు పెరగనున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ శాస్త్రవేత్తలు నీటి వినియోగం దృష్టిలో ఉంచు



కుని వరి, పత్తి సాగును తగ్గించి పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు,ఉద్యానవన పంటలవైపు మొగ్గుచూపాలని సూచిస్తున్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలు, ధ్రువీకరించిన ఎరువులు వినియోగించి, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. ఖమ్మం జిల్లా పరిధిలో కూడా ఈసారి వర్షాల కొరత అవకాశాలు ఉండే నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. నీటి లభ్యత, భూసార పరిస్థితులు, మార్కెట్ అవకాశాలను అన్నింటినీ పరిశీలించి రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

**వాతావరణ శాఖ అంచనాలు, వ్యవసాయ శాఖ సలహాలు పాటిస్తే మెరుగైన ఫలితాలు**

రైతులు కూడా వాతావరణ శాఖ అంచనాలు పరిగణనలోకి తీసుకుని, వ్యవసాయ శాక సలహాలను పాటిస్తే రైతులు ప్రతికూల పరిస్థితులను అధికమించి మెరుగైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. సకాలంలో మరిన్ని వర్షాలు కురిస్తే ఈ ఖరీఫ్ సీజన్ రైతులకు ఆశాజనకంగా మారుతుందని రైతాంగం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ' పంట మారితేనే సాగు బాగు..వాతావరణాన్ని దృష్టిలో పెట్లుకుని సాగు చేస్తేనే రైతుకు లాభం ' అనే సందేశంతో అధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

**వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాలి: సాయి ధీక్షితులు, మండల వ్యవసాయశాఖ అధికారి**

రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటను నిర్ణయించుకుని సాగుచేస్తే మంచి దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి సాయి ధీక్షితులు సూచించారు.

## బాల కార్మికుల నిర్మూలనపై న్యాయ అవగాహన సదస్సు



14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టొద్దు
జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్రకుమార్

ప్రజాపక్షం/అశ్వాపురం:ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అశ్వాపురం మండలంలోని బ్రిక్ లైన్ ఇండస్ట్రీ వద్ద ఇటుక బట్టీల యజమానులకు బాల కార్మికుల నిర్మూలనపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్రకుమార్ పాల్గొని మాట్లాడారు. 14 సంవత్సరాలలోపు పిల్లలను పనుల్లో నియమించడం చట్టవిరుద్ధమని, అలాంటి పిల్లలను తప్పని సరిగా పాఠశాలలకు పంపించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ సమాజ అభివృద్ధికి అడ్డంకిగా మారుతుందని పేర్కొన్నారు. అలాగే బాల కార్మికుల నిషేధ చట్టంలోని నిబంధనలను వివరిస్తూ, బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని కోరారు. చిన్నారుల భవిష్యత్తు విద్యతోనే వెలుగొందుతుందని, బాల కార్మికత్వ నిర్మూలనకు యజమానులు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఆలోచన నాగరాజు, బ్రిక్స్ యూనియన్ అధ్యక్షుడు మర్రి మల్లారెడ్డి, గౌరవ అధ్యక్షుడు కొండలరావు, గుర్రం రవీందరక్, ఆకటి రవీందర్‌రెడ్డి, వడ్డెంపూడి రాము, నర్సిరెడ్డి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# మెజారిటీ కోసం షా వెంపర్లాట

**ప్రతిపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా అపహాస్యం చేస్తున్నారు : కాంగ్రెస్**



**న్యూఢిల్లీ :** లోక్‌సభలో బిజెపికి మూడింట రెండు వంతుల మెజారిటీని 'కల్పించేందుకు' హోం మంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారని, ఆయన ప్రతిపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా అపహాస్యం చేస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. అయితే ఆయన 'దుష్ట పన్నాగాలు' సఫలం కావని పేర్కొంది. 'పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు కేంద్ర హోంమంత్రి ఈ రోజుల్లో తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లుగా, లోక్‌సభలో తన పార్టీకి మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించడానికి ఇంతకు ముందెన్నడూ ఎవరూ ప్రయత్నించలేదు. 2026 ఏప్రిల్ 17న ఎన్‌డిఎకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీ లభించనప్పుడు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ప్రమాదకరమైన రాజ్యాంగ సవరణ బిల్లు భారీ మెజారిటీతో తిరస్కరించబడినప్పుడు, స్వయం ప్రకటిత చాణక్యుడు అవమానానికి గురయ్యాడు' కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ఆ ఘోర పరాజయంతో కుంగిపోయిన షా, ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా అపహాస్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. 'పోరాటం కొనసాగుతోంది. అతని దుష్ట పన్నాగాలు సఫలం కాకూడదు, కావు'అని రమేశ్ ఉద్ఘాటించారు. 'నిజమైన టిఎంసి'గా తమను గుర్తించాలని కోరుతూ, అసమ్మతి టిఎంసి ఎంపిలు సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలవనున్నారనే విషయం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# పోరాటానికి సిద్ధంగా ఉన్నాం

**సీటు చోరీ జరిగిందని దేశ ప్రజలకు తెలుసు : మీనాక్షి నటరాజన్**



**న్యూఢిల్లీ :** రాజ్యసభ ఎన్నికలకు తన నామినేషన్ పత్రాల తిరస్కరణను సవాలు చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ నేపథ్యం లో ఆమె స్పందిస్తూ 'సీటు దొంగతనం' జరిగిందన్న విషయం అందరికీ స్పష్టంగా తెలుస్తోందని, తాము పోరాడటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇది వ్యక్తిగత ఓటమికి సంబంధించిన ప్రశ్న కాదని, ప్రజాస్వా మ్యం పదే పదే ఎదుర్కొంటున్న దిగ్భ్రాంతికరమైన అంశాలే మరింత ఆందోళనకరమని నటరాజన్ అ న్నారు. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎన్నికలకు త న నామినేషన్ పత్రాల తిరస్కరణను సవాలు చేస్తూ నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ప్రశాం త్ కుమార్ మిశ్రా, జస్టిస్ అతుల్ ఎస్ చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేస్తూ, అయితే, ఈ కేసులోని మెరిట్స్‌పై తాము ఏమీ గమనించలేదని పేర్కొంది. తీర్పు తరువాత నటరాజన్ విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యం పదేపదే ఎదుర్కొంటున్న ఎదురుదెబ్బల గురించి తాము ఆందోళన చెం దుతున్నామని, ఇది వ్యక్తిగత ఓటమికి సంబంధించిన ప్రశ్న కాదు అని అన్నారు. హైకోర్టును ఆశ్రయిస్తారా అని అడగ్గా, దానిని తాను నిర్ణయించనని, త న పార్టీ నిర్ణయిస్తుందన్నారు. తాను పార్టీ అభ్యర్థిని, పార్టీ, నాయకులు ఏది నిర్ణయిస్తే, తాము దానినే అనుసరిస్తామని చెప్పారు. 'మేము పోరాడటానికి సిద్ధంగా ఉన్నాము, పార్టీ మొత్తం కలిసి ఉంది, అంతకంటే మంచిది ఏముంటుంది... సీటు దొంగతనం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. అది అందరి ముందు ఉంది. అది సీటు దొంగతనం, అందరికీ తెలుసు. కార్పొరేట్ ప్రపంచానికి చెందిన వ్యక్తికి ఒ క చట్టం, రాజ్యాంగ సూత్రాల కోసం పోరాడే వారికి మరో చట్టం ఉంటుందని మనందరికీ తెలుసు' అని నటరాజన్ అన్నారు. తదుపరి చర్యను పార్టీ నిర్ణయిస్తుందని, ప్రజా న్యాయస్థానానికి వెళ్లే స్వేచ్ఛ మాకు ఉందని, తాము అదే చేస్తామని ఆమె తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పుపై ఆమె మాట్లాడుతూ, 'మేము కోర్టు ఉత్తర్వును చూస్తాము, ఆ తర్వాతే నేను వ్యా ఖ్యానించగలను' అని అన్నారు. దీనికి సంబంధించి ఒక ఎన్నికల పిటిషన్ ఉందని వారు చెప్పినట్లు తనకు అర్థమైందన్నారు. ఎమ్మెల్యేలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలవాలనుకున్నారని, కానీ వారిని అలా చేయడానికి అనుమతించలేదని కూ డా ఆమె అన్నారు. ఎన్నికల సంఘం రాజీపడిం ద ని, అందులో భాగస్వామిగా ఉందని నటరాజన్ ఆరోపించారు. మధ్యప్రదేశ్ నుండి జూన్ 18న జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నటరాజన్‌ను తమ ఏకైక అభ్యర్థిగా నామినేట్ చేసింది. అయితే, ఆమె తన నామినేషన్ పత్రాలతో పాటు స మర్పించిన ఫారం 26లో తెలంగాణలో తనపై దా ఖలైన కోర్టు ఫిర్యాదుకు సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టారని పేర్కొంటూ, మంగళవారం రిటర్నిం గ్ అధికారి ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు.

**కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించడాన్ని నిరసిస్తూ రాష్ట్రపతి భవన్ వైపు ర్యాలీగా వెళ్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను శుక్రవారం ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని అధికారులు తెలిపారు. నటరాజన్ నామినేషన్ పత్రాలను ఆమోదించాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు రాష్ట్రపతి భవన్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. అత్యంత భద్రత గల ఆ ప్రాంతం వైపు వారు ముందుకు వెళ్లకుండా పోలీసులు జోక్యం చేసుకుని నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ నిరసన సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే జయవర్ధన్ సింగ్ మాట్లాడుతూ దేశంలో బిజెపి నియంతృత్వం ప్రకటించిందని, మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాన్ని ఆమోదించాలన్నా రు. తాము ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాము, మాకు న్యాయం జరగలేదన్నారు. సుప్రీంకోర్టు కూ డా. సమయం ఇవ్వలేదని, మీనాక్షి నటరాజన్‌కు న్యాయం జరిగే వరకు ఆందోళనను కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఆహార భద్రత, చిన్న రైతుల సాధికారతపై...

# ఉమ్మడి కృషికి భారత్ మద్దతు

**ఇండోర్‌లో కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన ప్రారంభమైన 'బ్రిక్స్' దేశాల రెండు రోజుల సమావేశం**



ఇండోర్ : చిన్న సన్నకారు, రైతులను బలోపేతం చేయడానికి, ఆహార భద్రతను నిర్ధారించడానికి, సుస్థిర వ్యవసాయ అభివృద్ధిని ప్రోత్సహించడానికి 'బ్రిక్స్' దేశాలు కలిసి పనిచేయాలని శుక్రవారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులు, సహజ వనరులపై పెరుగుతున్న వత్తిడి వంటి వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను సామూహిక ప్రయత్నాల ద్వారా మాత్రమే పరిష్కరించగలమని మంత్రి నొక్కి చెప్పారు. ఇండోర్‌లో బ్రిక్స్ దేశాల వ్యవసాయ మంత్రుల రెండు రోజుల ప్రారంభ సమావేశానికి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షత వహించారు. 'చిన్న రైతులు, మహిళలు, యువత ఆహార భవిష్యత్‌ను సురక్షితం చేయడం' అనే అంశంపై జరిగిన మంత్రివర్గ చర్చలకు కూడా మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ నాయకత్వం వహించారు. చిన్న రైతులు బలోపేతం అయితే, ప్రపంచ ఆహార భద్రత దానంతట అదే బలోపేతం అవుతుందని కూటమికి భారతదేశం అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో జరుగుతున్న సమావేశంలో ఆయన ఉద్ఘాటించారు. భారతదేశం ఎల్లప్పుడూ ప్రపంచ ఐక్యతకూ, సహకారానికి కట్టుబడి ఉందని చౌహాన్ నొక్కిచెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో యుద్ధం కాదు, శాంతి, సంఘర్షణ కాదు, సమన్వయం అనే సూత్రం ఆధారంగా విధానం నడుస్తోందని, ఇది ప్రపంచ వ్యవసాయ భాగస్వామ్యాలకు మార్గదర్శకతత్వంగా ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ధృవీకరించారు. చిన్న, సన్నకారు రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించడానికి, సభ్యదేశాల మధ్య అనుభవాలను పంచుకోవడానికి 'బ్రిక్స్' వేదిక ఒక ముఖ్యమైన అవకాశాన్ని కల్పించిందని చౌహాన్ తెలిపారు. బ్రిక్స్ దేశాల మధ్య విధాన సహకారం, భాగస్వామ్యాలు ప్రపంచ వ్యవసాయానికి ఒక కొత్త ధిశను అందించగలవని శివరాజ్ సింగ్ చౌహాన్ అభిప్రాయ పడ్డారు. వాతావరణ మార్పులవల్ల సహజవనరులపై పడుతున్న వత్తిడి, చిన్న, మధ్య తరహా రైతులు ఎదుర్కొంటున్న మార్కెట్ అనిశ్చితులు వంటి సమస్యలకు సమూహిక పరిష్కారాలను కనుగొనడంలో కొనసాగుతున్న ఈ చర్చలు చాలా ముఖ్యమైనవని మంత్రి చౌహాన్ చెప్పారు. ఆహార భద్రతను కల్పించడం, సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించడం చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సాధికారత కల్పించే దిశగా మనమంతా కలిసికట్టుగా పనిచేయాలని ఆయన సభికులను ఉద్దేశించి అన్నారు. ఈ చర్యలు సభ్య దేశాల మధ్య సహకారాన్ని పెంపొందిస్తాయని విశ్వాసం వ్యకం చేస్తూ, చర్చించిన అనుభవాలు, ఉత్తమ పద్ధతులు వ్యవసాయ రంగానికి ప్రయోజనం చేకూరుస్తాయని చౌహాన్ విశ్వాసం వ్యక్తం చేశారు.'డ్రోన్ దీదీ' వంటి కార్యక్రమాలు గ్రామీణ భారతదేశంలో ద్వైపాక్షిక పరివర్తనను ప్రతిబింబిస్తున్నాయన్నారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. మంత్రివర్గ చర్చలకు ముందుగా, బ్రిక్స్ వ్యవసాయ వర్కింగ్ గ్రూప్ అధికారుల మూడు రోజుల సమావేశం గురువారం ఇండోర్‌లో ముగిసింది. 5 రోజుల పాటు జరిగిన చర్చల్లో కుదిరిన ఏకాభిప్రాయం ఆధారంగా శనివారం నాడు 'ఇండోర్ డిక్లరేషన్' ఆమోదం పొందే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# నీట్ పరీక్షలో మార్పులు

**రఫ్ వర్క్ పేజీల రెట్టింపు : సమయాన్ని పెంచిన ఎన్‌టిఎ**

**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా రద్దయిన నీట్ పరీక్ష ఈనెల 21వ తేదీన జరగనుంది. 2 గంటల నుంచి 5 గంటల 15 నిమిషాల వరకూ పరీక్ష జరుగుతుందని ఎన్‌టిఎ ప్రకటించింది. ఈ నేపథ్యంలో వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న నీట్ రీ ఎగ్జామ్ 2026లో జాతీయ పరీక్షల సంస్థ ఎన్‌టిఎ కొన్ని మార్పులు చేసింది. విద్యార్థుల సౌకర్యార్థం సమయాన్ని మరో 15 నిమిషాలు పొడిగించింది. మొత్తంగా ఈ పరీక్ష 195 నిమిషాల పాటు జరగనుంది. పరీక్ష ప్రారంభానికి ముందు, ముగిసిన తర్వాత ఇన్విజిలేషన్ ప్రక్రియకు పెంచిన సమయం ఉపయోగపడుతుందని తెలిపింది. అభ్యర్థుల నుంచి గత కొన్నేళ్లుగా వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఈ మార్పులు చేశామని ఎన్‌టిఎ తెలిపింది. రఫ్ వర్క్ కోసం ఇచ్చే పేజీలను రెట్టింపు చేసినట్లు వెల్లడించింది. ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో రఫ్ వర్క్ కోసం ఇప్పటివరకూ రెండు పేజీలు ఇస్తుండగా ఈసారి 4 పేజీలు ఇవ్వనున్నట్లు ఎన్‌టిఎ పేర్కొంది. ఎడమచేతి వాటం ఉన్న విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రశ్నపత్రం మొదట్లో, చివరిలో రెండేసి రఫ్ పేపర్లను ఏర్పాటు చేసినట్లు వివరించింది. గతంలో, రఫ్ వర్క్ పేజీలు కేవలం ప్రశ్నపత్రం బుక్‌లెట్ చివరలో మాత్రమే ఉండేవి. సవరించిన విధానం ప్రకారం, సూచనల పేజీ తర్వాత వెంటనే రెండు రఫ్ వర్క్ పేజీలు ఉంటాయి, అలాగే మరో రెండు అదనపు పేజీలు బుక్‌లెట్ చివరలో ఉంటాయి. ఈ కొత్త విధానం ప్రశ్నపత్రం ఇంగ్లీష్, ప్రాంతీయ భాషా వెర్షన్లు రెండింటిలోనూ ప్రవేశపెట్టారు. 'పరీక్ష ప్రారంభం, ముగింపులో ఉండే ఇన్విజిలేషన్ ప్రక్రియ (ఉదాహరణకు సంతకాలు చేయడం వంటివి) తమ అసలు పని సమయాన్ని తగ్గిస్తున్నాయని అభ్యర్థులు గతంలో భావించేవారు. ఆ సమయాన్ని కూడా పరిగణనలోకి తీసుకునేలా సమయ వ్యవధిని రూపొందించాం. ఈ ప్రక్రియలతో సహా మొత్తం సమయాన్ని 195 నిమిషాలుగా నిర్ణయించాం. అభ్యర్థులు లెక్కలు, విశ్లేషణలు చేసుకోవడానికి వీలుగా ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో రఫ్‌వర్క్ కోసం కేటాయించిన పేజీల సంఖ్యను రెండు పేజీల నుంచి నాలుగు పేజీలకు పెంచాం. ఇప్పుడు బుక్‌లెట్‌లో ముందు, వెనుక భాగాల్లో రఫ్‌వర్క్ పేజీలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల ప్రతి అభ్యర్థి సౌకర్యవంతంగా పరీక్ష రాయవచ్చు. ముఖ్యంగా మొత్తం అభ్యర్థుల్లో దాదాపు 10శాతం మంది ఉండే ఎడమ చేతి వాటం అభ్యర్థులకు ఇది ఎంతో సహాయపడుతుంది' అని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పేర్కొంది. పరీక్షా విధానంలో చేసే చిన్న, ఆలోచనాత్మకమైన మార్పులు కూడా అత్యంత కీలకమైన పరీక్షా సమయంలో అభ్యర్థి సౌకర్యంలో గణనీయమైన మార్పును తీసుకురాగలవని, నీట్ యుజి 2026 పరీక్షను పారదర్శకంగా, సురక్షితంగా అభ్యర్థులకు అనుకూలమైన రీతిలో నిర్వహించడానికి, అలాగే ఈ పరీక్షకు హాజరయ్యే లక్షలాది మంది ఆశావహుల కోసం పరీక్షా విధానాన్ని నిరంతరం మెరుగుపరచడానికి తమకున్న నిబద్ధతను ఎన్‌టిఎ పునరుద్ఘాటించింది అని ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది.

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

**న్యూఢిల్లీ:** లక్నో నుంచి దిల్లీ బయల్దేరాల్సిన ఇండిగో విమానానికి శుక్రవారం బాంబు బెదిరింపు వచ్చిందని ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. విమానం కావడానికి కొద్ది నిమిషాల ముందు బాంబు బెదిరింపు వచ్చింది. సమాచారం అందుకున్న భద్రతాదళాలు విమానాన్ని నిలిపివేశారు. ప్రయాణికుల్ని, సిబ్బందిని దింపివేశారు. సీఐఎస్‌ఎఫ్‌తోపాటు స్థానిక పోలీసులు సెక్యూరిటీ ప్రొటోకాల్ ప్రకారం విమానంలో తనిఖీలు నిర్వహించారు. కాగా, బాంబు బెదిరింపు కాల్ తర్వాత కొద్దిసేపు విమాన సేవలకు ఎయిర్‌పోర్టులో అంతరాయం కలిగింది.


ఫారం-సి

నోటిఫికేషన్

(సెక్షన్ 11(1) ప్రకారం మరియు 10A మినహాయింపు అనసరించి)
(రూల్ 6/12 చూడుము)

తెలంగాణ ప్రభుత్వము
రెవిన్యూ (భూ సేకరణ) శాఖ సూర్యాపేట జిల్లా

జిల్లా కలెక్టర్, సూర్యాపేట
ఫైల్ నెంబర్: G/1476/2026 తేదీ: 10/06/2026

ఆర్.డి.ఓ హుజూర్‌నగర్
ఫైల్ నెంబర్: F/954/2026 తేదీ: 03/06/2026

గెజిట్ నెంబర్: 34/2026 తేదీ: 10/06/2026

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారు దిగువ నిర్దిష్ట పరచిన సూర్యాపేట జిల్లాలోని చింతలపాలెం మండలములోని వెల్లటూరు గ్రామములో విస్తీర్ణము ఎ. **2.32 గుం.లు** భూమిని ప్రజల ఉపయోగార్థం MBC లిఫ్ట్ ఇరిగేషన్ కొరకు అప్రోచ్ చానల్, ప్రెషర్ మైన్, డెలివేరి సిస్టెర్న్ నిర్మించటానికి ఈ దిగువ చూపిన భూములు/ నిర్మాణములు యుక్తముగా అవసరము అయి ఉన్నందున భూ సేకరణ చేయుటకు భావించనైనది.
కావున సూర్యాపేట జిల్లాలోని చింతలపాలెం మండలము లోని వెల్లటూరు గ్రామము లో ఉన్న భూమి సుమారు విస్తీర్ణము ఎ. **2.32 గుం.ల** గల భూమి యొక్క వివరములు ఈ క్రింద చూపిన వారి నుండి భూ సేకరణ నిమిత్తం నోటిఫికేషన్ జారీ చేయనైనది.

గ్రామము: వెల్లటూరు మండలం: చింతలపాలెం జిల్లా: సూర్యాపేట

| క్రమ సంఖ్య | సర్వే నెంబరు | [illegible] | [illegible] | [illegible] | భూమి పట్టాదారులు / అనుభవదారులు తండ్రి / భర్త పేరు | సరిహద్దులు తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 1 | 472/223/1/1/3/1 | పట్టా | తరి | 0.03 | కృష్ణంశెట్టి ప్రకాష్ తండ్రి సైదయ్య (ప & అ) | 472 | 472 | 472 | 478 | |
| 2 | 472/222/2/2 | పట్టా | తరి | 0.30 | బాపనపల్లి సాంబయ్య తండ్రి సుబయ్య (ప & అ) బాపనపల్లి గోపయ్య తండ్రి సుబయ్య (ప & అ) | 472 | 472 | 472 | 478 | |
| 3 | 472/33/22/1 | పట్టా | తరి | 0.08 | గుండ పరెడ్డి తండ్రి నాగిరెడ్డి (ప&అ) | 472 | 472 | 472 | 478 | |
| 4 | 472 | పట్టా | తరి | 0.01 | ఘంటసాల దుర్గారావు తండ్రి ప్రభాకర్ (అ) | 472 | 472 | 472 | 478 | |
| 5 | 472 | పట్టా | తరి | 0.01 | కందులూరి నాగరాజు తండ్రి వెంకయ్య (అ) | 472 | 472 | 472 | 478 | |
| 6 | 472 | పట్టా | తరి | 0.01 | కందుకూరి వెంకటేష్ తండ్రి శంబయ్య (అ) | 472 | 472 | 472 | 478 | |
| 7 | 472 | పట్టా | తరి | 0.01 | కందుకూరి కరుణాకర్ తండ్రి శంబయ్య (అ) | 472 | 472 | 472 | 478 | |
| 8 | 472 | పట్టా | తరి | 0.01 | కేతేపల్లి నర్సయ్య తండ్రి సైదులు(అ) | 472 | 472 | 472 | 478 | |
| 9 | 472 | పట్టా | తరి | 0.01 | కేతేపల్లి గురువయ్య తండ్రి బిక్షాలు (అ) | 472 | 472 | 472 | 478 | |
| 10 | 472 | పట్టా | తరి | 0.01 | మీగాడి వేరయ్య తండ్రి నాగయ్య(అ) | 472 | 472 | 472 | 478 | |
| 11 | 472 | పట్టా | తరి | 0.01 | బంటు కొండలు తండ్రి సైదులు (అ) | 472 | 472 | 472 | 478 | |
| 12 | 472 | పట్టా | తరి | 0.01 | గండారపు అంజమ్మ భర్త చిన్న లక్ష్మ ణ్ (అ) | 472 | 472 | 472 | 478 | |
| 13 | 472 | పట్టా | తరి | 0.01 | బంటు నరసింహ తండ్రి సైదులు(అ) | 472 | 472 | 472 | 478 | |
| 14 | 478/5/1/2 | పట్టా | ఖుష్కి | 0.03 | కందుల సుందర మాళేశ్వర రెడ్డి తండ్రి గురువ రెడ్డి (ప&అ) | 478 | 478 | 478 | VB | |
| 15 | 478/అ2/2 | పట్టా | ఖుష్కి | 0.14 | రౌతు వీరబాబు తండ్రి వీరయ్య (ప&అ) | 478 | 478 | 478 | VB | |
| 16 | 478/అ/1/1/1 | పట్టా | ఖుష్కి | 0.18 | బెల్లంకొండ ఉపేంధర్ తండ్రి చిన్న సైదయ్య (ప&అ) | 478 | 478 | 478 | VB | |
| 17 | 478 | పట్టా | ఖుష్కి | 0.26 | రౌతు రమణ తండ్రి బిక్షం (అ) | 478 | 478 | 478 | VB | |
| మొత్తం | | | | 2.32 | | | | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని దాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం.21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (కేంద్ర చట్టం 30/2013) సెక్షన్ 11(1) ప్రకారం సంబందిత భూ యజమానులకు నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, సూర్యాపేట మరియు భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, హుజూర్ నగర్ వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదేన పని దినములలో కార్యాలయ పని వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము / జిల్లా కలెక్టర్, సూర్యాపేట వారు భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, హుజూర్ నగర్ వారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ -12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టటానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారి అనుమతి లేకుండా ప్రాధమిక ప్రకటన జారీ చేసిన తేదీ నుండి ఆ ప్రకటన ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎవరు ఎటువంటి కొనుగోలు / అమ్మకాలు / తాకట్లకు మొదలగు లావాదేవీల చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని సెక్షన్ - 15 ప్రకారం జిల్లా కలెక్టర్, సూర్యాపేట / భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, హుజూర్‌నగర్ గార్లకు ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినములలోపల వారి అభ్యంతరములు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసి యున్నది.

సం/- భూసేకరణ అధికారి మరియు రాజస్వ మండల అధికారి, హుజూర్ నగర్.
సం/- అదనపు కలెక్టర్, సూర్యాపేట
సం/- జిల్లా కలెక్టర్, సూర్యాపేట.

DIPR RO NO. 295/LA/PP/Advt/Pub/2026-27


లోక్‌సభ స్పీకర్‌ను కలవనున్న

# టిఎంసి అసమ్మతి వర్గం

**తమదే అసలైన తృణమూల్ కాంగ్రెస్‌గా గుర్తించాలని విజ్ఞప్తి**



**న్యూఢిల్లీ :** తమదే అసలైన టిఎంసిగా గుర్తింపు పొందాలని కోరుతూ, అసమ్మతి టిఎంసి ఎంపిలు సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలవనున్నారని తిరుగుబాటు ఎంపి జగదీష్ చంద్ర బర్మా బసునియా శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం 19 మంది సభ్యులు తమ వర్గానికి మద్దతు ఇస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కూచ్ బెహర్ ఎంపి, లోక్‌సభలో ఎన్‌డిఎకు మద్దతు ఇవ్వాలని భావిస్తున్న చట్టసభ సభ్యులలో ఒకరైన బసునియా, తమ బృందం ఇప్పటికే స్పీకర్‌కు ఒక వినతిపత్రాన్ని సమర్పించిందని పిటిఐకి తెలిపారు. 'మేము లేఖను సమర్పించాము... సోమవారం నాడు స్పీకర్‌ను కలిసి, అసలైన టిఎంసి పార్లమెంటరీ బృందాన్ని ఏర్పాటు చేసేందుకు మా హక్కును తెలియజేస్తాము. మా వాదనకు గుర్తింపు ఇవ్వాలని స్పీకర్‌ను కోరుతాము' అని బసునియా అన్నారు. ఈనెల 8న సంతకాల సేకరణ ప్రక్రియ ప్రారంభమైందని, ఇప్పటివరకు 19 మంది ఎంపిలు ఆ వినతిపత్రంపై సంతకాలు చేశారని ఆయన చెప్పారు. అయితే, సమావేశ సమయం ఇంకా ఖరారు కాలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. పక్షం మారడానికి అసమ్మతి ఎంపిలకు డబ్బు ఇస్తున్నారన్న టిఎంసి ఎంపి కీర్తి ఆజాద్ వ్యాఖ్యలపై బసునియా ఘాటుగా స్పందించారు. 'కీర్తి ఆజాద్ అబద్ధాలకోరు. ఆయన అలా అనడం సరికాదు. మేము 19 మంది ఎంపిలం, ఆయన కూడా ఎంపియే... ఇలాంటి ఆరోపణలు చేయడం తగదు' అని అన్నారు. అభిషేక్ బెనర్జీపై సీనియర్ తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు కళ్యాణ్ బెనర్జీ చేసిన వ్యాఖ్యల గురించి అడిగినప్పుడు, 'ఆయన సరైన విషయమే చెబుతున్నారు. కళ్యాణ్ జీ ప్రకటనకు మేము మద్దతు ఇస్తున్నాము' అని అన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, పార్టీ శాసనసభ్యుల లోని ఒక పెద్ద వర్గం తిరుగుబాటు కారణంగా టిఎంసి సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ గందరగోళం పార్లమెంటుకు కూడా పాకింది. అసమ్మతి ఎంపిలు 20 మందికి పైగా లోక్‌సభ సభ్యుల మద్దతు తమకు ఉందని పేర్కొన్నారు.

# లక్నోలో సిజెపి నిరసనలు

**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్**




**లక్నో :** పరీక్షలలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, బొద్దింక జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నేతృత్వంలో విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగార్థులు శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలోల నిరసన చేపట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఉదయం నుంచి లక్నోలోని ఎకో గార్డెన్‌లో గుమిగూడిన నిరసనకారులలో టీచింగ్, మెడికల్, రెవెన్యూ, అడ్మినిస్ట్రేటివ్, ఇతర ప్రభుత్వ నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు కూడా ఉన్నారు. సిజెపి ప్రారంభించిన దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా ఈ ప్రదర్శన జరిగింది. ఈ పార్టీ ఇంతకుముందు ఢిల్లీ, పుణెలలో కూడా ప్రదర్శనలు నిర్వహించింది. ఏ సంస్థ కాకుండా, ఒక వ్యక్తి దరఖాస్తు సమర్పించిన తర్వాతే ఈ కార్యక్రమానికి అనుమతి మంజూరు చేశారని అదనపు పోలీస్ కమిషనర్ (శాంతిభద్రతలు) బబ్లూ కుమార్ పిటిఐకి తెలిపారు. 'గురువారం రాత్రి ఆలస్యంగా వివేక్ కుమార్ అనే ఉపాధ్యాయుడు ఈ దరఖాస్తును సమర్పించారు. అవసరమైన ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత అనుమతి మంజూరు చేయబడింది' అని ఆయన అన్నారు. గురువారం సాయంత్రం వరకు ప్రదర్శనకు సంబంధించి ఎలాంటి దరఖాస్తు అందనందున, నిరసనకు పోలీసులు అనుమతి నిరాకరించారనే వార్తలు తప్పుదోవ పట్టించేవని ఆ అధికారి తెలిపారు. కాగా, శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే చెల్లుబాటులో ఉంటుందని, సుమారు 1,000 మంది ఇందులో పాల్గొంటారని అంచనా వేశారు. పరీక్షలలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, ఆందోళన వ్యక్తం చేయడానికి ఈ నిరసనను శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా నిర్వహిస్తామని దీప్కే ఇంతకుముందు చెప్పారు. 'మేము ఢిల్లీ, పుణెలలో శాంతియుత నిరసనలు చేపట్టాము. మేము ఏ తప్పూ చేయడం లేదు. ప్రజాస్వామ్యంలో మా అభిప్రాయాలను మాత్రమే తెలియజేయాలనుకుంటున్నాము' అని ఆయన అన్నారు. జూన్ 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన చేపట్టే ముందు, అమృత్‌సర్, బెంగళూరులలో మరిన్ని ప్రదర్శనలు నిర్వహించాలని సిజెపి యోచిస్తోంది.

# భూమధ్యరేఖకు దగ్గరగా ఎల్‌నినో

**న్యూఢిల్లీ :** పసిఫిక్ మహాసముద్రంలో భూమధ్యరేఖకు దగ్గరగా ఉన్న ప్రాంతంలో ప్రస్తుతం ఎల్ నినో పరిస్థితులు ఉన్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) శుక్రవారం తెలిపింది. రానున్న వర్షాకాలం(నైరుతి రుతుపవనాల కాలం)లో ఇది మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. పసిఫిక్ మహాసముద్ర మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగాయని, ఇవి ఎల్ నినో ఏర్పడడానికి కావాల్సిన స్థాయిని దాటిపోయాయని పేర్కొంది. దీనికనుగుణంగానే వాతావరణంలో కూడా మార్పులు వచ్చాయని తెలిపింది. సముద్రం, గాలి కలిసి పనిచేసే తీరును బట్టి చూస్తే, ప్రస్తుతం భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్న పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్ నినో లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని భారత వాతావరణ శాఖ పేర్కొంది. 'మాన్‌సూన్ మిషన్ కపుల్డ్ ఫోర్‌కాస్ట్ సిస్టమ్' (ఎంఎంసిఎఫ్‌సి) అంచనాల ప్రకారం, ఈ వర్షాకంలో ఎల్‌నినో పరిస్థితులు ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపింది. వాస్తవానికి 2026 జూన్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఈ పరిమితిని దాటేశాయని ఐఎండి తన బులెటిన్‌లో పేర్కొంది. ఈ వాతావరణ మార్పును కొలిచే 'నినో 3.4 ఇండెక్స్' మూడు నెలల సగటు ఉష్ణోగ్రత +0.5సి కంటే పైకి రికార్డ్ అయ్యిందని తెలిపింది. ఇది ఎల్ నినో ప్రారంభమైంది అనడానికి సంకేతమని స్పష్టం చేసింది. అంతేకాదు సముద్ర పైభాగంలోనే కాకుండా, లోపలి పొరల్లోనూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, రానున్న నెలల్లో ఈ వేడి నీరు పైకి వచ్చి ఎల్ నినోను మరింత బలోపేతం చేస్తుందని ఐఎండి గుర్తించింది. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో వేడి పెరడం వల్ల వచ్చే ఒక సహజమైన వాతావరణ మార్పు. భారతదేశానికి సంబంధించి చూసుకుంటే, 2000వ సంవత్సరం తర్వాత అంటే 2002, 2009, 2015, 2023లో ఎల్‌నినో తరహా వాతావరణ మార్పులు వచ్చాయి. సాధారణంగా ఈ ఎల్ నినో సమయంలో దేశంలో రుతుపవనాలు బలహీనపడడం, తక్కువ వర్షాలు కురవడం, ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడం, వర్షాలు లేకుండా పొడి వాతావరణం ఏర్పడడం లాంటివి జరుగుతుంటాయి. మరీ ముఖ్యంగా కొన్ని సంవత్సరాల పాటు కరవు వచ్చే ప్రమాదం కూడా ఉంటుంది. అయితే భారతదేశ వర్షపాతాన్ని కేవలం ఎల్ నినో ఒక్కటే ప్రభావితం చేయదని ఐఎండి స్పష్టం చేసింది. ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో 'ఇండియన్ ఓషన్ డైపోల్' (ఐఒడి) సాధారణ స్థితిలోనే ఉందని తెలిపింది. అందువల్ల ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించడంలో, పెంచడంలో దీని పాత్ర చాలా పరిమితం అని పేర్కొంది. పసిఫిక్ మహాసముద్రంలో మారుతున్న పరిస్థితులను తాము నిరంతరం గమనిస్తూ, ప్రతి నెలా తాజా సమాచారాన్ని అందిస్తామని ఐఎండి పేర్కొంది.

# వీణకు మరోసారి ఇడి సమన్లు



**న్యూఢిల్లీ :** ఖనిజాల సంస్థ సిఎంఆర్‌ఎల్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుమార్తె వీణాకు మరోసారి సమన్లు జారీ చేసింది. జూన్ 17న విచారణకు హాజరుకావాలని ఆమెను ఆదేశించినట్లు శుక్రవారం సంబంధిత వర్గాలు తెలిపాయి. అంతకు ముందు, శుక్రవారమే కొచ్చిలోని తమ కార్యాలయానికి హాజరుకావాలని ఇడి వీణను కోరింది. అయితే, అనారోగ్య కారణాల వల్ల మరికొంత సమయం కావాలని కోరుతూ వీణ పంపిన ఇ-మెయిల్ నేపథ్యంలో, దర్యాప్తు సంస్థ కొత్తగా సమన్లు జారీ చేసిందని వర్గాలు పేర్కొన్నాయి. తనన ఐటి సంస్థ 'ఎక్సలాజిక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన లావాదేవీల పత్రాలతో ఈనెల 17న ఉదయం 10 గంటలకు కొచ్చిలోని తమ కార్యాలయానికి హాజరుకావాలని ఇడి ఆమెను ఆదేశించింది. ఎటువంటి సేవలు పొందకుండానే 'కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ సంస్థ 'ఎక్సలాజిక్'కు రూ. 2.78 కోట్ల మేర చెల్లింపులు జరిపిందన్న ఆరోపణలకు సంబంధించి ఈ దర్యాప్తు జరుగుతోంది. ఇడి సమాచారం ప్రకారం, సిఎంఆర్‌ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శశిధరన్ కర్త నిర్వహిస్తున్న మరో సంస్థ 'ఎంపవర్ ఇండియా క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఇఐసిపిఎల్), ఎక్సలాజిక్ సంస్థ సకాలంలో రుణాలు తిరిగి చెల్లించడంలో విఫలమైనప్పటికీ దానికి రూ. 50 లక్షల రుణం ఇచ్చింది. ఈ లావాదేవీల ద్వారా వీణ, కర్త నేతృత్వంలోని సిఎంఆర్‌ఎల్ యాజమాన్యం నేరపూరిత ఆదాయాన్ని ఆర్జించాయని ఆ సంస్థ ఆరోపించింది. ఏప్రిల్ 2025లో ఎర్నాకులంలోని కోర్టులో 'సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్' దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఇడి 'ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్' (పిఎంఎల్‌ఎ) కింద కేసు నమోదు చేసింది.

# యూరప్ అందిస్తున్న ఆయుధాలతోనే ఇండియాపై దాడులు..

## పశ్చిమ దేశాలపై జైశంకర్ ఆగ్రహం



**ఫిన్లాండ్:** యూరప్ అందించే ఆయుధాలతో ఇండియాపై దాడులు జరుగుతున్నాయని, కానీ, యూరప్‌పై దాడులకు ఇండియా ఆయుధాలు అందించడం లేదని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జైశంకర్ విమర్శించారు. రష్యా నుంచి ఇండియా చమురు కొనుగోలు చేయడాన్ని వెస్టర్న్ కంట్రీస్ వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై ఇండియా తరఫున జైశంకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫిన్లాండ్‌లో జరుగుతున్న కుల్టారంటా టాక్స్ కార్యక్రమంలో జైశంకర్ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రష్యా నుంచి ఇండియా చమురు కొనుగోలు, యూరప్ దేశాల అభ్యంతరంపై మాట్లాడారు. రష్యా నుంచి ఇండియా చమురు కొనుగోలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఉక్రెయిన్‌పై దాడులు చేస్తున్న రష్యా నుంచి ఇండియా చమురు ఎలా కొంటుందని యూరప్ దేశాలు ప్రశ్నిస్తున్నాయి. దీనిపై జైశంకర్ ఘాటుగా స్పందించారు. యూరప్ దేశాల నైతికతపై ప్రశ్నించారు. యూరప్ దేశాలు ఆయుధాలు అందిస్తుంటే, ఇండియాపై దాడులు జరుగుతున్నాయన్నారు. అలాంటి దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలును ప్రశ్నించే అర్హత లేదన్నారు. అందుబాటు ధరలు, లభ్యతను బట్టి ఇండియా తన అవసరాలకు అనుగుణంగా చమురు కొనుగోలు చేస్తుందని చెప్పారు. రష్యా నుంచి చమురు కొనే యూరప్ దేశాలు మిడిల్ ఈస్ట్ నుంచి ఆయిల్ కొనడం వల్ల రష్యా చమురు భారీగా మిగులుతోందని, దీంతో తాము ఆ దేశం నుంచి ఆయిల్ కొంటున్నామని వివరించారు. గతంలో రష్యా నుంచి చమురు ఇండియా చమురు కొనుగోలును అమెరికా కూడా ప్రోత్సహించిందన్నారు. రష్యాకు ఇండియా అనుకూలంగా వ్యవహరిస్తోందని అక్కడి మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి ఇండియా చమురు కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఉందన్నారు. ఇండియాకు వ్యతిరేకంగా ఉన్న దేశాలకు యూరప్ దశాబ్దాలుగా ఆయుధాలు సరఫరా చేస్తోందని గుర్తు చేశారు. యూరప్ చాలా ఏళ్లుగా అమ్ముతున్న ఆయుధాలతోనే ఇండియాపై దాడి జరుగుతోందని చెప్పారు. అయితే, యూరప్‌పై దాడులకు మాత్రం భారత్ ఎలాంటి ఆయుధాలు అందించడం లేదన్నారు. యూరప్ ఆయుధాలు కూడా ఇండియాపై దాడికి రాకూడదన్నారు.

# మూడేళ్లుగా కోమాలో... థాయ్‌లాండ్ యువరాణి కన్నుమూత





**బ్యాంకాక్:**మూడేళ్లుగా కోమాలో ఉన్న థాయ్‌ల్యాండ్ యువరాణి బజ్రకితియాబా కన్నుమూశారు. ఆమె వయసు 47 ఏళ్లు. డిసెంబర్ 2022లో ఆమె స్పృహ కోల్పోయారు. గుండె పనితీరు రెగ్యులర్‌గా లేని కారణంగా ఆమె గుండె కండరాలకు మైక్రోప్లాస్మా ఇన్‌ఫెక్షన్ అయ్యింది. థాయ్‌ల్యాండ రాచకుటుంబం యువరాణి మృతి పట్ల తీవ్ర సంతాపం ప్రకటించింది. రాజు వజిరలాంగ్‌కార్న్ పెద్ద కుమార్తె ఆమె. ఆ రాజుకు ఏడు మంది పిల్లలు ఉన్నారు. 1978లో డిసెంబర్ 7వ తేదీన తొలి భార్యకు ఆమె జన్మించారు. వైద్య బృందం ఆ యువరాణికి ఇంటెన్సివ్ కేర్ చికిత్స అందించింది. కానీ ఆమె క్రమంగా బలహీనమైనట్లు గుర్తించారు. చూలలోంగ్‌కార్న్ ఆస్పత్రిలో ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. లాయర్‌గా ఆమె శిక్షణ పొందారు. అమెరికాలోని కార్నెల్ వర్సిటీలో ఆమెకు రెండు పీజీ డిగ్రీలు ఉన్నాయి. న్యూయార్క్‌లోని థాయ్ మిషన్‌కు కొన్నాళ్లు పనిచేశారామె. ఆ తర్వాత బ్యాంకాక్‌లోని అటార్నీ జనరల్ ఆఫీసులో పనిచేశారు. 2021 నుంచి 2014 వరకు థాయ్‌ల్యాండ అంబాసిడర్‌గా ఆస్ట్రియా దేశానికి చేశారు. జైలు సంస్కరణలు చేపట్టాలని ఆమె పిలుపునిచ్చారు. మరీ ముఖ్యంగా జైల్లోని మహిళల గురించి ఆమె ఆందోళన చేపట్టారు. థాయ్‌ల్యాండ్‌లో అత్యధిక సంఖ్యలో మహిళా ఖైదీలు ఉన్నారు. 2021లో ఆమె తండ్రి ఆమెకు జనరల్ హోదాను కల్పించారు. ప్రిన్సెస్ బజ్రకితియాబాకు క్రీడలు అంటే ఇష్టం. ఆమె లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్‌లో పాల్గొనేది. థాయ్ రాజు వజిరలాంగ్‌కార్న్ వయసు 73 ఏళ్లు. ఆయన ఇప్పటి వరకు తన వారసుడిని ప్రకటించలేదు. ఆ దేశ ఆచారాల ప్రకారం మగవారే వారసత్వాన్ని పొందాల్సి వుంటుంది. కానీ 1974 నాటి రాజ్యాంగ సవరణ ప్రకారం మహిళలు కూడా సింహాసనాన్ని అధిరోహించవచ్చు. రాజు వజిరలాంగ్‌కార్న్ రెండో భార్యకు నలుగురు కుమారులు ఉన్నారు. కానీ వాళ్లు తల్లితో కలిసి అమెరికాలో ఉంటున్నారు. ఇక మూడో భార్యకు ఒక కుమారుడు ఉన్నాడు. కానీ అతను రాచరిక బాధ్యతలు నిర్వర్తిస్తాడో లేదో అన్న సందేహాలు ఉన్నాయి.

# భారతీయులున్న నౌకపై అమెరికా దాడి.. యుఎస్ రాయబారికి రెండోసారి సమన్లు






**న్యూఢిల్లీ :** భారతీయ నౌకలపై అమెరికా వరుసగా దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో ముగ్గురు భారతీయులు మరణించారు. ఈ నేపథ్యంలో దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఇండియా.. మన దేశంలోని అమెరికా రాయబారి జేసన్ మీక్స్‌కు నిరసన తెలుపుతూ సమన్లు జారీ చేసింది. ఈ సమన్లు అందించిన తర్వాత కూడా ఇండియన్ వాణిజ్య నౌకలపై అమెరికా దాడి చేసింది. దీంతో మరోసారి అమెరికా రాయబారికి సమన్లు జారీ చేసింది. 48 గంటల వ్యవధిలోనే యూఎస్ రాయబారికి ఇండియా రెండుసార్లు సమన్లు జారీ చేసింది. ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ ఎంబసిగా పని చేస్తున్న మీక్స్‌ను కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి పిలిపించి, వివరణ కోరినట్లు తెలుస్తోంది. ఎంటీ జల్‌వీర్ అనే భారత వాణిజ్య నౌకపై హోర్ముజ్ జలసంధి వద్ద, ఒమన్ తీరంలో షినాసో పోర్టు సమీపంలో గురువారం అమెరికా దాడి చేసింది. ఈ నౌకలో 20 మంది భారతీయులున్నారు.

అంతకుముందు జూన్ 8న ఎంటీ మారివెక్స్ అనే నౌకపై కూడా అమెరికా దాడి చేసింది. ఈ నౌకలో 24 మంది భారతీయులు ఉండగా, 21 మందిని సహాయక సిబ్బందిని రక్షించారు. ముగ్గురు భారతీయులు మరణించారు. ఈ దాడులపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దాడులను ఖండిస్తూ కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ప్రకటన చేసింది. కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి శర్వానంద్ సోనోవాలా కూడా ఈ దాడుల్ని ఖండించారు. ఈ దాడుల్లో మరణించిన మృతుల కుటుంబాలకు సాయం అందిస్తామన్నారు.

# అధ్యాపకులకు ఎదురుదెబ్బ

## రిటైర్మెంట్ వయసు పెంపు ప్రభుత్వ విధాన నిర్ణయం : హైకోర్టు తీర్పు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పెంచాలా వద్దా అన్నది పూర్తిగా ప్రభుత్వ విధాన నిర్ణయానికి సంబంధించిన అంశమని, అలాంటి నిర్ణయాల్లో కోర్టులు జోక్యం చేసుకోలేవని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్ విశ్వవిద్యాలయాల అధ్యాపకులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. జస్టిస్ కె. శరత్ వెలువరించిన తీర్పులో, జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, పి.వి. నరసింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ హార్టికల్చర్ విశ్వవిద్యాలయాలకు చెందిన బోధనా సిబ్బంది దాఖలు చేసిన 13 పిటిషన్లను తిరస్కరించారు. ఉన్నత విద్యామండలి పరిధిలోని ఇతర విశ్వవిద్యాలయాల అధ్యాపకుల మాదిరిగానే తమ పదవీ విరమణ వయస్సును కూడా 60 నుంచి 65 సంవత్సరాలకు పెంచాలని వారు కోరారు.

పిటిషనర్ల తరఫున యుజిసి వేతనాలు పొందుతున్న ఇతర విశ్వవిద్యాలయ అధ్యాపకులకు పదవీ విరమణ వయస్సు పెంపు వర్తింపజేసి, తమను మినహాయించడం వివక్ష అని వాదించారు. అయితే ప్రభుత్వం తరఫున జీవో నెం.3 కేవలం ఉన్నత విద్యామండలి పరిధిలోని విశ్వవిద్యాలయాలకు మాత్రమే వర్తిస్తుందని, ఈ మూడు విశ్వవిద్యాలయాలు వేర్వేరు శాఖల పరిపాలనా నియంత్రణలో పనిచేస్తున్నాయని వివరించారు.

ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన న్యాయస్థానం, యుజిసి పే స్కేలు అమలు చేయడం ఒక అంశమైతే, పదవీ విరమణ వయస్సు నిర్ణయించడం పూర్తిగా వేరే అంశమని స్పష్టం చేసింది. వేర్వేరు విశ్వవిద్యాలయాలకు వేర్వేరు సేవా నిబంధనలు ఉండటం సహజమని పేర్కొంది. ఒకే విధమైన విధులు నిర్వహిస్తున్నామనే కారణంతో ఇతర విశ్వవిద్యాలయాల ఉద్యోగులతో సమాన హక్కులు కోరలేరని తేల్చి చెప్పింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని లేదా పూర్తిగా ఏకపక్షమని నిరూపితమైతే తప్ప న్యాయస్థాన జోక్యం ఉండదని హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో పదవీ విరమణ వయస్సు పెంపు కోరుతూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది.

# నయా నియంతృత్వం

(మొదటి పేజీ తరువాయి)

నిరూపించగలరా? అని సిఎం సవాల్ విసిరారు. ''పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 7 ముంపు మండలాలను ఎపిలో కలిపిన తరహాలోనే తెలంగాణ ప్రయోజనాల కోసం మహారాష్ట్ర నుంచి ఒక 1500 ఎకరాలను కిషన్ రెడ్డి సాధించలేరా? మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకునే వరకు క్యాబినెట్ సమావేశానికి వెళ్లనని కిషన్ రెడ్డి గానీ, రాజీనామా చేస్తామని రాష్ట్రానికి చెందిన 8 మంది బిజెపి ఎంపిలు గానీ ఎందుకు అనలేకపోతున్నారు? బిజెపి ఎంపిలు గట్టిగా ఒత్తిడి తెస్తే రాష్ట్రానికి నిధులు వస్తాయి. కానీ రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ను కూడా కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్ రెడ్డే కారణం.బిఆర్‌ఎస్ నేత కెటిఆర్ స్క్రిప్ట్ ప్రకారమే కిషన్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారు'' రేవంత్ రెడ్డి తీవ్రం గా ఆరోపించారు.తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సిఎంతో కిషన్ రెడ్డి ఎందుకు మాట్లాడలేదని సిఎం ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనామాట్లాడారా? అని కిషన్ రెడ్డిని సిఎం రేవంత్ రెడ్డి నిలదీశారు.

**శాంతిభద్రతల సమస్యలు తలెత్తకూడదనే పవన్ సభకు అనుమతి నిరాకరణ**

హైదరాబాద్‌లో ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరించడంపై వస్తున్న విమర్శలను సిఎం తోసిపుచ్చారు. 'పవన్ కల్యాణ్‌కు తెలంగాణకు రావడానికి, ఇక్కడ పోటీ చేయడానికి పూర్తి స్వేచ్ఛ ఉంది. కానీ ఆయన ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందువల్లే తెలంగాణ మంత్రులు స్పందించాల్సి వచ్చింది. కేవలం శాంతిభద్రతల సమస్యలు తలెత్తకూడదనే ఉద్దేశంతోనే పోలీస్ శాఖ ఆయన సభకు అనుమతి నిరాకరించింది. గతంలో ఎపిలో జగన్ మోహన్ రెడ్డి సభలకు కూడా చాలాసార్లు అనుమతి ఇవ్వలేదని, మరిఅప్పుడు ఎందుకు ఇవ్వలేదో పవన్ సమాధానం చెప్పాలని రేవంత్ ప్రశ్నించారు.

# లోగో ఆవిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

పోరాట కార్యక్రమాలు ఏ పద్ధతుల్లో నిర్వహించాలని నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఉద్యోగులు, కార్మికులకు అనేక హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ సెప్టెంబర్‌లో జరిగే మహాసభలను విజయవంతం చేసేందుకు ఎఐటియుసి అనుబంధ అన్ని కార్మిక సంఘాలు, ఎఐటియుసి శ్రేణులు విశేషంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమానికి మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎస్. మూర్తి, ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.సురేష్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు అశోక్, కృష్ణ తదితరులు హాజరయ్యారు.



# ప్రతిభగల విద్యార్థికి...

## ఏటా రూ.1లక్ష నగదు బహుమతి ప్రదానం

### 'డాక్టర్ వై.ఎస్.ఆర్ & డాక్టర్ కె.వి.పి ఫౌండేషన్' రూ.21లక్షల మొత్తాన్ని విరాళంగా అందజేత




**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ శాస్త్రాలలో చదువుతున్న విద్యాపరంగా ప్రతిభావంతుడైన విద్యార్థికి ఏటా రూ.1లక్ష నగదు బహుమతిని అందించేందుకు 'డాక్టర్ వై.ఎస్.ఆర్ & డాక్టర్ కె.వి.పి ఫౌండేషన్' రివాల్వింగ్ ఫండ్ కింద రూ.21లక్షల మొత్తాన్ని విరాళంగా అందజేసింది. తన ఆప్తమిత్రుడు దివంగత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి కలలను సాకారం చేయాలన్న ఆశయంతో డాక్టర్ కె.వి.పి.రామచందర్‌రావు ఈ పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించారు. జూన్ 12, 2026 జరిగిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలో భాగం గా భారతదేశంలో పరిశోధన, విద్యపై ప్రత్యేక దృష్టితో హరి త విప్లవానికి దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చేసిన అద్భుతమైన కృషి' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు సందర్భంగా ఫౌండేషన్ తరఫున మాజీ పార్లమెంట్ సభ్యులు ఉండవల్లి అరుణ్‌కుమార్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్యకు రూ.21లక్షల మొత్తానికి చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు విశిష్ట న్యాయమూర్తి (రిటైర్డ్) జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, బెంగళూరులోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ప్రొఫెసర్ మధుర స్వామినాథన్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి తదితర ప్రముఖులు హాజరయ్యారు. వ్యవసాయ శాస్త్ర రంగంలో విద్యా నైపుణ్యాన్ని ప్రోత్సహించడానికి, అర్హులైన విద్యార్థులకు మద్దతు ఇచ్చే విషయంలో డాక్టర్ వై.ఎస్.ఆర్ & డాక్టర్ కె.వి.పి ఫౌండేషన్ నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబించింది.

# జస్పాల్ రాణా కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

కలిగింది. భారత్‌కు చేరుకోగానే రాణాను ఢిల్లీలోని మాక్స్ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ ఆయనకు స్టెంట్ శస్త్రచికిత్స జరిగింది. ఆ తర్వాత ఆయన ఆరోగ్యం మెరుగుపడుతోందని వార్తలు వస్తున్నప్పటికీ, గురువారం రాత్రి ఆకస్మికంగా గుండెపోటు రావడంతో మరణించారు. 'జస్పాల్ రాణా మృతి పట్ల నేను తీవ్ర విచారించ వ్యక్తం చేస్తున్నాను. ఆయన మరణం భారత క్రీడా ప్రపంచానికి తీరని లోటు. షూటింగ్‌లో తన అసాధారణ విజయాల ద్వారా ఆయన దేశానికి అపారమైన కీర్తిని తెచ్చారు. యువ క్రీడాకారులను తీర్చిదిద్ది, మార్గనిర్దేశం చేసిన గురువుగా ఆయన చేసిన సేవ కూడా అంతే అద్భుతమైనది. శ్రేష్ఠత, క్రమశిక్షణ, క్రీడా ప్రపంచం పట్ల ఆయనకున్న నిబద్ధత ఎంతో ప్రశంసనీయం. ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ఈ నష్టాన్ని భరించే శక్తి లభించాలని కోరుకుంటున్నాము' అని మోదీ ఎక్స్‌లో ట్వీట్ షేర్ చేశారు. కాగా, రాణా 2012లో కోచింగ్ చేపట్టి ఎందరినో రాటుదేల్చారు. ఈ క్రమంలోనే భారత్‌లో ప్రముఖ షూటింగ్ కోచ్‌లలో ఒకరిగా ఎదిగారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన యువ షూటర్ మను బాకర్‌కు ఈయనే కోచ్ కావడం విశేషం. ఆమెకు ఆ పోటీల్లో వ్యక్తిగత కోచ్‌గా రాణా వ్యవహరించారు. తన ఈ విజయానికి కోచ్ జస్పాల్ కారణమని అప్పట్లో మను బాకర్ పేర్కొంది. రాణా 1990వ దశకంలో షూటింగ్ క్రీడలో ప్రసిద్ధి చెందారు. ఆయన ఆసియా క్రీడల్లో నాలుగు స్వర్ణ పతకాలు, కామన్వెల్త్ క్రీడల్లో తొమ్మిది స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. ఆయన ఒకసారి ఆసియా ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను కూడా గెలుచుకున్నారు. 1994లో 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచారు. సుదీర్ఘ కెరీర్‌లో రాణా 1994, 1998, 2002 ,2006లో జరిగిన కామన్వెల్త్ క్రీడలలో తొమ్మిది స్వర్ణాలు, నాలుగు రజతాలు, రెండు కాంస్యాలతో సహా 15 పతకాలు గెలిచి, దేశంలోని గొప్ప అథ్లెట్లలో ఒకరిగా ఆయన ఎదిగారు. ఆసియా క్రీడలలో కూడా ఆయన నాలుగు స్వర్ణాలు, ఒక రజతం గెలుచుకున్నారు. ముఖ్యంగా 2006 ఆసియా క్రీడలలో తీవ్ర జ్వరంతో బాధపడుతున్నప్పటికీ మూడు స్వర్ణ పతకాలు సాధించారు.

**జస్పాల్ రాణా మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి**

భారతదేశంలోని అత్యంత ప్రతిభావంతమైన షూటర్, ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత, భారత క్రీడారంగ అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన విశిష్ట కోచ్ జస్పాల్ రాణా మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో జస్పాల్ రాణా సాధించిన విశిష్ట విజయాలు, అలాగే 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం దేశానికి ఎనలేని గర్వకారణమని సిఎం ఒక సందేశంలో పేర్కొన్నారు. పిస్టల్ విభాగంలో భారత అత్యున్నత ప్రతిభ కనబరిచిన కోచ్‌గా ఆయన యువ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో, దేశ షూటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. జస్పాల్ రాణా మరణంతో భారతదేశం ఒక గొప్ప క్రీడాకారుడిని మాత్రమే కాకుండా, తన ప్రతిభ, క్రమశిక్షణ, క్రీడాసేవతో తరతరాలకు స్ఫూర్తిగా నిలిచే ఓ మార్గదర్శకుడిని కోల్పోయిందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ విషాద సమయంలో జస్పాల్ రాణా కుటుంబ సభ్యులు, స్నేహితులు, శిష్యులు, క్రీడా రంగానికి చెందిన వారందరికీ సిఎం తీవ్ర సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ముగిసింది

(మొదటి పేజీ తరువాయి)

ట్రంప్ షరతులు పెట్టినట్లు తెలిసింది. అవగాహన ఒప్పందంలో భాగంగా 30 రోజుల్లో హోర్ముజ్ జలసంధిని గతంలో వలే అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్లు సమాచారం. టోల్ వసూళ్లు ఆపేయాలని అమెరికా సూచించినట్లు తెలిసింది. అందుకు బదులుగా ఈ జల మార్గంలో నిర్బంధాన్ని అమెరికా ఎత్తివేయనుంది. హోర్ముజ్‌ను తెరిచిన 60 రోజుల తర్వాత ఇరాన్‌కు ఆంక్షల మినహాయింపు లభించనున్నట్లు తెలుస్తోంది.

**కంగుతిన్న నెతన్యాహు**

టెహ్రాన్ నాయకులు ముసాయిదా ఒప్పందాన్ని ఆమోదించినందుకు ఇరాన్‌పై దాడులు ఆపేస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కంగుతిన్నారు. ఇరాన్‌కు సంబంధించి అమెరికా వ్యూహాల గురించి ఆయనకు ఏ మాత్రం సమాచారం లేనట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. శాంతి ఒప్పందానికి సంబంధించిన తుది ముసాయిదాను ఖరారు చేసే ముందు నెతన్యాహు, ఖతార్ అమీర్ తమీమ్ అల్ థానితో పాటు ఇతర ప్రాంతీయ నాయకులతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడినట్లు నివేదికలు తెలిపాయి. అయితే వాషింగ్టన్, టెహ్రాన్‌కు మధ్య జరిగిన అవగాహన ఒప్పందంలో తెల్‌అవీవ్ భాగం కాదంటూ ఇజ్రాయిల్ ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది. శుద్ధి చేసిన యురేనియం తొలగింపు, క్షిపణుల ఉత్పత్తులపై పరిమితులు, ప్రాదేశిక ఉగ్రవాదానికి మద్దతు ఆపేయడం వంటి అంశాలతో కూడుకున్న ఒప్పందాన్ని ట్రంప్ రూపొందించినందుకు నెతన్యాహు మెచ్చుకున్నట్లు వెల్లడించారు.

**హోర్ముజ్‌ను వదులుకోం: ఇరాన్**

వ్యూహాత్మక సముద్ర మార్గం హోర్ముజ్ జల సంధిపై పట్టు వదులుకోమని ఇరాన్ ప్రకటించింది. అమెరికాతో ముసాయిదా ఒప్పందం జరిగినాగానీ హోర్ముజ్ జల సంధి తమ నియంత్రణలోనే ఉంటుందని తేల్చి చెప్పింది. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఇరాన్ అధికారులు చెప్పినట్లు అధికారిక వార్తాసంస్థ ఐఆర్‌ఎన్‌ఏ శుక్రవారం నివేదించింది. అమెరికా, ఇజ్రాయిల్ సైనిక దురాక్రమణకు ముందున్న పరిస్థితులను పునరుద్ధరించడం గురించి ఇరాన్ మాట ఇవ్వలేదని వెల్లడించింది. అదే సమయంలో టెహ్రాన్ అణు కార్యక్రమంపై ఒప్పందం కోసం 60 రోజుల పాటు సంప్రదింపుల కోసం కేటాయించినట్లు ఇరాన్ మీడియా తెలిపింది. అమెరికా ఆంక్షలు ఎత్తివేయడంతో పాటు అణు అంశాలపై ఒప్పందానికిగాను చర్చ లు జరిపేందుకు ఈ 60 రోజులు కేటాయించినట్లు పేర్కొంది.

# నియామక పత్రాలు

(మొదటి పేజీ తరువాయి)

కార్మికులకు సూచించారు. ఇటీవల కాలం వరకు కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 335 మంది వారసులకు మంచిర్యాలలో ఈ నెల 13వ తేదీన జరిగే కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్లు డిప్యూటీ సిఎం ప్రకటించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణిలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల అంశం తమ దృష్టిలో ఉందని, ఈ అంశాన్ని పరిష్కరించేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నామని, ఇందులో భాగంగానే ఈ అంశంపై న్యాయ పరమైన సలహా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిబంధనల మేరకు న్యాయ సలహా ప్రకారం సానుకూలంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**2,657 పోస్టులను భర్తీ**

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేశామని, వీటిలో 555 ఎక్స్‌టర్నల్ పోస్టులు ఉండగా, 2,102 కారుణ్య నియామక ఉద్యోగాలను ఇచ్చినట్లు డిప్యూటీ సిఎం తెలిపారు. ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీని కూడా ఆన్‌లైన్ పద్ధతిలో చేపట్టి వివాద రహితంగా అర్హులందరికీ ఉద్యోగాలు కల్పించామన్నారు. కారుణ్య నియామకాల కోసం ఉన్న గరిష్ఠ వయోపరిమితిని 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంచడం ద్వారా మరింత మంది అర్హులకు అవకాశం కల్పించామని, ఇప్పటికే 200 మంది లబ్ధి పొందారని వెల్లడించారు.

తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా సింగరేణి కార్మికుల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసినట్లు పేర్కొన్నారు. అందువల్ల సింగరేణి కార్మికుల పట్ల తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, వారి సంక్షేమం, ఉద్యోగ భద్రత, వారి కుటుంబాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. రానున్న రోజుల్లో కూడా సింగరేణిని బహుముఖంగా విస్తరించేందుకు, కొత్త బొగ్గు బ్లాక్‌లు సాధించేందుకు తద్వారా ఉద్యోగుల వారసులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతాయన్నారు. ఒడిశా నైనీ బ్లాక్ అనుమతులతోపాటు బొగ్గు ఉత్పత్తికి ప్రజా ప్రభుత్వంలో తీసుకున్న ప్రత్యేక చొరవను గుర్తు చేశా రు. రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల్లోనూ సింగరేణిని విస్తరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అయితే పోటీ మార్కెట్లో సింగరేణి నిలదొక్కుకోవాలంటే ఉత్పత్తి, ఉత్పాదకత పెరగాలని, ఇందుకోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సిఎం అన్నారు.

# యువత భారం

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగాలంటూ సరికొత్త స్లోగన్‌తో అధికారంలోకి వచ్చిన మోడీ యేటా రెండు లక్షల ఉద్యోగాలు కూడా కల్పించలేని పరిస్థితి. ప్రభుత్వ రంగం మొత్తం ప్రైవేటుపరంగా మారి కార్పొరేట్ చేతుల్లో బంధీ అయిింది. ఇక్కడ ఉద్యోగ అవకాశాలు దక్కడం లేదు. మెరిట్ విద్యార్థులు సైతం ఉద్యోగాలు సాధించలేని పరిస్థితి. దశాబ్ద కాలం పాటు యువతరాన్ని ఆకట్టుకున్న సాఫ్ట్‌వేర్ రంగం ఇప్పుడు తీవ్ర ఆందోళనకు గురి చేస్తుంది. ఒక్కో సంస్థ వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటనలు చేస్తున్నది. పెరిగిన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం కూడా నిరుద్యోగానికి దారి తీస్తుంది. యాంత్రీకరణ ఫలితంగా ఒక పక్క ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో దేశంలో ఉన్నటువంటి నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపించాల్సిన పాలకులు దీనిని పూర్తిగా విస్మరిస్తున్నారు. ఏదో ఒక రకంగా యువతను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు తప్ప ఉపాధి అవకాశాలపై పాలకులు దృష్టిసారించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఉన్నత చదువులు చదివి కూలీలుగా మారలేక, చదువుకు తగ్గ ఉద్యోగ అవకాశాలు లేక పాతికేళ్లు పైబడిన ఇంకా తల్లిదండ్రులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వారి అవసరాలు తీర్చడం ఇప్పుడు తల్లిదండ్రులకు ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు ఉపాధి అవకాశాలను కల్పించక పోవడంతో యువత తీవ్ర నైరాశ్యానికి గురవుతుంది. కొందరు గాడి తప్పి మద్యానికి, మత్తుకు బానిసలవుతుంటే మరికొందరు అసాంఘిక శక్తులుగా తయారవుతున్నారు. ఇది శాంతి భద్రతల సమస్యగా మారే ప్రమాదం ఉంది.

మరికొందరు తమకు కొలువు దొరకలేదన్న ఆత్మనూన్యత భావంతో మానసిక రోగులుగా మారిపోతున్నారు. ఉపాధి పొందగల సామర్థ్యం ఉండి చురుగ్గా ఉద్యోగాల కోసం వెతుకున్న వ్యక్తులు సైతం ఉద్యోగాలు పొందలేక పోతున్నారు. ఈ నిరుద్యోగం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఆర్థిక వ్యవస్థ పతనానికి నిరుద్యోగం కూడా ఒక కారణమవుతుంది. ప్రభుత్వాలపై ఏదో ఒక విధంగా ఒత్తిడి పెరుగుతుంది. సంక్షోభం ఏర్పడినప్పుడు ఒకటి లేదా రెండేళ్ల పాటు ఉపాధి అవకాశాలు కల్పించలేక పోవచ్చు. కానీ దశాబ్దాల తరబడి సాగుతున్న ఈ తంతు ఇప్పుడు శాపంగా మారుతుంది. పారిశ్రామిక రంగం కూడా కార్పొరేట్ గుప్పెట్లో చేరడం నిరుద్యోగం పెరిగేందుకు కారణమవుతుంది. గతంలో చిరు వ్యాపారాలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉండేది. ప్రభుత్వాలే చిరు వ్యాపారులకు ఆర్థిక సహాయాన్ని అందించేవి. ఇప్పుడు కార్పొరేట్ వ్యవస్థ బలోపేతంతో చిరు వ్యాపారాలు చిన్నబోతున్నాయి. సొంతంగా వ్యాపారాలు నిర్వహించే పరిస్థితి లేదు. అదే సమయం లో కుటీర పరిశ్రమలు క్రమేపి అంతర్థానమయ్యాయి. ఇంతకు ముందు కుటీర పరిశ్రమలు ఆయా స్థాయిలను బట్టి వందల సంఖ్యలో ప్రజలకు ఉపాధి కల్పించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రధానమైన వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోవడంతో యువతరం వ్యవసాయం వైపు దృష్టి సారించడం లేదు.

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో వ్యవసాయం పై ఆధారపడిన వారి సంఖ్య 80 శాతం నుండి 90 శాతం వరకు ఉంది. కానీ అది రాను రాను తగ్గిపోయి ఇప్పుడు కేవలం 50 శాతం మంది మాత్రమే వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. పెట్టుబడులు పెరగడం, దిగుబడులు తగ్గడం, కొనుగోళ్లు, విక్రయాలు, ప్రకృతి వైపరీత్యాలు, పాలకుల విధానాలు వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టడంతో యుతరం వ్యవసాయం చేసేందుకు జంకుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పుడు యువ రైతులు కరువవుతున్నారు.

ఇదే సమయంలో పాశ్చాత్య విష సంస్కృతి యువతపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రక రకాల అలవాట్లు యువతను అవహిస్తున్నాయి. ఉపాధి లేక చెడు వ్యసనాలకు బానిసలై తల్లిదండ్రులకు వేదనను మిగులుస్తున్నారు. కొందరు తల్లిదండ్రులు చెడిపోయిన యువతను చూసి తమ సంతానంగా చెప్పుకునేందుకు సైతం సిగ్గుపడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పాలకులు ఓట్ల రాజకీయాలు మాని ఉపాధి, ఉద్యోగ కల్పన రంగాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఎటు తిప్పినా ఓటు వేయించుకుందాం అన్న భావన నుంచి పాలకులు బయటపడాలి. నిరుద్యోగం ఈ దేశానికి శాపంగా మారి యువత ఆవేదన నుంచి ఆవేశంగా మారక ముందే పాలకులు మేల్కొనాలి. తల్లిదండ్రులకు భారంగా మారిన యువతరానికి ఉపాధి కల్పించడం లక్ష్యంగా ప్రణాళికాబద్ధ పాలనకు పూనుకోవాలి. లేదంటే దేశ భవిష్యత్తు గందరగోళంగా మారక తప్పని స్థితి.

# అట్టహాసంగా ఫిఫా ప్రపంచకప్ ప్రారంభం

## సాకర్ సంగ్రామం.. అద్భుత ఆరంభం..

## షకీరా, బర్నా బాయ్ పాటలతో దద్దరిల్లిన అజ్టెకా స్టేడియం

క్రీడా ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూసిన సమయం రానే వచ్చింది. ప్రతిష్టాత్మక ఫిఫా వరల్ కప్ అట్టహాసంగా మొదలైంది. ఆతిథ్య మెక్సికో సిటీలోని ఎస్టాడియో అజ్టెకా స్టేడియం వేదికగా గురువారం అర్ధరాత్రి జరిగిన ఆరంభ వేడుకలు జిగేల్మన్నాయి. స్టేడియం మధ్యలో ఉంచిన భారీ ప్రపంచకప్ ట్రోఫీ ప్రతిరూపం చుట్టూ మెక్సికో సాంప్రదాయ, ఆధునిక నృత్యకారులు చేసిన ప్రదర్శనతో వేడుకలు మొదలయ్యాయి. ఈవెంట్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచిన గ్లోబల్ పాప్ సెన్సేషన్ షకీరా మైదానంలోకి అడుగుపెట్టగానే అభిమానుల కేరింతలతో అజ్టెకా స్టేడియం దద్దరిల్లింది. ప్రముఖ సింగర్ బర్నా బాయ్ జతకలిసిన షకీరా స్టేడియాన్ని డ్యాన్స్‌ఫ్లోర్‌గా మార్చేసింది. టోర్నీ అధికారిక సాంగ్ 'దాయ్‌దాయ్' పాటకు తన ప్రదర్శనతో షకీరా స్టేడియాన్ని ఊపేసింది.



# దక్షిణాఫ్రికాపై 2-0 గోల్స్ తేడాతో మెక్సికో విక్టరీ



### తొలి మ్యాచ్‌లోనే ముగ్గురికి రెడ్ కార్డ్..

ఫుట్‌బాల్ వరల్డ్ కప్ ఫస్ట్ మ్యాచ్‌లోనే సంచలనాలు నమోదు అయ్యాయి. గ్రూప్ ఏలో ఆతిధ్య దేశం మెక్సికో తన తొలి గేమ్‌లో 2-0 తేడా గోల్స్‌తో దక్షిణాఫ్రికాపై విక్టరీ కొట్టింది. అయితే ఈ మ్యాచ్‌లో ముగ్గురు ఆటగాళ్లకు రెడ్ కార్డ్ జారీ చేశారు. బ్రెజిల్‌కు చెందిన రిఫరీ విల్టన్ సాంపాయో ఆటగాళ్ల పట్ల కఠినంగా వ్యవహరించారు. దక్షిణాఫ్రికా ఆటగాళ్లు వై. సిథోల్, టీ జ్వానేతో పాటు మెక్సికో ప్లేయర్ సీ మోంటిస్కు రెడ్ కార్డ్ ఇచ్చారు. దీంతో ఈ ముగ్గురు ఆటగాళ్లు గేమ్ నుంచి వైదొలగాల్సి వచ్చింది. తొలి మ్యాచ్‌లో తొలి గోల్‌ను మెక్సికో ప్లేయర్ జే క్వినోన్స్ చేశారు. అతను ఆట 9వ నిమిషంలో గోల్ కొట్టి మెక్సికోకు ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత సెకండ్ హాఫ్‌లో ఆర్ జిమినేజ్ 67వ నిమిషంలో గోల్ చేసి జట్టుకు 20 ఆధిక్యాన్ని అందించాడు. తీవ్రంగా పోరాడిన దక్షిణాఫ్రికా గోల్స్ చేయలేకపోయింది. ఓ దశలో కేవలం 9 మంది ఆటగాళ్లతో మాత్రమే ఆడింది. 2022లో ఖతార్లో జరిగిన వరల్డ్ కప్‌లో కేవలం నలుగురు ఆటగాళ్లకు మాత్రమే రెడ్ కారడ్స్ ఇచ్చారు. కానీ ఈసారి టోర్నీ తొలి మ్యాచ్‌లోనే ముగ్గురు ఆటగాళ్లకు రెడ్ కార్డు ఇవ్వడం చర్చాంశంగా మారింది.

### చెక్ రిపబ్లిక్‌కు షాకిచ్చిన దక్షిణకొరియా

ఫిఫా వరల్డ్ కప్ గ్రూపు ఏ మ్యాచ్‌లో చెక్ రిపబ్లిక్‌కు షాక్ ఇచ్చింది దక్షిణ కొరియా. 2-1 గోల్స్ తేడాతో దక్షిణ కొరియా విజయం సాధించింది. ఆ జట్టు తరపున హవంగ్ ఇన్ బియోమ్, ఓహ్ హేయన్ గుయు గోల్స్ చేశారు. ఇక చెక్ రిపబ్లిక్ తరపున ఎల్ క్రేజ్సీ గోల్ చేశాడు. వాస్తవానికి ఫస్ట్ హాఫ్లో ఏ జట్టు కూడా గోల్స్ చేయలేదు. కానీ సెకండ్ హాఫ్ ఆరంభంలో చెక్ రిపబ్లిక్ ప్లేయర్ ఎల్ క్రేజ్సీ ఆట 59వ నిమిషంలో గోల్ చేశాడు. మ్యాచ్లో చెక్ రిపబ్లిక్ విజయం సాధిస్తుందనుకున్న సమయంలో.. దక్షిణకొరియా అనూహ్యంగా కోలుకున్నది. ఆట 67వ నిమిషంలో హవంగ్, 80వ నిమిషంలో ఓహ్ హేయన్ గోల్స్ చేశారు. గ్రూపు ఏకు చెందిన మరో మ్యాచ్లో దక్షిణాఫ్రికాపై మెక్సికో విజయం సాధించిన విషయం తెలిసిందే.



# సైన్స్

## మూలకాల అధ్యయనంలో ముందడుగు

చైనా శాస్త్రవేత్తలు ఇటీవల అభివృద్ధి చేసిన ఆర్గాన్ ఆధారిత న్యూక్లియర్ ఫ్యూజన్ విధానం ఆధునిక అణు భౌతిక శాస్త్రంలో ఒక ముఖ్యమైన పురోగతిగా భావిస్తున్నారు. ఈ పద్ధతి ద్వారా విశ్వంలో కనిపించే అత్యంత భారమైన మూలకాలు (ఎలిమెంట్స్) ఎలా ఏర్పడతాయో తెలుసుకునే అవకాశం శాస్త్రవేత్తలకు కలుగుతోంది. అంతే కాకుండా, నక్షత్రాల లోపల లేదా భారీ ఖగోళ సంఘటనల సమయంలో జరిగే అణు ప్రక్రియలను ప్రయోగశాలలో అధ్యయనం చేయడానికి ఇది కొత్త మార్గాన్ని తెరిచింది. న్యూక్లియర్ ఫ్యూజన్ అనే ప్రక్రియ లో రెండు తేలిక పాటి అణు కేంద్రకాలు కలిసిపడి ఒక భారీ అణువుగా మారుతాయి. ఈ కలయిక సమయంలో అపారమైన శక్తి విడుదల అవుతుంది. ఇదే ప్రక్రియ సూర్యుడు వంటి నక్షత్రాలలో సహజంగా జరుగుతూ ఉంటుంది. అక్కడ హైడ్రోజన్ అణువులు పరస్పరం కలిసిపడి హీలియంగా మారుతాయి. ఈ ప్రక్రియ వల్లే సూర్యుడు నిరంతరం వెలుతురు మరియు ఉష్ణాన్ని విడుదల చేస్తూ ఉంటుంది. శాస్త్రవేత్తలు ఈ సహజ ప్రక్రియను భూమిపై కూడా నియంత్రితంగా పునరుత్పత్తి చేయాలని చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో చైనా పరిశోధకులు ఆర్గాన్ వాయువును ఉపయోగించే ఒక ప్రత్యేక విధానాన్ని అభివృద్ధి చేశారు. ఆర్గాన్ వంటి గ్యాస్‌ల సహాయంతో ప్రయోగశాలలో చాలా అధిక ఉష్ణోగ్రతలు తీవ్ర ఒత్తిడి పరిస్థితులను సృష్టించవచ్చు. ఇవి సాధారణంగా నక్షత్రాల అంతర్భాగాల్లో లేదా సూపర్‌నోవా పేలుళ్ల సమయంలో మాత్రమే కనిపిస్తాయి. ఆ సందర్భాల్లోనే విశ్వంలో అత్యంత భారమైన మూలకాలు సహజంగా ఏర్పడతాయి.



## అనుకోకుండా ఒక రోజు..

ఇలాంటి శీర్షికలతో సహజంగా కథలు లేదా సినిమాలు ఉంటాయి. కానీ, సైన్స్ చరిత్రలోనూ ఇలాంటి శీర్షికకు అనువైన ఘటనగా విలియమ్ హెర్చెల్ పరిశీలనను పేర్కోవచ్చు. జర్మనీలో జన్మించినప్పటికీ, ఇంగ్లాండ్‌లో స్థిరపడిన హెర్చెల్ వృత్తిరీత్యా సంగీతకారుడు. అయితే, అతను ఆకాశాన్ని చూస్తూ, తారలను గమనిస్తూ, విశ్వాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేవాడు. ఆ కాలంలో టెలిస్కోపులు పెద్దగా అభివృద్ధి చెందలేదు. అందువల్ల హెర్షెల్ తానే స్వయంగా టెలిస్కోపులు తయారు చేసుకుని వాటితో ఆకాశాన్ని పరిశీలించేవాడు. 1781 మార్చి 13న తన టెలిస్కోపు ద్వారా నక్షత్రాలను పరిశీలిస్తుండగా ఒక చిన్న వెలుగు బిందువు అతని దృష్టికి వచ్చింది. అది సాధారణ నక్షత్రంలా కనిపించినప్పటికీ, ఇతర నక్షత్రాల మధ్య కొద్దిగా కదులుతున్నట్టు అతనికి అనిపించింది. మొదట అతను దానిని ఒక తోకచుక్క (కామెట్)గా భావించాడు. కానీ కొన్ని రోజులు వరుసగా పరిశీలించిన తర్వాత ఒక ఆసక్తికరమైన విషయం బయటపడింది. ఆ వస్తువు తోకచుక్క మాదిరి అండాకార మార్గంలో కదలకుండా, చాలా స్థిరమైన కక్ష్యలో తిరుగుతున్నట్టు కనిపించింది. తరువాతి పరిశోధనల ద్వారా అది నిజానికి ఒక కొత్త గ్రహమని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఆ గ్రహానికి తరువాత పెట్టిన పేరు 'యురేనస్'. హెర్షెల్ ఆవిష్కరణకు ముందు వేల సంవత్సరాల పాటు మనిషికి తెలిసిన గ్రహాలు ఐదు మాత్రమే. అవి మెర్క్యురీ (బుధుడు), వీనస్ (శుక్రుడు), మార్స్ (అంగారకుడు లేదా కుజుడు), జూపిటర్ (గురుడు లేదా బృహస్పతి), శాటర్న్ (శని). ఇవన్నీ మన కంటికి కనిపించే గ్రహాలు కావడంతో పురాతన నాగరికతలు కూడా వాటిని గుర్తించాయి. యురేనస్ ఆవిష్కరణతో సౌర కుటుంబం పరిమాణం గురించి మనిషి అర్థం పూర్తిగా మారిపోయింది. అది శని గ్రహం కంటే చాలా దూరంలో ఉండటం వల్ల సౌర కుటుంబం మనం ఊహించిన దానికంటే చాలా పెద్దదని శాస్త్రవేత్తలు గ్రహించారు. ఈ ఆవిష్కరణ తర్వాత ఖగోళ శాస్త్రవేత్తలు ఇంకా దూరంలో కూడా గ్రహాలు ఉండవచ్చన్న అభిప్రాయంతో మరింత లోతైన పరిశోధనలు, పరిశీలనలు జరిపారు. ఆ అనుమానం తరువాత నిజమైంది. తర్వాత, 1846లో నెప్ట్యూన్, 1930లో ప్లూటోను కనిపెట్టారు. నిజానికి హెర్షెల్ మొదట పెద్ద ఆవిష్కరణ చేయాలని ప్రయత్నించలేదు. ఆ వెలుగు ఏమిటి? అనే ప్రశ్న అతని మస్తిష్కంలో స్పృశించింది. అదే చివరికి ఒక కొత్త గ్రహాన్ని పరిచయం చేసింది. విజ్ఞానశాస్త్రంలో గొప్ప ఆవిష్కరణలు ఇలాగే ఒక సాధారణ సందేహం నుంచే ప్రారంభమవుతాయి.



## యాంటీమేటర్ కేంద్రకం గుర్తింపు

ప్రపంచం ఎంత విస్తారమో మనకు తెలుసు. కానీ అదే సమయంలో, అతి చిన్న స్థాయిలో ఎంత పెద్ద రహస్యాలు దాగి ఉన్నాయో తెలుసుకునే ప్రయత్నం మనిషి చేస్తున్న తీరు గమనిస్తే ఆశ్చర్యంతో పాటు గర్వం కూడా కలుగుతుంది. ఇటీవల శాస్త్రవేత్తలు చేసిన ఒక ముఖ్యమైన ప్రయోగ ఫలితం దీనికి ఉదాహరణగా నిలుస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద కణ వేగవంతకం అయిన లార్జ్ హాడ్రాన్ కొలైడర్‌లో ఇప్పటి వరకు స్పష్టంగా గుర్తించని అత్యంత బరువైన యాంటీమేటర్ కేంద్రకాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది సాధారణంగా కనిపించినా, భౌతిక శాస్త్రంలో దీని ప్రాధాన్యం ఎక్కువ. ఈ యంత్రంలో కణాలను అతివేగంతో ఢీకొట్టిస్తారు. తద్వారా, విశ్వం ఆరంభంలో ఉన్న పరిస్థితులను చిన్న స్థాయిలో మళ్లీ సృష్టించే ప్రయత్నం జరుగుతుంది. ఈ ప్రక్రియలో పదార్థం, ప్రతిపదార్థం (మేటర్, యాంటీమేటర్) క్షణికంగా పుట్టి వెంటనే మాయమవుతాయి. ఈ ప్రయోగంలో గుర్తించిన ప్రతిపదార్థ కేంద్రకం తక్కువ సమయంలోనే అదృశ్యమవుతుంది. అయినప్పటికీ, అతి సున్నితమైన డిటెక్టర్లు ఆ కణాలు వదిలే చిన్న సంకేతాలను ఒడిసిపట్టుకొని, వాటి ఉనికిని నిర్ధారిస్తాయి. ఇది ఎవరైనా ఒకరు క్షణం పాటు కనిపించి వెళ్లిపోయినా, వారి అడుగుల జాడల ద్వారా వారి ఉనికిని గుర్తించడం లాంటిదే. ఈ ప్రయోగ ప్రాధాన్యం ఇక్కడితో ముగియదు. విశ్వం ఎలా ఏర్పడింది, ఎందుకు పదార్థం ఎక్కువగా ఉంది. యాంటీమేటర్ ఎందుకు కనిపించడం లేదు? అనే కీలక ప్రశ్నలకు ఇది దారితీస్తుంది. సిద్ధాంతాల ప్రకారం, విశ్వం ప్రారంభంలో ఈ రెండూ సమానంగా ఉండాలి. కానీ ప్రస్తుతం మనం చూస్తున్నది మాత్రం పదార్థ ఆధిక్యం. ఈ అసమతుల్యతకు కారణం ఏమిటో ఇంకా పూర్తిగా తెలియలేదు. ఇలాంటి ప్రయోగాలు మనిషి విజ్ఞాన శక్తి ఎంత దూరం వెళ్లిందో చూపిస్తున్నాయి.



## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

### సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జగద్గిరిగుట్ట జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలను సిపిఐ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఉమా మహేష్ మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నప్పటికీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించాల్సిన యూనిఫాంలు ఇప్పటికీ పంపిణీ కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థుల బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. విద్యార్థుల విద్యాభ్యాసం దెబ్బతినకుండా ప్రభుత్వం వెంటనే యూనిఫాంలు అందించడంతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ శాఖ కార్యదర్శి ఎం.సహదేవరెడ్డి, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, సిపిఐ నాయకులు కృష్ణ, శ్రీనివాస్ చారి, యువజన నాయకులు కార్తిక్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## పోడు భూములకు పట్టాలు

### దండు ఆదినారాయణ డిమాండ్



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** మండల పరిధిలోని చెరుకుపల్లి గ్రామంలో 35 సంవత్సరాలుగా పోడు కొట్టి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వకుండా, ఆ భూముల్లోకి గిరిజనులను రానివ్వకుండా ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని, దీనిపై చర్యలు చేపట్టి పోడు భూములకు పట్టాలివ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం తహశీల్దార్ పున్నం సత్యనారాయణకు గిరిజనులు, సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దండు ఆదినారాయణ మాట్లాడుతూ ఫారెస్ట్ అధికారుల అత్యుత్సాహం, గత ప్రభుత్వ మూర్ఖపు ధోరణి వల్ల గిరిజనులు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములు బీళ్ళు పడాల్సిన పరిస్థితి వచ్చిందని, హరితహారం పేరుతో వందల కోట్ల రూపాయలు మట్టి పాలు చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారులు జోక్యం చేసుకుని గిరిజనుల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇందిరమ్మ ఇల్లు గిరిజనులకి ఇచ్చి, పేదలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి తడికమళ్ళ యోబు, నాయకులు తాటి వీరభద్రం, తాత్రాజులు, రంజాన్ బి, కోలేటి వెంకటేశ్వర్లు, తాటి రత్తమ్మ, తారబోయిన రాజమ్మ, వెంకటేశు, కృష్ణ, భద్రమ్మ, కోరం భద్రమ్మ, గడ్డం కృష్ణయ్య, గడ్డం రాజులు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపూర్ అసైన్డ్ భూమిని పేదలకు పంచాలి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్

### సిపిఐ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ వద్ద ధర్నా




**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపూర్ గ్రామంలో అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వెంకటాపూర్ గ్రామరైతులు, పేదలు ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమానికి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చట్టవిరుద్ధంగా అసైన్డ్ భూములను కొందరు స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారుల అండదండలతో పేదల అసైన్డ్ భూములను భూకబ్జాదారులు ఆక్రమించుకున్నారని, వాటిని అధికారులు రద్దు చేసి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. వెంకటాపూర్ అసైన్డ్ భూమిని ఆక్రమించుకున్న భూకబ్జాదారులను నుంచి భూమిని స్వాధీన చేసుకోవాలని కోరారు. స్వాధీనం చేసుకున్న అసైన్డ్ భూమిని తిరిగి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూమిని ఆక్రమించుకున్న భూకబ్జా దారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వెంకటాపూర్‌లో అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించని ఎడల సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లాలో అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ భూములను సిపిఐ ఆధ్వర్యంలో భూపోరాటాలు నిర్వహించి పేదలకు పంపిణీ చేస్తామని అన్నారు. భూ కబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చట్టాలు ఉపయోగించి కేసులు నమోదు చేయాలని, భూకబ్జాదారుల కొమ్ము కాస్తూ వారికి సహకరించిన రెవెన్యూ అధికారుల సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌నను కలిసి వినతిపత్రం అందజేశారు. సత్వరమే ఆక్రమణదారుల పైన కేసులు నమోదు చేసి శిక్షించాలని, సదరు ప్రభుత్వ సీలింగ్ భూమిని స్వాధీనం చేసుకొని పేదలకు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక తహసీల్దారు, ఆర్డీవో సమస్యలను పక్కదారి పట్టించకుండా ప్రభుత్వ ఆస్తులను కాపాడే విధంగా వారికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తక్షణమే సంబంధిత రెవెన్యూ అధికారులను పిలిచి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎదునూరి వెంకట్రాజం, కొట్టెపాక రవి, మండల నాయకులు మాదాసి యాకూబ్, జూకంటి పద్మ, పాము రమ, బండి సరిత, ప్రశాంతి, యాకమ్మ, మాదాసు మల్లయ్య, ఆరోగ్యం తదితరులతో పాటు వందలాది మంది పేదలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సిబ్బందికి వేతన హామీ అమలు చేయాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్

**ప్రజాపక్షం/ పాల్వంచ :** అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందికి వేతనాలు పెంచుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం పాల్వంచ సిఆర్ భవన్‌లో నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ అసోసియేషన్ ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సమావేశం గోనె మణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నరాటి మాట్లాడుతూ టీచర్లకు, హెల్పర్లకు రోజురోజుకూ అదనపు పనిభారం పడుతోందని, వేతనాలు, ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్లుల చెల్లింపు సమస్య కొనసాగుతూనే ఉందన్నారు. బిఎల్‌ఓ విధులతో సహా ఇతర అదనపు బాధ్యతల కారణంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. అందువల్ల సిబ్బందికి అప్పగించిన బిఎల్‌ఓ విధులను రద్దు చేయాలని కోరారు. ప్రీ ప్రైమరీ పాఠశాలల పేరుతో అంగన్వాడీ కేంద్రాల ప్రాధాన్యతను తగ్గించే విధానాలు అమలవుతున్నాయని, దీనివల్ల అంగన్‌వాడీ వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉందన్నారు. టీచర్లలో పదేళ్లు పూర్తి చేసి డిగ్రీ, పీజీ ఉన్న వారికి సిడిపిఓ గ్రేడ్ 1 సూపర్వైజర్, కార్యాలయ సిబ్బంది పోస్టుల్లో 30 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు నెలకు రూ.15వేలు, హెల్పర్లకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోనె మణి, రెడ్డి అరుణ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లిఖార్జున్, అన్నారపు వెంకటేశ్వర్లు, విజయ, శ్రీలత, సావిత్రి, సుభాషిణి, వినోద, భారతి, నీరజ, సరోజని, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత

### ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి

**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రభుత్వ విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి అన్నారు. ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి అధ్యక్షత వహించగా ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, పిడిఎస్‌యు, బిసి సంఘాల ప్రతినిధులు పాల్గొని విద్యా రంగంలోని వివిధ సమస్యలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీచేయాలని, ప్రభుత్వ విద్యా సంస్థలకు అవసరమైన భవనాలు, తాగునీరు, మరుగుదొడ్లు, ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, డిజిటల్ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్య అనేది ప్రతి ఒక్కరికీ రాజ్యాంగబద్ధమైన హక్కు అని, దానిని వ్యాపార వస్తువుగా మార్చే విధానాలను అరికట్టాలని అన్నారు. అలాగే ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారానే సమాజంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా, ప్రతి విద్యార్థికి నాణ్యమైన, అందుబాటు విద్యను ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రైవేట్ విద్యా సంస్థల్లో కొనసాగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టడం, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడం, ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించి విద్యను బలోపేతం చేయడం వంటి కీలక అంశాలపై వక్తలు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, విద్యార్థుల హక్కుల సాధన కోసం విద్యార్థి నాయకులు నిరంతరం పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్, పిడిఎస్‌యు నాయకుడు అర్జున్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్, బీసీ సంఘం నాయకుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత జీవన విధానాలను ప్రోత్సహించాలని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, మున్సిపల్ కమీషనర్ హన్మంతరెడ్డి అన్నారు. ప్రజలు, వ్యాపారులు, దుకాణదారులు కలిసి గుడ్డ, జనపనార సంచుల వినియోగాన్ని పెంచి స్వచ్ఛమైన పట్టణ నిర్మాణానికి సహకరించాలని కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి), ప్రాంతీయ కార్యాలయం నల్లగొండ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పండి గుడ్డ, జనపనార సంచుల వినియోగాన్ని ప్రోత్సహించండనే అవగాహన సదస్సులో ముఖ్య అతిధిగా హాజరై వారు ప్రసంగించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల నేల, నీరు, గాలి కాలుష్యానికి కారణమవుతోందని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లో అలవాట్ల మార్పు అవసరమని తెలిపారు. అనంతరం పాల్గొన్న వారికి గుడ్డసంచులు పంపిణీ చేయగా, సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో సుమారు 500 బట్ట సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ సైంటిస్ట్ డాక్టర్ పురుషోత్తం రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ యండి షఫీఉల్లా, ఇంచార్జి శానటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు, వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఫీజుల దోపిడీని అరికట్టాలి : ఎఐఎస్‌ఎఫ్



**ప్రజాపక్షం/మోత్కూర్ :** ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యారంగ సమస్యలపై రౌండ్ టేబ్ సమావేశం ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జిట్టా గౌతం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రౌండ్ టేబ్ సమావేశానికి విచ్చేసి మాట్లాడిన విద్యార్థి సంఘాల నాయకులు బిఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు ఎండి నయీమ్, విజిఎస్ జిల్లా అధ్యక్షులు గోపి సంయుక్తంగా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ, విద్యా హక్కు చట్టం సమర్థవంతమైన అమలు, విద్యారంగంలో ప్రైవేటీకరణను అరికట్టడం ప్రైవేట్ విద్యా సంస్థలలో ఫీజుల దోపిడీ అరికట్టి, ఫీజు నియంత్రణ చట్టం ప్రకారం పేద మధ్యతరగతి విద్యార్థులకు 25 శాతం ఉచిత నిర్బంధ విద్య అందించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో స్టేషనరీ యూనిఫామ్ అమ్ముతున్న విద్యాశాఖ ఉన్నత అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు బుర్రు అనిల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సూరారం జానీ, జిల్లా నాయకులు చిప్పలపల్లి నవీన్, యాస సుధాకర్ రెడ్డి, సువ్వి కరుణాకర్, జిట్టా జైవీర్, విజెఎస్ అధ్యక్షులు చెరుకు శివరాజ్, బిఆర్ఎస్వి టౌన్ అధ్యక్షులు జంగా శివ, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వాడీవేడిగా కోదాడ మున్సిపాలిటీ సాధారణ సమావేశం!

వాడివేడిగా చర్చలు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణ పరిధిలోని పలు అంశాలపై బిఆర్ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు మామిడి రామారావు, చీమ నరేష్, కందుల చంద్రశేఖర్ లతో పాటు ఇండిపెండెంట్ కౌన్సిలర్ డాక్టర్ నాగేశ్వరరావు మరో ఇరువురు అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు కమిషనర్‌ను, అధికారులను నిలదీసినట్లు తెలిసింది. అధికారుల నిర్లక్ష్యంపై పలువురు కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మున్సిపల్ ప్రత్యేక అధికారి పాలన హాయంలో భారీగా అధికారులు అవినీతికి పాల్పడి నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు దండుకొని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను 22వ గ్రూప్‌గా ఏర్పాటు చేసిన అంశంపై దాదాపు రెండున్నర గంటల పాటు కమిషనర్ కౌన్సిలర్ల మధ్యలో తీవ్రస్థాయిలో వాగ్వివాదం జరిగినట్లు తెలిసింది. ఏడుగురు ఉద్యోగులను నియమించారని, ఇప్పుడు సదరు గ్రూపులో మృతి చెందిన వారసులను కాక ఇతర వ్యక్తులను ఎలా నియమించారని మండిపడ్డారు. సదరు గ్రూప్‌కు జీతాలు నిలిపివేయాలని బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లతో పాటు పలువురు అధికార పార్టీ కౌన్సిలర్ కూడా డిమాండ్ చేయడంతో ఆ గ్రూపును పక్కకు పెట్టినట్లు తెలిసింది. గతంలో 26 మందిని. 70 మందిని నియమించి జీతాలు ఇవ్వకుండా పక్కకు పెట్టారని, అప్పుడు లేని మానవతా దృక్పథం ఇప్పుడు ఎందుకు చూపాలని బిఆర్ఎస్ కౌన్సిలర్లు ఎదురు సమాధానం చెప్పినట్లు తెలిసింది. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంబాబు, వైస్ చైర్మన్ మల్లేశ్వరి, కమిషనర్ రమాదేవి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## గ్రామస్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ దళిత క్రైస్తవుల రిజిర్వేషన్లపై గడువు పెంచి గ్రామస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కేసారం గ్రామ బేతెస్థ ప్రార్థన మందిరంలో నిర్వహించిన పాస్టర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మతం మారిన దళిత క్రైస్తవులకు వివక్ష తప్పట్లేదుని ఆర్థికంగా, రాజకీయంగా వెనుకనే ఉన్నామన్నారు. రిజర్వేషన్ల అమలుపై కేంద్రం నియమించిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ కమీషన్‌నకు గడువు పెంచాలని కోరారు. గ్రామస్థాయిలోకి వచ్చి సమగ్ర విచారణ జరిపి ముస్లింలు, సిక్కు, బౌద్ధ మతం వారికి ఎస్‌సి హోదా కల్పించినట్టే క్రైస్తమ మతం మారిన దళితులకు కూడా ఎస్‌సి హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై దాదాపు నాలుగేండ్లపాటు సుదీర్ఘ అధ్యయనం చేసి కూడా గ్రామ స్థాయిలో సమగ్ర విచారణ జరుగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సువార్త చర్చ్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కోఆర్డినేటర్ పాస్టర్ సి.హెచ్. శ్యాంప్రసాద్, నియోజక వర్గ పాస్టర్స్ అధ్యక్షులు రెవ. జలగం జేమ్స్ పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య,
ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/ఆలేరు :** మహిళల అభివృద్ధి, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్పర్సన్ బండ్రు శోభారాణి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణలు అన్నారు. శుక్రవారం ఆలేరు పట్టణంలోని దినేష్ గార్డెన్స్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మహిళా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి దోహదపడుతున్నాయని అన్నారు. మహిళలు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మరింత ముందుకు రావాలని, కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో వారి పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ప్రతి అర్హ కుటుంబానికి పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని సూచించారు. మహిళల ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ, ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఎల్లప్పుడూ సముచిత స్థానం కల్పిస్తుందని, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మహిళలను మరింత సంఘటితం చేసి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని అన్నారు. మహిళా రిజర్వేషన్ పేరుతో గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ మహిళలకు నిజమైన రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో మహిళలు చైతన్యవంతంగా పని చేసి ఒక్క మహిళా ఓటు కూడా మిస్ కాకుండా చూడాలని, కొత్తగా వివాహమైన మహిళల పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీలను ఆదర్శంగా తీసుకుని మహిళలు రాజకీయాలు, సామాజిక సేవలో ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ పాల్గొన్నారు.

# గిరిజనులకిచ్చిన హామీలను విస్మరిస్తే ప్రత్యక్ష పోరాటం

గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
రమావత్ అంజయ నాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించాయని గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండలోని తెలంగాణ గిరిజన సమాఖ్య నల్గొండ జిల్లా 3వ మహాసభ దేవిలాల్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిధిగా గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయనాయక్ మహాసభను ప్రారంభించి మాట్లాడుతూ గిరిజన హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగించాలని పాలక ప్రభుత్వాలపై హక్కుల కోసం పోరు సాగించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసి గిరిజనులపై అవలంభిస్తున్న విధానాలను ఎండగట్టాలని అన్నారు. కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం ముచ్చటగా మూడవ సారి అధికారంలోకి వచ్చి ఈశాన్య రాష్ట్రాలలో అల్లర్లు సృష్టించి అక్కడ ఉన్నటువంటి అడవి ఖనిజ సంపదను అభివృద్ధి పేరుతో కార్పొరేట్ శక్తులకు అప్పనంగా ధారాదత్తం చేస్తుందన్నారు. అందులో భాగమే ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసి గిరిజనుల నక్సలైట్ల పేరుతో మరణకాండను సృష్టించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అటవీ భూములను బడా పెట్టుబడిదారులకు అప్పజెప్పి అడవుల్లో జీవించే ఆదివాసి గిరిజనులకు ప్రకృతి సంపదమీద ఎలాంటి హక్కులు లేకుండా చేయడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకిచ్చిన చేవెళ్ల డిక్లరేషన్ అమలు పర్చాలని అన్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో ట్రైకర్ రుణాలను 216 కోట్లు విడుదల చేయాలని ప్రజాపాలనలో భాగంగా రాజీవ్ యువ వికాసం పేరుతో తీసుకొచ్చిన పథకాన్ని అమలు పర్చి కాంగ్రెస్ ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని అన్నారు. లేని పక్షంలో గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ గిరిజన హక్కుల కోసం గిరిజనులు నిరంతరం పోరాటాలు కొనసాగించాలని అన్నారు. గిరిజనులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలు ఉధృతం చేయాలని, పెట్రోల్, డిజిల్, వంటగ్యాస్ ధరలు పెంచటం వలన సామాన్య మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారాం పడిందని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటమే మార్గమని అన్నారు. ఈ మహాసభలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి లింగానాయక్, సోమ్లానాయక్, పాపానాయక్, గాంసిరాం, మంగ్లీ, భారతి, శంకర్, గోపి, దశరథ, కసనా, రామరాజు, బక్కయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్, ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి పాండురంగారావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, లాలొసింగ్, కేస్య, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పు ఇవ్వనందుకే హత్య!

ఛేదించిన సాయి హత్య కేసు
ఇద్దరు నిందితుల అరెస్ట్- బంగారు ఆభరణాలు,సెల్‌ఫోన్లు స్వాధీనం
అదనపు ఎస్‌పి జి. రమేష్ వెల్లడి





**ప్రజాపక్షం/నల్లగొండ :** తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశరాజుపల్లి శివారులో సోమవారం రాత్రి జరిగిన బోథ్ సాయి కుమార్ (27) హత్య కేసును పోలీసులు ఛేదించారు.చీరల వ్యాపారం కోసం రూ.30 వేల అప్పు ఇవ్వలేదన్న కక్షతో, బంగారు ఆభరణాల కోసం స్నేహితుడే దారుణంగా హత్య చేసినట్లు విచారణలో తేలింది.ఈకేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు నిందితులను విజయవాడలో అరెస్ట్ చేసి, బంగారు తాయెత్తు, ముక్కుపుడక,చెవి కమ్మలతో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు అదనపు ఎస్‌పి జి. రమేష్ వివరాలు గురువారం వెల్లడించారు.హత్య కేసును ఛేదించేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకున్నారు. నిందితులు ఫుర్ఖాన్ అలియాస్ మహేష్ (37),ఆరిఫ్ (26)లు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బాగ్‌పత్ జిల్లా బరౌత్ గ్రామానికి చెందినవారు. ప్రస్తుతం నల్లగొండ మేతర్ కాలనీలో ఉంటూ చీరల వ్యాపారం చేస్తున్నారు.మృతుడు బోథ్ సాయి కుమార్ గొల్లగూడెం ప్రాంతానికి చెందినవాడు. గ్రామదేవతల పండుగల్లో ఆడవేషం ధరించి కొలుపులు చెప్పే సాయి కుమార్‌కు చీరల వ్యాపారి ఫుర్ఖాన్‌తో పరిచయం ఏర్పడింది. వ్యాపార అవసరాల కోసం రూ.30 వేల అప్పు అడిగినా సాయి కుమార్ ఇవ్వకపోవడంతో ఫుర్ఖాన్ కక్ష పెంచుకున్నాడు. అదే సమయంలో సాయి కుమార్ ధరించే బంగారు,వెండి ఆభరణాలను దోచుకోవాలని పథకం వేశాడు.ఈ నెల 8వ తేదీన ఫుర్ఖాన్ తన సహచరుడు ఆరిఫ్‌తో కలిసి సాయి కుమార్‌ను మద్యం పార్టీ పేరుతో కేశరాజుపల్లి శివారులోని నిర్మాణంలో ఉన్న వెంచర్‌కు తీసుకెళ్లాడు.మద్యం సేవించిన అనంతరం అప్పు విషయంలో గొడవపడి సిమెంట్ రాయితో తలపై బలంగా కొట్టడంతో సాయి కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం మృతుడి ఒంటిపై ఉన్న బంగారు తాయెత్తు, చెవి కమ్మ, ముక్కుపుడకతో పాటు హోండా ఆక్టివా స్కూటీ, సెల్‌ఫోన్ తీసుకుని నిందితులు పరారయ్యారు.రక్తపు మరకలున్న దుస్తులను దాచిపెట్టి విజయవాడ వెళ్లి బంగారం విక్రయించే యత్నం చేయగా, సాంకేతిక ఆధారాలతో పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.ఈకేసును నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి పర్యవేక్షణలో,టూ టౌన్ సీఐ రాఘవరావు ఆధ్వర్యంలో తిప్పర్తి ఎస్ఐ శంకర్,రూరల్ ఎస్ఐ సైదాబాబు, ఏఎస్ఐ అఫ్జల్,హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్ రెడ్డి,శ్రీను, కానిస్టేబుళ్లు జానకిరాములు,రాంరెడ్డి, సునీల్, గురవారెడ్డి,రాజు, ముజ్జు,సైదులు,నాగరాజు బృందం ఛేదించింది. నిందితులను వేగంగా పట్టుకున్న పోలీసు బృందాన్ని జిల్లా ఎస్‌పి అభినందించారు.

# కాలువ పూడ్చివేతపై రైతుల ఆందోళన



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరడ గ్రామం మీదుగా నిర్మించిన బ్రాహ్మణ వెల్లంల కుడి కాలువపై గాదిరెడ్డిపల్లెకు వెళ్ళే పాత రోడ్డు ప్రదేశంలో కాలువను పూడ్చివేసిన ఘటనపై ఆ గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం గ్రామంలో ఆందోళన నిర్వహించారు. గత బుధవారం రాత్రి పలువురు తమ స్వార్థంతో కాలువను జెసిబి సహాయంతో పూడ్చివేసే ప్రయత్నం చేయడంతో కింది ప్రాంత రైతులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నేరడ నుండి గాదిరెడ్డిపల్లెకు వెళ్ళే ప్రాంతం గుండా ఇరిగేషన్ శాఖ వారు కాలువను నిర్మించారు. గత కొంత కాలంగా కాలువ గుండా ప్రాజెక్టు గుండా నీటిని కూడా తరలిస్తున్నారు. దీని కారణంగా నేరడ, సూదిరెడ్డిగూడెం, వెంకటాపురం తదితర ప్రాంతాలలో భూగర్భ జలాలతో నీటిమట్టం బాగా పెరిగింది. దీంతో రైతులు బీడు భూములను కూడా సాగులోకి తెచ్చుకున్నారు. కాగా పలువురు వ్యక్తులు రహదారి అవసరాల కోసం కాలువను పూడ్చే ప్రయత్నంలో కాలువను పూడ్చే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న రైతులు ఈ విషయంపై స్థానిక పోలీసులను సంప్రదించారు. ఈ విషయంపై విచారించేందుకు గురువారం రోజును పలువురిని స్థానికి పోలీస్ స్టేషన్‌కు పోలీసులు పిలిపించారు. ఈ విషయంపై వారు తమ బంధుగణంతో పోలీస్ స్టేషన్‌కు విచ్చేసి పోలీసులు, గ్రామ నాయకులపై ఆరోపణలు చేపట్టి తమ వారిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆందోళన చేపట్టారు.

**రైతుల ఆందోళన:** అంసపూర్తిగా మిగిలిపోయిన కాలువ పనులను తమ స్వంత నిధులను వెచ్చించి నీటి వనరులను ఏర్పరుచుకున్న మాకు నష్టాన్ని కలిగిస్తున్న వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని గ్రామ రైతులు శనివారం కాలువ దగ్గర ఆందోలన చేపట్టారు. కాలువలోని మట్టిని వెంటనే ఎత్తివేయించాలని వారు డిమాండ్ చేశారు. నేరడ నుండి గాదిరెడ్డిపల్లె వెళ్ళడానికి అనువైన రహదారి ఉన్నప్పటికి కొందరు కేవలం తమ స్వార్థం కోసం కాలువను పూడ్చాలని చూశారని వారు ఆరోపించారు.

**ఇరిగేషన్ శాఖ ఫిర్యాదు:** సంఘటనా స్థలాన్ని స్థానిక తహసిల్దార్ విజయ్‌కుమార్, ఎస్ఐ రవికుమార్, ఇరిగేషన్ ఏఈ విజయ్‌కుమార్ చేరుకుని పరిశీలించారు. కాలువ పూడ్చివేత ప్రాంతంలో చేపట్టిన చర్య చట్టవ్యతిరేకమని తేల్చారు. ఇరిగేషన్ శాఖ పటంలో ఈ ప్రాంతంలో రోడ్డు లేదన్న విషయం 2009లోనే ఈ ప్రాంత ప్రజలకు తెలియజేయడం జరిగిందని ఇరిగేషన్ ఏఈ తెలిపారు. ఈ ప్రదేశంలో కాలువపై బ్రిడ్జి నిర్మాణం కోసం ఈ ప్రాంత ప్రజలు చేసిని విన్నపాన్ని తమ శాక పరిగణలోకి తీసుకుందని, ఈ విషయాన్ని ప్రభుత్వానికి కూడా తెలియపర్చామన్నారు. ఈ విషయంపై ఆకుల నర్సింహ్మా, ఇతరులపై ఇరిగేషన్ శాఖ వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

**పైపులు అమ్ముకున్నారనే ఆరోపణ అవాస్తవం:** కాలువపై దారి కోసం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్‌రెడ్డి పైపులు ఇప్పిస్తే స్థానిక అధికార పార్టీ నాయకులు అమ్ముకున్నారన్న ఆరోపణ అర్థంలేనిది, అవాస్తవని గ్రామ నాయకులు దుబ్బాక అమరేందర్‌రెడ్డి, దుబ్బాక రజనీకాంత్‌రెడ్డి, వడ్డేగాని నర్సింహ్మాలు అన్నారు. అసలు పైపులే రానిది అమ్ముకునేది ఎలా ఉంటుందన్నారు. రైతులకు అన్యాయం చేయడమే కాకుండా ఆరోపణలు చేయడం సిగ్గుమాలిన చర్యగా వారు ఖండించారు.



## వైవిధ్య పంటలతో రైతుకు భరోసా

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్:** రైతులు సాంప్రదాయ ఏకపంట సాగుపై మాత్రమే ఆధారపడకుండా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణ వైపు అడుగులు వేయాలని ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించే లక్ష్యంతో అన్యధా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నకిరేకల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటల మార్పిడి ద్వారా రైతుల ఆదాయ వనరులు పెరగడంతో పాటు వ్యవసాయ రంగానికి స్థిరత్వంచేకూరుతుందన్నారు.జిల్లా వ్యవసాయ అధికారి వి. వినోద్‌కుమార్ మాట్లాడుతూ జనప పంటతో పాటు ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత స్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. రైతులకు ఆయా పంటల సాగు విధానాలు, లాభదాయకత, మార్కెట్ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.ఈ సందర్భంగా చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి,పెరేపల్లి గ్రామాలకు చెందిన 25 మంది రైతులకు 100 ఎకరాల్లో జనప నార పంట సాగు కోసం సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆసక్తి చూపేలా ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. సమావేశానికి నకిరేకల్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (ఏడీఏ) టి.విజయేందర్‌రెడ్డి సమన్వయం వహించారు.ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి,నకిరేకల్ మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ జాని మియా,మహేందర్ రెడ్డి, పన్నాల రాఘవరెడ్డి పాల్గొన్నారు.
పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను ఘనంగా సన్మానించారు.తాటికల్ రోడ్డులోని శ్రీ మార్కండేయ నగర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనుల కోసం రూ.35 లక్షలు మంజూ రు చేసినందుకు సంఘం నాయకులు శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.

## 20న జాతీయ లోక్ అదాలత్



**ప్రజాపక్షం/రామన్నపేట :** భారత జాతీయ న్యాయ సేవా సంస్థ , తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థల ఆదేశాల మేరకు, 2026 జూన్ 20వ తేదీన జాతీయ లోక్ అదాలత్ను మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, రామన్నపేట ఆధ్వర్యంలో రామన్నపేట జూరిస్డిక్షన్ పరిధిలో నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జికమ్‌చైర్మన్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, రామన్నపేట జి.సబిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామన్నపేట జూరిస్డిక్షన్ పరిధిలోని న్యాయ స్థానాలలో పెండింగ్లో ఉన్న రాజీకి అనుకూలమైన సివిల్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార దావాలు,బ్యాంకు రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు, కార్మిక వివాదాలు, విద్యుత్ సంబంధిత వివాదా లు, అలాగే ఇతర ప్రీలిటిగేషన్ , పెండింగ్ కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కోసం ఎస్.శిరీష, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి,రామన్నపేట, వి.రత్న కుమారి, అదనపు జూని యర్ సివిల్ జడ్జి రామన్నపేట డి. సత్తయ్య ,ద్వితీయ శ్రేణి న్యాయ మేజిస్ట్రేట్, రామన్నపేట తమ తమ న్యాయస్థానాల పరిధిలో రాజీకి అనుకూలమైన కేసులను గుర్తించి లోక్ అదాలత్లో పరిష్కారం కోసం చర్యలు చేపడుతున్నారని తెలిపారు.

## సాదా బైనామాల దరఖాస్తుదారులకు పట్టాలు ఇప్పించాలి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని ఆయా గ్రామాల్లో సాదాబైనామా భూముల రిజిస్ట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న రైతులు,పేదలకు విచారణ చేపట్టి వెంటనే పట్టాలు ఇప్పించాలని తుర్కపల్లి సీపీఐ మండల కార్యదర్శి సిలివేరు దుర్గయ్య అధికారులను డిమాండ్ చేశారు. 50 నుంచి 60 సంవత్సరాల నుండి భూమిపై కాస్తూ చేస్తూ జీవిస్తున్నారని,కానీ ప్రభుత్వ రెవెన్యూ అధికారులు ఆ గ్రామాలకు వెళ్లకుండా,సమగ్ర సర్వే నిర్వహించకుండా, గతంలో జరిగిన క్రయవిక్రయాలు, సాధబైనామాలు ప్రక్కనపెట్టి, దళారుల తో చేతులు కలిపి,సాదాబైనామా ఉన్న రైతులకు పట్టా పాస్ బుక్కులు ఇవ్వకుండా అన్యాయానికి గురిచేస్తున్నారని,ఇప్పటికైనా చట్ట నిబంధనలు ప్రకారం,పేద రైతులను గుర్తించి న్యాయంగా రైతులకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. లేనియెడల సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నా చేపడుతామని తెలిపారు. సీపీఐ నాయకులు కాశబోయిన పెద్దులు, కలకుంట్ల సత్యనారాయణ, వలపు భగవంతు,తదితరులు ఆయనతో ఉన్నారు.

## 21న ఉద్యమకారుల సమ్మేళనం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఈనెల 21న హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ రథసారధి, విద్యార్థి జెఏసి చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఖమ్మం క్రాస్ రోడ్డు అంబేద్కర్ విగ్రహం ఎదుట ఉద్యమకారుల సమ్మేళన పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని, ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఉద్యమకారులకు ఫించన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ జెఏసి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండమీది గోవిందరావు, కాంగ్రెస్ నాయకులు బొజ్జ సంజయ్, అజయ్, విజయ్, కిరణ్, శంకర్, చిట్టిబాబు, వంశీ పాల్గొన్నారు.



## సమస్యలపై మంత్రి కొండా సురేఖకు వినతి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ అండర్ రైల్వే గేట్ ప్రాంత వాసులు, శివనగర్ ప్రాంత వాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై నగర కాంగ్రెస్ నాయకులు శ్రీరాం రాజేష్ అటవీ, పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన అండర్ బ్రిడ్జి క్రింద నుండి మురుగునీరు రోడ్డు మీద వెలుతుందని, గత కొన్ని సంవత్సరాలుగా ఈ విధంగానే జరుగుతుందన్నారు. రోడ్డు మీద నుండి నడుచుకుంటు వెళ్లు పాదాచారులకు చాలా ఇబ్బందులు పడుతున్నారని, పాదాచారులకు చాలా ఇబ్బందులు అవుతుందన్నారు. అదేవిధంగా శివనగర్ పుప్పాల గుట్ట ప్రాంత వాసులు రోజు కూలి, హమాలీ పనుల కోసం రైల్వేస్టేషన్ నుండి అవతలికి ప్రక్కకు వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎందుకంటే రైల్వే స్టేషన్ టిటిఈలు, రైల్వే పోలీస్ వారు ఆపి ఇబ్బందులు పెట్టి ఫైన్‌లు రాస్తున్నారని, కావున అవతలికి వెళ్లడానికి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేసి ఈ ప్రాంత వాసుల చిరకాల వాంఛను నెరవేర్చ గలరని వివరించారు. మధ్యలోనే నిలిపివేసిన అండర్ గ్రైండ్ డక్ట్‌ను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని, లేకుంటే వచ్చే వర్షాకాలంలో శివనగర్ మరల వరద ముంపుకు గురవుతుందని వివరించారు. ఈ విషయాలపై మంత్రి స్పందించి నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

## జనగామ -సూర్యాపేట రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** మండలంలోని నవాబుపేట గ్రామంలో జనగామ సూర్యాపేట రహదారి పై అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హన్మకొండ లష్కర్ బజార్,కాజీపేటకు చెందిన మహ్మద్ ఇమ్రాన్, మహ్మద్ సుభాన్ అక్కడికక్కడే మృతి చెందటంతో టీపిసిసి మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులుజమాల్ షరీఫ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేరారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురు త్వరగా కోలుకోవాలని దేవుడిని కోరుకున్నారు. ప్రమాదకరమైన ప్రాంతంలో తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## హత్యాయత్నం కేసులో ప్రియుడు,ప్రియురాలు అరెస్టు: ఎస్ఐ



**ప్రజాపక్షం/టేకుమట్ల :** భూపాలపల్లి జిల్లా మండలంలోని వెంకట్రావ్‌పల్లి(బి) గ్రామానికి చెందిన బచ్చల రవిపై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అమూల్య తెలిపారు.ఎస్సై అమూల్య తెలిపిన వివరాల ప్రకారం బచ్చల చిన్న రవి, భార్య లక్ష్మీ ప్రియుడు ఈర్ల రవి తో కలిసి భర్తను హత్య చేయడానికి కుట్ర పన్నింది. తమ వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా వస్తున్నాడనే కారణంతో బుధవారం రాత్రి భర్త నిద్రిస్తున్న సమయంలో ప్రియుడిని ఇంటికి పిలిపించి భర్తను కాళ్లకు విధ్యుత్ తీగలు అమర్చి విధ్యుత్‌షాక్‌తో హత్య చేయాలని ప్రయత్నించారు.ఆ సమయంలో రవికి సృహ రావడంతో వెంటనే స్థానాకులను అప్రమత్తం చేశాడు.నిందితులు అక్కడి నుండి పరారయ్యారు.భాదితుడు బచ్చల చిన్నరవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు హత్యాయత్నానికి పాల్పడిన లక్ష్మీ ,ఈర్ల రవిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అమూల్య వెల్లడించారు.

## ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** 2026–27 సంవత్సరానికి గాను జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులు 1వ తరగతికి 15, 5వ తరగతికి 37లలో మిగిలిన సీట్లకొరకు బెస్ట్ అవైలబుల్ పథకం కింద ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి ప్రారంభించడం జరుగుతుందని, దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరి తేదీ ఈనెల 22వ తేదీ అని తెలిపారు. ఆసక్తి గల ఇద్యార్థులు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ జనగామ కార్యాలయంలో దరఖాస్తు ఫారం పొంది పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో 22వరకు సమర్పించాలన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ గోపాలరావు

**ప్రజాపక్షం/ములుగు:** వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ములుగు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాలరావు అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ గోపాల్‌రావు మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నియంత్రణ, పల్స్ పోలియో కార్యక్రమం పట్ల వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పర్యవేక్షకులను సమన్వయ పరచుకొని, జిల్లా ప్రోగ్రాం, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు పటిష్టమైన ప్రణాళికలను తయారు చేసుకోవాలని, ప్రణాళికయుతంగా ప్రతి ఉద్యోగి పనిచేసి వర్షాకాలంలో వచ్చే వ్యాధులను నియంత్రించాలని, అలాగే జూన్ 28వ తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నియంత్రణ మందులను సమకూర్చుకోవాలని లేనియెడల డిఎంహెచ్ఓ ఆఫీస్‌కు ఇండెంట్ పంపించాలని, ఇతర అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను 100 శాతం సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుధీర్, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రంజిత్, డాక్టర్ నాగ అనేష్, మాస్ మీడియా అధికారి సంపత్, డిపిఎంఓ సాంబయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దుర్గారావు, శకుంతల, ఆఫీస్ సూపరింటిండెంట్ గణేష్, ఎస్ఓ స్వరూప రాణి, సబ్ యూనిట్ ఆఫీసర్స్ భూపాల్, సాంబయ్య, డిడిఎం ప్రవీణ్, నిఖిల్, సిబ్బంది పాల్గొన్నారు.

# రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు



మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/ములుగు:** మల్లంపల్లి మండలంలోని ముద్దునూరు తండా గ్రామంలో రూ.1కోటి వ్యయంతో 30 ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత మంజూరు, శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించి, మంజూరు పత్రాలను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, ఎం సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సర్ రేగ కళ్యాణి, ఆర్‌డిఓ కృష్ణవేణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, గ్రామాల సర్పంచ్‌లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తహసీల్దారు, ఎంపిడిఓ, సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

**ములుగులో ఘనంగా అస్మిత సైక్లింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ:** ఈ నెల 14వ తేదీ ఆదివారం ఉదయం ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అస్మిత సైక్లింగ్ పోటీలు పోస్టర్‌ను రాష్ట పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు బోర్కడే, డిఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్(రెవెన్యూ) మహేందర్ జి, లోకడ బాడీస్ అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్‌లు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ క్రీడలు యువతలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొదించడంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. నేటి యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని, సైక్లింగ్ వంటి క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అలాగే బాధం ప్రవీణ్‌ను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు బోర్ఖడే మాట్లాడుతూ యువత క్రీడల వైపు మరింతగా ఆకర్షితులయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి కూడా క్రీడాకారులు వెలుగులోకి రావాలని, అస్మిత సైక్లింగ్ పోటీలు అందుకు మంచి వేదికగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్‌రావు, సైక్లింగ్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్, సైక్లింగ్ కోచ్ శ్రీరామ్, క్రీడాకారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్మించిన అంగన్వాడి భవనాన్ని శుక్రవారం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆత్మకూర్ ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ గ్రామాల అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించి నారు. ప్రీ ప్రైమరీ స్కూల్ లు ఏర్పాటు చేయబోతున్నామని, డైట్ చార్జెస్ పెంపు, అత్యాధునిక విద్యా ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.మండలంలోని కటాక్షపూర్, నీరుకుల్లా, పెంచికల పేట, పెద్దాపూర్, లింగమడుగుపల్లె, అక్కంపేట, నాగయ్య పల్లె, అగ్రంపాడు, చౌల్లపల్లి, ఆత్మకూర్, మలకపేట, కొత్త గట్టు, మొదలగు గ్రామాలలో సిసి రోడ్లు సైడ్ కాలువలకు వర్చువల్‌గా పాఠశాలలో ఏర్పాటుచేసిన శిలాఫలకలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఎమ్మార్వో జగన్మోహన్ రెడ్డి ఎంపీఓ వివిధ శాఖల ఇంజనీర్లు పై గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ నాయకులు రేవూరి జలంధర్ రెడ్డి, రమేష్, కంచ రవికుమార్, పర్వతగిరి రాజు, పరికిరాల వాసు, రేవూరి జైపాల్ రెడ్డి కక్కర్ల రాజు, అంగన్వాడి ఆయాలు టీచర్లు మహిళలు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితానే ఎన్నికల విజయానికి తొలి అడుగు

ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమానికి శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజుతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బూత్ స్థాయి నాయకులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ దేశంలో వరుసగా నాలుగోసారి కేంద్రంలో అధికారాన్ని నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో బీజేపీ ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తోందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ప్రజల తీర్పుతో గెలిచే పరిస్థితి లేకపోతే, ఓటర్ల జాబితాల ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలనే బీజేపీ కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు.తెలంగాణలో బీజేపీకి అధికారంలోకి వచ్చే అవకాశం లేదనే విషయాన్ని గుర్తించిన ఆ పార్టీ, ఏదో ఒక మార్గంలో రాజకీయ లబ్ధి పొందేందుకు ఓటర్ల జాబితాలనే ఆయుధంగా ఉపయోగిస్తోందని అన్నారు. అందుకే ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, ప్రతి బూత్ అధ్యక్షుడు, ప్రతి బీఎల్ఎలు అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అనేక ప్రాంతాల్లో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరిగాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఓటు వేశాం కదా అనే నిర్లక్ష్యం ప్రమాదకరమని, రేపు జాబితాలో పేరు లేకపోతే ప్రజాస్వామ్య హక్కే కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీ రాజ్యసభకు ఒక మహిళను పంపాలని నిర్ణయించిన సందర్భంలో మీనాక్షి నటరాజ్ గారిని చిన్న ఎఫ్ఐఆర్ పేరుతో అడ్డుకోవడం బీజేపీ మహిళల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని విమర్శించారు. మహిళా సాధికారత గురించి మాట్లాడే పార్టీ, ఆచరణలో మాత్రం మహిళలకు అడ్డంకులు సృష్టిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వ రాజు సారయ్య, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ శంకర్ నాయక్, టీపీసీసీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇంచార్జ్ నాగ సీతారాములు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు, వెంకట్రామ్ రెడ్డి, మహ్మద్ అయూబ్, ప్రియాంక అనిల్, పింగళి వెంకటరాం నరసింహారెడ్డి,దేవేందర్ రావు, సారంగపాణి, వివిధ పీఏసీఎస్ చైర్మన్లు, మండల, బ్లాక్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక వివాహాలు అభినందనీయం

కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ కలెక్టరేట్ కార్యాలయంలో శివానందగురు కల్చరల్ ట్రస్ట్, ములుగు రోడ్ ఆధ్వర్యంలో చేపట్టిన కల్యాణమస్తు కార్యక్రమంకు సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని అన్ని ప్రాంతాలలో గ్రామ స్థాయి కుల పెద్దలు, సామాజిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ముందుకు వచ్చి పేదలకు భారంగా మారుతున్న వివాహాలను సమిష్టిగా నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. కల్యాణమస్తు కార్యక్రమం పేదల సంక్షేమానికి దోహదపడే ఆదర్శ కార్యక్రమమని, ఇది ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. శివానందమూర్తి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ మాట్లాడుతూ ఈ నెల 24 వ తేదీన ఉదయం 8 గంటలకు ములుగు రోడ్డు లోని సప్తదాం లో 18 జంటలకు వివాహం చేస్తున్నామని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివాహం కుదుర్చుకొని పెళ్లి చేసుకోవాలనుకునే జంటలు వెంటనే 9848423133 నంబర్‌కు సంప్రదించాలని కోరారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు ట్రస్ట్ ఆధ్వర్యంలో సమన్వయంతో నిర్వహించబడతాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్టీలు బండారు సాయి నారాయణ, జి. ఉమాశంకర్, మాదారపు సదాశివుడు, డాక్టర్ రవీందర్, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## జులై 2వ వారంలో హైదరాబాద్‌లో తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు



**ప్రజాపక్షం/ జనగామ టౌన్ / జనగామ :** తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గబ్బెట గోపాల్ రెడ్డి భవనంలో తెలంగాణ గిరిజన సమాఖ్య ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు భూక్య సంతోష్ నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా అంజయ నాయక్ పాల్గొని జులై 2వ వారంలో హైధరాబాద్‌లో జరుగు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 2వ వారంలో హైధరాబాద్‌లో జరుగు మహాసభలను గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. జిల్లా గౌరవ అద్యక్షునిగా మాలోత్ సీతారాం నాయక్, జిల్లా అద్యక్షునిగా సంతోష్ నాయక్, ఉపాధ్యక్షులుగా విజయ, ప్రధాన కార్యదర్శిగా రమేష్, సహాయ కార్యదర్శిగా సఖి బాయ్, కోశాధికారిగా శ్రీకాంత్‌తోపాటు ఆరుగురిని ఆఫీస్ బేరర్ సభ్యులుగా 9 మంది కార్యవర్గ సభ్యులుగా మొత్తం 21 మందితో జిల్లా కమిటి ఎన్నుకోవడం జరిగింది.

## విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతాభావం పెంపొందించడమే లక్ష్యం

కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**ప్రజాపక్షం/వరంగల్:** విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతాభావం పెంపొందించడమే లక్ష్యమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. వరంగల్ కలెక్టరేట్‌లో పర్యావరణ పరిరక్షణ, హరితహారం కార్యక్రమ విస్తరణ, విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతాభావం పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్‌జిసి), జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న "ఏక్ పెడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో మొక్కను నాటడం) సోవింగ్ టూ గ్రోవింగ్ 2026" జాతీయ స్థాయి విద్యార్థి పర్యావరణ పోటీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ డా. సత్యశారదఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా ప్రకృతితో అనుబంధాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. "ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా, విద్యార్థుల్లో బాధ్యతాభావం, సేవా భావం, ప్రకృతి ప్రేమను పెంపొందించే ఉద్యమంగా మారాలన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి మొక్కను జీవంగా భావించి కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలు, కళాశాలలు ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి విద్యార్థులను భాగస్వాములను చేయాలని కలెక్టర్ సూచించారు. తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్‌జిసి) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ జాతీయ స్థాయి పోటీలో విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, పరిశోధకులు, యువతతో పాటు సాధారణ ప్రజలు కూడా పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం, సీడ్ బాల్స్ తయారీ, పర్యావరణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, వాటి ఫోటోలు, వివరాలను నిర్దిష్ట పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా పోటీలో పాల్గొనవచ్చని వివరించారు. జిల్లాలో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా "హరిత వరంగల్" నిర్మాణానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రతి విద్యాసంస్థ ఈ కార్యక్రమాన్ని ఉద్యమాత్మకంగా తీసుకొని అమలు చేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణను విద్యార్థుల దైనందిన జీవితంలో భాగంగా మార్చడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, ఆఫీసర్ సుజన్ తేజ, సాంబశివరావు, కట్ల శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ కార్యాలయం తనిఖీ



**ప్రజాపక్షం/కాటారం:** మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డి రవిందర్ శుక్రవారం ఆకస్మికంగా తనికీ చేసారు. ఈ సందర్భంగా సలు రికార్డులు, హాసరు పట్టికను, పెండింగ్ దరఖాస్తుల పరిశ్కారం పై ముఖ్య అంశాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ సాదాబైనామాదరఖాస్తుల పరిశ్కారం,రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులు, భూ భారతి పెండింగ్ దరఖాస్తులు, ఎస్ఐఆర్,ప్రజావాణి వినతుల పరిశ్కారం పై అధికారులతో సమీక్షించారు. ప్రజల సమస్యలను త్వరగా పరిశ్కరించాలని సూచించారు. అలాగే పెండింగ్ దరఖాస్తులు వేగవంతంగా పరిశ్కరించేందుకు సిబ్బంది సమన్వయంతోపనిచేయాలని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సేవలందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

## చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ధైర్యంగా చెబుతాం



**ప్రజాపక్షం/కాజీపేట:** చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమం గురించి మేం ధైర్యంగా ప్రజలకు చెబుతున్నామని పదేళ్ల పాలనలో మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పగలరా అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రోజున 47వ డివిజన్ పరిధిలోని డీజిల్ కాలనీ, ఇంపీరియల్ కాలనీలలో రూ.1.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు ప్రజల మౌలిక అవసరాలను పూర్తిగా విస్మరించారని, అభివృద్ధి పనుల గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి లేదన్నారు. అభివృద్ధి చేయలేని వారు, ప్రజల సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడటం చాలా హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్న ఆయన, కేవలం రెండున్నర సంవత్సరాల కాలంలోనే 47వ డివిజన్‌లో రూ.6 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కాజీపేట ప్రాంతం గత పాలనలో ఎలా ఉండేదో, ప్రస్తుతం ఎలా అభివృద్ధి చెందుతోందో ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. ప్రతి కాలనీలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో సంస్థాగత బలోపేతంపై దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, బూత్ ఏజెంట్లని యామక ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## మల్యాల ప్రాథమిక సహకార సంఘం పునః ప్రారంభించాలి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మల్యాల గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం సొసైటీ ని తక్షణమే పునః ప్రారంభించాలని సిపిఐ మండల కార్యదర్శి తండా సందీప్ మండల సహాయ కార్యదర్శి బానో త్ లింగ్యనాయక్ డిసిఓని కలిసి వినతిపత్రం సమర్పించారు. మల్యాల గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం సొసైటీని పునః ప్రారంభించి అక్కడి రైతులను ఆదుకోవాలని కోరారు. కొంత మంది దళారుల చేతిలో రైతులు మోసపోయారని రైతులను ఆదుకోవాల్సిన, కాపాడుకోవలిసిన బాధ్యత సహకారసంఘం అధికారులపై ఎంతైనా ఉందని అన్నారు. మల్యాల గ్రామంలో సహకార సంఘం తీసివేయడంతో అక్కడ వేలాది మంది రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే రైతులకు న్యాయం జరిగేలా చూసి సొసైటీని పునః ప్రారంభించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

“మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న చిరంజీవి 158 పొలాచ్చి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ నిర్మాత వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది.”



# పొలాచ్చి షెడ్యూల్ పూర్తి చేసుకున్న ‘చిరు 158 చిత్రం’



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న చిరంజీవి 158 పొలాచ్చి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ నిర్మాత వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. తాజాగా తమిళనాడులోని పొల్లాచ్చిలో జరిగిన హైఎనర్జీ షెడ్యూల్ను పూర్తి చేశారు. ఈ షెడ్యూల్లో మెగాస్టార్ చిరంజీవి, ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. తదుపరి షెడ్యూల్ త్వరలో ప్రారంభం కానుంది. దశాబ్దాలుగా తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న చిరంజీవి ఈ చిత్రంలో తన కెరీర్లోనే అత్యంత పవర్ఫుల్, ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. ఇందు కోసం ఆయన మరోసారి అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. సంగీతాన్ని ఎస్. థమన్ అందిస్తుండగా, సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తీక్ కన్నన్ చిత్రానికి అద్భుతమైన విజువల్స్ అందించనున్నారు. ప్రొడక్షన్ డిజైన్ అవినాశ్ కొల్లా నిర్వహిస్తుండగా, ఎడిటింగ్ను ఆంటోని ఎల్. రూబెన్ చేస్తున్నారు. కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌పే అందిస్తుండగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి ఆడిషినల్ స్క్రీన్‌ప్లే రచయితలుగా పనిచేస్తున్నారు. భానునందు ద్వయం సంభాషణలను అందిస్తున్నారు.ఈ సినిమాలో అనశ్వర రాజన్ కీలకపాత్రల్లో నటిస్తోంది.



## ‘ప్రేమ డైరీలో చివరి పేజీలు’ షూటింగ్ పూర్తి

అర్జున్ యాదవ్ అదితి జంటగా, శ్రీ ప్రసన్న హనుమాన్ వెంకటేశ్వర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై పి.వి. నరసింహ యాదవ్ నిర్మాణంలో, హరికృష్ణ పామంజి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫీల్ గుడ్ లవ్ స్టోరీ ‘ప్రేమ డైరీలో చివరి పేజీలు’. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని, విడుదలకు ముస్తాబవుతోంది. ప్రముఖ ఆడియో సంస్థ మ్యాంగో మ్యూజిక్ ద్వారా ఇప్పటికే విడుదలైన ఈ చిత్రంలోని పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అర్మాన్ మెరుగు అందించిన మెలోడీ ట్యూన్స్, క్యాచీ లిరిక్స్ సంగీత ప్రియులను అలరిస్తూ, సోషల్ మీడియాలో ట్రెండింగ్లో నిలిచాయి. ఈ సినిమాతో పి.వి. అర్జున్ యాదవ్ హీరోగా పరిచయం అవుతున్నారు. లవ్, ఎమోషన్స్ కలబోసిన ఈ కథలో అర్జున్ యాదవ్ తన నటనతో, పవర్ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను కట్టిపడేయనున్నాడు. మొదటి సినిమా అయినప్పటికీ ఎంతో పరిణతి ఉన్న నటుడిగా, ఒక వైపు లవర్ బాయ్గా.. మరోవైపు ఎమోషనల్ సీన్స్లో జీవించేసి చిత్రానికి మెయిన్ ఎట్రాక్షన్‌గా నిలిచాడు. అర్జున్ యాదవ్ సరసన హీరోయిన్‌గా అదితి నటించగా, వీరిద్దరి కెమిస్ట్రీ సినిమాకు హైలైట్గా నిలవనుంది.తేజ అందించిన సినిమాటోగ్రఫీ ప్రతి ఫ్రేమ్ను ఎంతో అందంగా, రిచ్‌గా చూపించబోతోంది. హృదయాలను హత్తుకునే ఓ అందమైన ప్రేమ ప్రయాణంగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ‘ప్రేమ డైరీలో చివరి పేజీలు’ సినిమా త్వరలోనే థియేటర్లలో సందడి చేయనుంది.

## దర్శకుడిగా మారిన హీరో కిరణ్ అబ్బవరం

### కొత్త సినిమా షూటింగ్ షురూ

హీరో కిరణ్ అబ్బవరం ‘క’, ‘కెర్యాంప్’, ‘ఎస్‌ఆర్ కళ్యాణమండపం’ సంచలన విజయంతో తన రైటింగ్ ట్యాలెంట్ ని ఇప్పటికే చాటుకున్న కిరణ్ అబ్బవరం, ఇప్పుడు హీరోగా, కథా రచయితగా, స్క్రీన్‌ప్లే రచయితగా, దర్శకుడిగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రాన్ని జాయ్ ఫిలమ్స్ బ్యానర్ నిర్మాతగా అరంగేట్రం చేస్తున్న ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ సుధాకర్ చాగంటి నిర్మిస్తుండగా, సురేష్ ఎర్ర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో దేవికా భట్ తెలుగు తెరకు హీరోయిన్గా పరిచయం అవుతున్నారు. సీనియర్ నటులు శరత్ కుమార్, సాయి కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. యూత్ను ఆకట్టుకునే అంశాలతో పాటు కుటుంబ ప్రేక్షకులను మెప్పించే ఎంటర్టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రారంభోత్సవం అనంతరం వెంటనే రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలైంది. తొలి షెడ్యూల్లో ప్రధాన తారాగణం పాల్గొంటోంది.ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ విశ్వాస్ డేనియల్ డీవోపీ వ్యవహరిస్తుండగా, వరుస విజయాలతో దూసుకెళ్తున్న భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.కిరణ్ అబ్బవరం, దేవిక భట్, శరత్ కుమార్, సాయి నటిస్తున్నారు.



## విశాల్ త్రిపాత్రాభినయంతో ‘మకుటం’



‘మార్క్ ఆంటోనీ’, ‘మద గజ రాజా’ చిత్రాలతో విశాల్ మంచి విజయాలను అందుకున్నారు. విశాల్ కెరీర్లోనే ‘మకుటం’ ఓ స్పెషల్ ప్రాజెక్టుగా నిలబోతోంది. హీరోగా, దర్శకుడిగా విశాల్ చేసిన తొలి ప్రాజెక్ట్ ఇదే. సూపర్ గుడ్ ఫిలమ్స్ బ్యానర్లో 99వ సినిమాగా ‘మకుటం’ రూపుదిద్దుకుంటోంది. స్వర్గీయ నిర్మాత ఆర్.బి. చౌదరి ఆధ్వర్యంలో చిత్రం రాబోతోంది. రవి అరసు అందించిన కథ ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణ. తాజాగా టీజర్‌ను విడుదల చేశారు. మండుతున్న శవం.. ఇక ఇందులో అంజలి మాస్ యాక్షన్ను చూడొచ్చు. అంజలి ఓ కొత్త అవతారంలో కనిపించనున్నారు. ఇక విశాల్ అయితే మూడు డిఫరెంట్ గెటప్స్‌లో తన విశ్వరూపం చూపించారు. ఈ టీజర్లోని విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్, బీజీఎం అన్నీ కూడా అద్భుతంగా కుదిరాయి. హీరోగా, దర్శకుడిగా విశాల్ అద్భుతమైన పనితీరుని కనబర్చారని టీజర్ స్పష్టంగా చెబుతోంది. విశాల్ త్రిపాత్రాభినయం, స్టైలిష్ దర్శకత్వం, ఆకట్టుకునే సాంకేతిక నైపుణ్యం, ఆసక్తికరమైన కథనం అన్నీ కలిసి ఈ చిత్రాన్ని అతని కెరీర్లోనే క్రేజీ ప్రాజెక్ట్‌లో ఒకటిగా నిలబెట్టాయి. ‘మకుటం’ జూలైలో విడుదల కానుంది.

పుష్పక విమానం, ఆదిత్య 369 వంటి ప్రయోగాత్మక చిత్రాలను రూపొందించిన సింగీతం శ్రీనివాస్ రావు తన తొభై నాలుగేళ్ళ వయసులో తాజాగా తెరకెక్కించిన చిత్రం ‘సింగ్ గీతం’ అసలు ఈ సినిమా పేరే జనాలకు సరిగ్గా ఎక్కదు...ఎక్కలేదు కూడా. సినిమా ప్రపంచమంతా మరచి పోయిన సింగీతం శ్రీనివాస్ రావును నిర్మాత నాగ్ అశ్విన్ మళ్ళీ ప్రజలకు గుర్తు చేశారని చెప్పవచ్చు. ప్రయోగాలు చేయడంలో దిట్ట అనిపించుకున్న సింగీతం శ్రీనివాస్ రావు ఇప్పుడు కూడా ప్రయోగం చేస్తున్నానని భావించినట్టు ఉన్నాడు. ఒక చెట్టు పెట్టిన శాపం వల్ల ఆ ఊరి ప్రజల మాట పడిపోవడం , ప్రజలంతా మాటలను పాటలుగా పడుకోవడం అనేది ఆలోచనే ఒక మూఢ నమ్మక్కని ప్రేరేపిస్తుంది. సింగీతం శ్రీనివాస్ రావు తీసిన తాజా చిత్రం ‘సింగ్ గీతం’ కథ పూర్తిగా మూఢ నమ్మకం చుట్టూ తిరిగింది. టెక్నాలజీ మారుతున్న ఈ కాలంలో , ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ తో సినిమాలు తీస్తున్న ఈ కాలంలో సింగీతం ఇంకా మూఢ నమ్మకాలను నమ్ముకుని సినిమా తీశాడు. ఈ కథ నలభై ఏళ్ళ క్రితమే రాసుకున్నడని ఈ సినిమా ప్రమోషన్ కు వచ్చిన నటుడు కమల్ హాసన్ చెప్పారు. నిజంగానే ఈ కథను నలభై ఏళ్ళక్రితం తీసి ఉంటె ఈయన చెప్పిన మూఢ నమ్మకం వర్క్ అవుట్ అయ్యేదేమో. కానీ ఈ టెక్నాలజీ కాలంలో ఇలాంటి మూఢ నమ్మకపు కథలను ప్రేక్షకులు నమ్మేలా లేరు. శాపం వాళ్ళ ఊరి ప్రజలంతా రోజు మాట్లాడుకునే మాటలను పాటలుగా పాడుతుంటే సినిమా చూస్తున్న ప్రేక్షకుడికి ఈ సోది ఎప్పుడు ఆపుతారా అనిపిస్తుంటుంది. సినిమా మొదట్లో అందరు బాగానే మాటలు మాట్లాడుతారు. ఎప్పుడైతే ఒక చెట్టు శాపం పెట్టిందో అప్పటినుంచి ఊరి ప్రజలంతా మాటలను పాటల రూపంలో పాడుతుంటారు. మాటలను పాటల రూపంలో పాడటం కొత్త ప్రయోగమే కానీ ప్రేక్షకులకు విసుగొచ్చేస్తోంది.

## మూఢ నమ్మకం మాటున ‘సింగ్ గీతం’

### రివ్యూ



**కథ ఏమిటంటే ?**

పచ్చని చెట్లతో ఆహ్లాదాన్ని పంచె ఊరు కుభేరపురం. ఇక్కడ జరిగే మైనింగ్ వ్యాపారం వల్ల ఇక్కడి చెట్లను నరికి వేస్తుంటారు. సహజ వనరుణాలను దోచేస్తుంటారు. తన తండ్రి వారసత్వంగా వచ్చిన భూములు కుభేరపురం లో ఉండటంతో హీరో ప్రతాప్ (అయాన్) అక్కడికి వెళ్తాడు. అక్కడ మైనింగ్ వ్యాపార ం చేసుకుంటున్న మహిళా పారిశ్రామిక వేత్త షాలినితో పరిచయం ఏర్పడి మైనింగ్ వ్యాపారంలో ప్రతాప్ కూడా భాగస్వామి అవుతాడు. ఇదే ఊరికి చేరిన అమ్మాయి గౌరీ (అహల్య) చెట్లను నరికివేయొద్దని వ్యాపారస్తులను బతిమాలుతోంది. అయినా మైనింగ్ వ్యాపారస్తులు అక్కడ ఉన్న చివరి చెట్టును కూడా నరికివేస్తారు. ఆ చివరి చెట్టును గౌరీ తన తల్లిగా భావిస్తుంది. ఈ చెట్టు నేలకొరిగిన నేపథ్యంలో శాపం ఆ ఊరిని చుట్టుంటుంది. ఆ ఊరిలో ప్రజలకు మాటలు పడిపోయి మాటలు పాడుతాం మొదలు పెడతారు. ఈ చెట్టు శాపం వల్లే ఇలా జరిగింది అని గౌరీ నమ్మకం. మాటలను పాటల రూపంలో పాడుకోలేక జనం తెగ ఇబ్బంది పడుతుంటారు. సినిమా చూసిన ప్రేక్షకుడికి కూడా ఈ పాటల గోల ఎప్పుడు ఖతం అవుతుందా అని చిరాకు వస్తుంటుంది. చివరికి ఈ శాపం నుంచి ఆ ఊరి జనం ఎలా విముక్తి పొందారు. హీరో ప్రతాప్ జైలుకు ఎందుకు వెళ్లాడు ? ఈ కథలో ఉన్న ఫ్లాష్ బ్యాక్ ఏంటి ? అనేది తెరపై చూడాల్సిందే. అయితే నిర్మాత నాగ్ అశ్విన్ కు కల్కి క్లైమాక్స్ లో కలిసొచ్చిన హీరో విజయ్ దేవరకొండను ఇక్కడ కూడా ప్రత్యక్ష పరిచారు. పర్యావరణాన్ని పరిరక్షించాలి అనే కాన్సెప్ట్ మంచిదే కానీ దానికి మూఢ నమ్మకాన్ని జోడించడం వల్ల చూసే వారికీ పెద్దగా ఆసక్తి కరంగా అనిపించదు. నటీనటులు తమ పరిధిలో బాగానే చేశారు. అయితే ఇక్కడ చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే తొంభై నాలుగేళ్ళ వయసులో కూడా సింగీతం శ్రీనివాస్ రావు తన పట్టును కోల్పోలేదని చెప్పడం అతిశయోక్తి కాదు. షాలిని నెగెటివ్ రోల్ లో బాగా నటించింది. అహల్య ఊరిలో ఉండే అమాయక అమ్మాయిగా అద్భుతంగా కనిపించింది. నాగ్ అశ్విన్ నిర్మాణ విలువలు, దేవిశ్రీ అందించిన బ్యాక్ గ్రౌండ్ సంగీతం సాంకేతిక పరంగా అన్ని బాగానే ఉన్నాయని చెప్పవచ్చు.

# నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికకు సిపిఐ పరామర్శ

### దేశంలో, రాష్ట్రంలో బాలికలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో, రాష్ట్రంలో బాలికలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టడానికి ప్రభుత్వం చొరవ చూపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలో జరిగిన అమానుష ఘటనలో గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలికను, ఆమె తల్లిదండ్రులను శుక్రవారం కూనంనేని సాంబశివరావు, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పరామర్శించారు. ఈ సందర్భంగా బాలిక ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

**ఖమ్మం లాంటి ఘటనలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి**

ఖమ్మంలో జరిగినటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాలిక వైద్య ఖర్చులు నిమిత్తం తాను రూ. 10 వేల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. అమ్మాయికి ప్రభుత్వం తరపు నుండి మంచి చదువులు చదివించాలని, వారి కుటుంబ సభ్యులకు గృహ వసతి కల్పించడంతో పాటు రూ. 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంఎల్ఎ వెంట సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు ఫైమీద, పడాల నలిని తదితరులు ఉన్నారు.

## ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడమే తమ ఏకైక డిమాండ్ : ఆర్‌టిసి జెఎసి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడమే తమ ఏకైక డిమాండ్ అని ఆర్‌టిసి జెఎసి నాయకులు స్పష్టం చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జెఎసి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండి.మౌలానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి. యాదగిరి మాట్లాడుతూ కార్మిక సంఘాల ఎన్నికలను ముందుగా నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.ఎన్నికల కంటే ముందే ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు వినతిపత్రం సమర్పించాలని సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. గతంలో మే 1న జరిగిన కార్మిక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్వయంగా ‘ముందు విలీనం కావాలా? లేక ఎన్నికలు కావాలా‘ అనే అంశంపై కార్మిక సంఘాలు తమ అభిప్రాయాన్ని లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారని గుర్తు చేశారు. ఆసూచన మేరకు అన్ని కార్మిక సంఘాలు ఎన్నికల కంటే ముందే విలీనం చేపట్టాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకుని అన్ని కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని, ఉద్యోగుల అభిప్రాయాన్ని గౌరవిస్తూ వెంటనే విలీనానికి సంబంధించిన ‘అపాయింటెడ్ డేట్’ ప్రకటించాలని జెఎసి నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

## ఎన్‌ఒసి జారీచేయండి

(మొదటి పేజీ తరువాయి)

ఛత్తీస్‌గడ్ సిఎం విష్ణు దేవ్ సాయి సానుకూలంగా స్పందించారని, ఈ అంశాన్ని సానుభూతితో పరిశీలిస్తామని హామీనిచ్చినట్లు ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌కు వచ్చిన ఛత్తీస్‌గడ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయితో హైదరాబాద్ లోని పార్క్ హయత్‌లో తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులతో కలిసిరాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఛత్తీస్‌గడ్ ,తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన సమ్మక్కసారక్క ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రాజెక్టు ముంపు, బ్యాక్‌వాటర్ ప్రభావిత ప్రాంతాలపై ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు ఇప్పటికే సంయుక్త సర్వే నిర్వహించారని, మరింత ఖచ్చితమైన సర్వే కోసం ఛత్తీస్‌గడ్ ప్రభుత్వం కోరిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందించిందని గుర్తు చేశారు. సర్వే ఖర్చుల కోసం రూ.9.883 కోట్లను 2026 ఏప్రిల్‌లో ఛత్తీసగడ్ జలవనరుల శాఖకు విడుదల చేసినట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం బీజాపూర్ జిల్లాలో సర్వే పనులు కొనసాగుతున్నాయని, ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావిత భూములు గుర్తించిన నేపథ్యంలో చట్టబద్ధంగా పరిహారాన్ని చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైతే పరిహార మొత్తాన్ని ముందుగానే డిపాజిట్ చేసేందుకు కూడా తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఛత్తీస్‌గడ్ ప్రభుత్వానికి తెలియజేసినట్లు ఆయన వివరించారు. ఈ బ్యారేజ్‌ను ములుగు జిల్లాలోని తుపాకులగూడెం వద్ద నిర్మించడం సాంకేతిక,ఆర్థికంగా మరింత ప్రయోజనకరమని సాంకేతిక అధ్యయనంలో స్పష్టమైందని ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మార్పుతో ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో ముంపు ప్రభావం గణనీయంగా తగ్గిందన్నారు. సమ్మక్కసారక్క బ్యారేజ్ ద్వారా గోదావరి నుంచి 46.96 టిఎంసిల నీటిని మళ్లించి ఎస్‌ఆర్‌ఎస్‌పి స్టేజ్2 కింద 4.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించినట్లు తెలిపారు. అదనంగా రామప్పపాకాల లింక్ కాలువ ద్వారా మరో 30 వేల ఎకరాలకు కొత్తగా సాగునీటి సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా సూర్యాపేట జిల్లాలో 2,34,199 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 96,494 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 85,774 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 22,422 ఎకరాలు, జనగామ జిల్లాలో 1,111 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ప్రయోజనం కలుగుతుందన్నారు. రామప్పపాకాల లింక్ కాలువ ద్వారా ములుగు జిల్లాలో 8,000 ఎకరాలు, వరంగల్ నర్సంపేట ప్రాంతంలో 22,000 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని,అలాగే జె. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకంలోని కొంత ఆయకట్టు స్థిరీకరణకు కూడా ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందన్నారు. ఈ ప్రాజెక్ట్ వల్ల ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని వందలాది గ్రామాలకు తాగునీటి ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన డిపిఆర్‌ను ప్రభుత్వం 2021 ఆగస్టు 31న కేంద్ర జల సంఘానికి సమర్పించిందని, హైడ్రాలజీ డైరెక్టరేట్, కాస్ట్ ఎస్టిమేట్స్ డైరెక్టరేట్, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, కేంద్ర భూగర్భ జల మండలి సహా పలు ప్రధాన అనుమతులు ఇప్పటికే లభించాయని ఆయన చెప్పారు. 2024 జూలై నుంచి 2026 జనవరి వరకు కేంద్ర జల సంఘం కోరిన వివరణలన్నింటికీ తెలంగాణ నీటిపారుదల శాఖ సమగ్ర సమాధానాలు సమర్పించిందన్నారు.

## రోజుకు 200 లీటర్లే

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేసింది. ధరల వ్యత్యాసం కారణంగా బల్క్ వినియోగదారులు పెట్రోల్ పంపుల నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేయడం ప్రారంభించడంతో కొన్ని ప్రాంతాలలో డీజిల్‌కు అసాధారణ డిమాండ్ పెరిగింది. దీంతో దేశ రాజధాని ఢిల్లీలోని పెట్రోల్ పంపుల వద్ద లీటరు డీజిల్ ధర రూ. 95.20 కాగా, బల్క్ సరఫరాదారుల వద్ద లీటర్ డీజిల్ ధర రూ. 134.50గా ఉంది. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై కేంద్రం ఈ ఆంక్షలు విధించింది. పశ్చిమాసియా సంక్షోభం తరువాత పెరిగిన ఇంధన ధరల నుంచి సాధారణ వినియోగదారులను కాపాడటానికి ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు రిటైల్ ధరలను సర్దుబాటు చేయడంతో ఈ వ్యత్యాసం ఏర్పడింది. టెలికాం టవర్లు, విద్యుత్ ఉత్పత్తి, ఇతర ఫీడ్‌స్టాక్ అవసరాల కోసం డీజిల్‌ను ఉపయోగించే పరిశ్రమలు వంటి బల్క్ వినియోగదారులకు మార్కెట్ ధర వసూలు చేస్తుండగా, రిటైల్ అవుట్‌లెట్ల వద్ద ధరలు ఉత్పత్తి వ్యయం కంటే చాలా తక్కువగా ఉన్నాయి. ధరలలోని ఈ వ్యత్యాసం వల్ల పెట్రోల్, డీజిల్‌ను అధిక రేట్లుకు విక్రయించే ప్రైవేట్ రంగ అవుట్‌లెట్లలో అమ్మకాలు తగ్గిపోయాయి. ప్రభుత్వ రంగ సంస్థల పెట్రోల్ పంపుల్లో అమ్మకాలు పెరిగాయి.

**90రోజులపాటు ఆంక్షలు**

కాగా మే నెలలో మూడు ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఒసి, బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్‌లో పెట్రోల్ అమ్మకాలు 4.8 శాతం, డీజిల్ అమ్మకాలు 6.4 శాతం మేర పెరిగాయి. ఈ క్రమంలో రిటైల్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. పరిశ్రమలు, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని వెల్లడించింది. అంతేగాకుండా పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశాలిచ్చింది. ఈ డీజిల్‌ను పునర్విక్రయించకూడదని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని చెప్పింది. అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని ప్రకటించింది.

## దేశ ప్రజలను రక్షించలేరు

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ జలాల్లో మూడు నౌకలపై అమెరికా జరిపిన దాడుల్లో ముగ్గురు భారతీయులు మరణించారు. అయినా మన రాజీపడిన ప్రధాని... ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఏ విదేశీ శక్తి అయినా ఒక భారతీయుడిని హత్య చేసినప్పుడు, ప్రధానమంత్రి మాట్లాడాలి’ అని అన్నారు. కానీ ఆయన ఒక్క మాట కూడా మాట్లాడలేరని, మన నావికుల హత్య జరిగిన కొద్ది రోజులకే, వచ్చే వారం జి7 సదస్సులో మోదీజీ నవ్వుతారని, ఆలింగనం చేసుకుంటారని, ఒప్పందాలపై సంతకాలు కూడా చేస్తారన్నారు. కానీ ఆ ముగ్గురు భారతీయుల కోసం మాత్రం ఆయన ఒక్క మాట కూడా మాట్లాడరని విమర్శించారు. రాజీపడిన మోదీ మాతృభూమి బిడ్డలను రక్షించలేరు అని, ఎందుకంటే ఆ బిడ్డల ప్రాణాలు తీసిన వారిని ఎదుర్కొనే ధైర్యం గానీ, బలం గానీ ఆయనకు లేదన్నారు. అమెరికా అవివేకమైన సైనిక చర్యలను కాంగ్రెస్ గురువారం ఖండించింది. జవాబుదారీతనాన్ని నెలకొల్పడానికి ప్రభుత్వం అవసరమైన అన్ని దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తన వ్యక్తిగత సత్సంబంధాలను ఒక దౌత్య విజయంగా పదేపదే ప్రదర్శించిన మోదీ, ఆ సంబంధం భారతీయ ప్రాణాలను, ప్రయోజనాలను కాపాడటంలో విఫలమైనప్పుడు బాధ్యత నుండి తప్పించుకోలేరని కూడా ప్రతిపక్ష పార్టీ స్పష్టం చేసింది. గత నాలుగు రోజుల్లో ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ఉన్న మూడు వాణిజ్య నౌకలపై అమెరికా సైన్యం దాడి చేసిందని, దీని ఫలితంగా ముగ్గురు పౌరులు మరణించారని, ఈ దాడులపై అమెరికాకు తీవ్ర నిరసన తెలిపినట్లు భారత్ గురువారం పేర్కొంది. భారతీయ సిబ్బందితో ఉన్న మూడు నౌకలను అమెరికా నౌకాదళం లక్ష్యంగా చేసుకుందని న్యూఢిల్లీ బహిరంగంగా అంగీకరించడం ఇదే మొదటిసారి. ఈ దాడులు ఆగాలని న్యూఢిల్లీ స్పష్టం చేసింది. పలావు జెండా కలిగిన ‘మారివెక్స్’ అనే చమురు ట్యాంకర్‌లో 24 మంది భారతీయ నావికులు ప్రయాణిస్తుండగా, ఈనెల 8న అమెరికా దళాలు దానిని అడ్డగించాయి. సిబ్బంది అందరినీ సురక్షితంగా రక్షించారు. 10న, అమెరికా పలావు జెండా కలిగిన మరో ట్యాంకర్ ‘సెట్టెబెల్లో’పై దాడి చేయగా, అందులోని 24 మంది భారతీయ నావికులలో ముగ్గురు మరణించారు. గురువారం, గినియాబిస్సావు జెండా కలిగిన ‘జల్వీర్’ అనే మరో ట్యాంకర్‌పై దాడి జరిగింది. ఇందులో 20 మంది భారతీయులు ఉన్నారు.

## పిటిషన్ కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ అతుల్ ఎస్ చందుర్కర్లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ‘ఆర్టికల్ 32/226 ప్రకారం జోక్యం చేసుకోవాల్సిన కేసులు, నామినేషన్ తిరస్కరణకు సంబంధించిన ఇతర కేసులను గుర్తించడానికి న్యాయస్థానం అంగీకరిస్తే, ఆర్టికల్ 329 పరిధిలో లేని ఒక సూత్రాన్ని ఈ కోర్టు అన్వయించినట్లు అవుతుంది. అంతేకాదు కొన్ని విషయాల్లో కోర్టు జోక్యం చేసుకోవచ్చని, మరి కొన్నింటిని ఎన్నికల ట్రిబ్యునల్ విచారణకు వదిలివేయాలనే వ్యాఖ్యానాలను ప్రోత్సహించేందుకు మేము భయపడుతున్నాం’ అని సుప్రీంకోర్టు పేర్కొంది. ‘భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 329 ఎన్నికల వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోకుండా నిరోధిస్తుంది. కోర్టు కేసుల వల్ల ఎన్నికలు ఆలస్యం కాకుండా చూస్తుంది. అందువల్ల రిటర్నింగ్ అధికారి ఒక అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించిన తర్వాత, ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించడమే ఏకైక మార్గం‘ అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. మీనాక్షి నటరాజన్ తరపు న్యాయవాదిని ఉద్దేశిస్తూ, ‘ఇలాంటి కేసుల్లో తాము జోక్యం చేసుకున్నట్లు ఏదైనా తీర్పును చూపించండి’ అని సుప్రీంకోర్టు అడిగింది. ‘ఆ నిర్ణయం ఎంత తప్పు అయినప్పటికీ, ఒక సారి నామినేషన్ తిరస్కరణకు గురైతే, దాని పరిష్కారం వేరే చోట ఉంటుంది. మేము ఇలాంటి దశలో జోక్యం చేసుకున్నట్లు ఏదైనా ఆధారం ఉందా?’ అని ప్రశ్నించింది. దీంతో నటరాజన్ తరఫున హాజరైన సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వీ తన వాదనలు వినిపిస్తూ, ‘కనీసం రెండేళ్ల శిక్ష పడే అవకాశం ఉన్న క్రిమినల్ కేసును మాత్రమే అభ్యర్థి వెల్లడించాల్సి ఉంటుంది. ప్రస్తుత వ్యవహారంలో కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయి. అయితే ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం క్రిమినల్ కేసులను వెల్లడించలేదనే కారణం చూపిస్తూ, మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారి తప్పుడు విధానంలో తిరస్కరించారు’ అని అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com